


ప్రతి అక్షరం ప్రజల కోసం

www.prajapaksham.in

# ప్రజాపక్షం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 310 | శనివారం | 10-10-2026 | ఖమ్మం

Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12+8 | వెల రూ. 5.00


**నేటి నుంచి బతుకమ్మ ఉత్సవాలు**

వేడుకలకు రూ.10 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

18న ట్యాంక్‌బండ్ వద్ద సద్దుల బతుకమ్మ

03

# ఢిల్లీ దిగ్బంధం

**సిఇసి జ్ఞానేశ్‌కుమార్ తొలగిపోవాలని డిమాండ్ చేస్తూ నేడు జంతర్‌మంతర్ వద్ద ఇండియా కూటమి పార్టీలు, యువజన, విద్యార్థి సంఘాలు, సిజెపి నిరసన ప్రదర్శనలు**




● అనుమతి నిరాకరించిన ఢిల్లీ పోలీసులు ● భద్రత అత్యంత కట్టుదిట్టం ● 25 వేల మంది పోలీసు బలగాల మోహరింపు ● ఢిల్లీకి వచ్చే రైళ్లు రద్దు.. 57 మెట్రో రైల్ స్టేషన్ల మూసివేత.. ఇంటర్‌నెట్ సేవలు బంద్ ● స్కూళ్లు, కాలేజీలపైనా ప్రభావం ● ఆన్‌లైన్ క్లాసులకు యాజమాన్యం మొగ్గు ● పలు రాష్ట్రాల నుంచి ఢిల్లీకి బయలుదేరిన విద్యార్థులు, యువత ఎక్కడికక్కడ నిర్బంధం ● ఎమర్జెన్సీని తలపిస్తున్న దేశ రాజధాని

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ దిగ్బంధంలోకి వెళ్లింది. అత్యవసర పరిస్థితిని తలపిస్తోంది. ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణలో (సర్)లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గత నాలుగు రోజుల నుంచి ఇండియా కూటమి పార్టీలు, యువజన, విద్యార్థి సంఘాలు నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భద్రతను అత్యంత కట్టుదిట్టం చేశారు. వీటికి తోడు శనివారం జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపడతామని ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం రాజధానిని హై అలర్ట్‌లో ఉంచింది. ఎక్కడికక్కడ భద్రతా బలగాలను మోహరించింది. ఢిల్లీ వీధుల్లో అణువణువునా జల్లెడ పడుతున్నారు. ఢిల్లీకి వచ్చే రైళ్లను రద్దు చేశారు. మరి కొన్నింటిని రీ షెడ్యూల్ చేశారు. సెంట్రల్ ఢిల్లీ పరిధిలోని అన్ని మెట్రో స్టేషన్లను అర్ధరాత్రి నుంచే మూసివేస్తున్నట్లు తరువాయి 8లో

## ఈగను చంపేందుకు సుత్తి వాడలేం!

● ఢిల్లీలో మెట్రోస్టేషన్ల మూసివేతపై సుప్రీంకోర్టు వ్యాఖ్య ● భద్రత పేరుతో నగరంలో రాకపోకలన్నీ నిలిపివేయడం సరికాదని స్పష్టీకరణ ● నిరసనలకు ప్రత్యామ్నాయం చూపాలని సూచన



**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) శనివారం తలపెట్టిన నిరసన దృష్ట్యా ఢిల్లీ మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్ల మూసివేతపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆంక్షల వల్ల వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వెల్లడించింది. ఒక ఈగను చంపడానికి భారీ సుత్తిని ఉపయోగించలేమంటూ అభిప్రాయపడింది. భద్రత పేరుతో నగరంలో రాకపోకలన్నీ నిలిపివేయడం సరికాదని స్పష్టం చేసింది. జంతర్‌మంతర్‌కు రాకుండా నివారిస్తున్నప్పుడు శాంతియుత నిరసనలకు ప్రత్యామ్నాయ స్థలం చూపాలని పేర్కొంది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఢిల్లీలో శనివారం నిరసన చేపట్టనున్న నేపథ్యంలో అధికారులు భారీగా ఆంక్షలు విధించారు. నిరసనకారులు సున్నిత ప్రాంతాల వైపు వెళ్లకుండా ముందస్తు చర్యలు తరువాయి 8లో



## మోదీ, అమిత్ షా కలిసి ప్రజాస్వామ్యం ధ్వంసం

● రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మెమోరాండం అందజేసిన ఇండియా కూటమి నేతలు ● జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, సర్ రద్దు చేయాలని, బ్యాలెట్ ద్వారా భవిష్యత్తు ఎన్నికలు నిర్వహించాలని వినతి ● పార్లమెంట్ హౌస్ నుంచి రాష్ట్రపతి భవన్‌కు నిరసన ప్రదర్శన ● ఎంపిలను అడ్డుకున్న పోలీసులు

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియలో అక్రమాలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ రాజీనామా, ఇవిఎంలను రద్దు చేసి తిరిగి బ్యాలెట్ ద్వారా భవిష్యత్తులో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నాయకులు శుక్రవారం రాత్రి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మెమోరాండం అందజేశారు. 'సర్'కు సంబంధించి సిఇసి జ్ఞానేశ్ కుమార్ పెద్ద తప్పు చేశారని, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సిఇసితో కలిసి ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని తరువాయి 8లో



## ఢిల్లీలో ఆందోళనకు ముందే 'ఆంక్షలా'?

ఖండించిన వామపక్ష పార్టీలు

శాంతియుతంగా నిరసన తెలిపే 'ప్రాథమిక హక్కుపై దాడి'గా అభివర్ణన

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల 'ఎస్ఐఆర్', భారత ఎన్నికల సంఘం పనితీరుకు వ్యతిరేకంగా అక్టోబరు 10న దేశ రాజధాని ఢిల్లీలో జరుగనున ఆందోళనల నేపథ్యంలో బిజెపి ప్రభుత్వం విధించిన ఆంక్షలను శుక్రవారం వామపక్ష పార్టీలు ఖండించాయి. శాంతియుతంగా నిరసన తెలిపే పౌరుల ప్రాథమిక హక్కుపై ఇది దాడిగా ఆరోపించాయి. దీనిపై వామపక్ష పార్టీలైన సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్)–లిబరేషన్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పి), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి) ఇక్కడొక సంయుక్త ప్రకటనను జారీచేశాయి. ఢిల్లీ పోలీసులు, కేంద్ర ప్రభుత్వం ప్రదర్శనలో పాల్గొనబోయే వారిని బెదిరించడం ఆపి, ప్రతిపాదిత ప్రదర్శన కోసం వారిని జంతర్ మంతర్ వరకు తరువాయి 8లో

భారత సంతతికి చెందిన

## నవీ పిళ్లెకు నోబెల్ శాంతి



**ఒస్లో:** అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ పురస్కారాలలో ఒకటైన నోబెల్ శాంతి బహుమతి ఈ ఏడాది మానవ హక్కులు, అంతర్జాతీయ న్యాయం, చట్టబద్ధ పాలనకు చేసిన కృషికి గుర్తింపుగా భారతీయ తమిళ మూలాలున్న దక్షిణాఫ్రికా న్యాయవాది నవీ పిళ్లెకు లభించింది. దక్షిణాఫ్రికాలోని డర్బన్ నగరంలో భారతీయ తమిళ మూలాలున్న కుటుంబంలో జన్మించిన నవీ పిళ్లె, దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష అమలులో ఉన్న కాలంలో, తరువాయి 12లో

ఎల్‌నినో ప్రభావంపై 12న

## మంత్రులతో సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ నెల 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ తరువాయి 12లో

జి.ఓ-59 పెండింగ్ దరఖాస్తులకు

## నెల రోజుల్లో పరిష్కారం



● ఏడాదిన్నరలో సమగ్ర భూ సర్వే పూర్తి ● 7 జోన్‌లకు 14 మంది పర్యవేక్షణ అధికారుల నియామకం ● రీ సర్వేలో నాణ్యత, పారదర్శకత, వేగం అత్యంత కీలకం ● రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

జి.ఓ 59 దరఖాస్తుదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 500 చదరపు గజాలలోపు జి.ఓ 59 దరఖాస్తులను నెల రోజుల్లో పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. సచివాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇస్తూ, మెమో నెంబర్ 48030 జారీ చేసినట్లు తెలిపారు. జి.ఓ 59లో అమలులో ఎలాంటి అక్రమాలకు తావులేదని, నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. గతంలో జరిగిన అక్రమాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే జారీ చేసిన కన్వేయన్స్ డీడ్స్‌కు సంబంధించిన కేసులను కూడా సమగ్రంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించామన్నారు. 22ఎ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం శరవేగంగా ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలో 22ఎ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలులో తరువాయి 8లో

## ఆర్‌టిసి ఎన్నికల్లో 98 శాతం పోలింగ్!

● పలు డిపోల్లో ఎంప్లాయీస్ యూనియన్ కూటమి విజయం ● ఈనెల 17న అధికారిక ఫలితాలు ● పదేళ్ల తర్వాత ఓటు హక్కు వినియోగించుకున్న కార్మికులు

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) గుర్తింపు సంఘం ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా 115 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 34,889 మంది ఓటర్లకు గాను 33,973 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సమాచారం. దీంతో తరువాయి 12లో




ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శనివారం
10-10-2026
www.prajapaksham.in

ఎడిట్
PEOPLE'S VIEWS

# బిసి రిజర్వేషన్‌లపై ఎపిలో నిందాక్రీడ

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల (బిసిలు) రిజర్వేషన్‌ను 24 నుంచి 34 శాతానికి పెంపుదల చేస్తూ తెలుగుదేశం – జనసేన – బిజెపిలతో కూడిన ఎన్‌డిఎ ప్రభుత్వం జారీచేసిన జిఒపై నెలరోజులపైబడి జరుగుతున్న రాజకీయ రభసకు తెరపడింది. 34 శాతం రిజర్వేషన్‌లు కల్పించటంవల్ల మొత్తం రిజర్వేషన్‌లు 50శాతం మించరాదని సుప్రీంకోర్టు విధించిన లక్ష్మణ రేఖను ఉల్లంఘించినట్లవుతుందని, అందువల్ల ప్రభుత్వం జిఒ చెల్లుబాటుకాదని హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం తీర్పుచెప్పటంతో రాష్ట్రంలో మున్సిపల్, పంచాయతీరాజ్ ఎన్నికల నిర్వహణకు లైన్‌క్లియర్ అయింది. శనివారం జరిగే మంత్రివర్గ అత్యవసర సమావేశం ఎన్నికల నిర్వహణపై తుది నిర్ణయం తీసుకుంటుంది. అయినా బిసి రిజర్వేషన్‌లపై కూటమి – ప్రతిపక్ష వైఎస్సార్ సిపి మధ్య నిందాక్రీడ కొనసాగుతూనే ఉంది. రెండుపార్టీల మధ్య (టిడిపి–వైసిపి) రాజకీయ నిందాక్రీడలో బిసి రిజర్వేషన్ అంశం ఒకటి. బిసిల ఉద్ధారకులం తామంటే తామని క్లెయిం చేసుకుంటూ ఎదుట పక్షాన్ని నిందిస్తుంటాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనానంతరం పరిశేష రాష్ట్రంలో 2015లో అధికారంలోకి వచ్చిన టిడిపి చంద్రబాబునాయుడు నాయకత్వంలో స్థానిక ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్‌ను 34 శాతానికి పెంచుతూ చట్టం చేసింది. 2020లో అధికారంలోకి వచ్చిన వైసిపి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించబోగా ఆ చట్టం చెల్లుబాటును – 50శాతం లక్ష్మణరేఖ అతిక్రమణ కారణంతో హైకోర్టు కొట్టివేసింది. అప్పుడు 24శాతం రిజర్వేషన్‌తో ఎన్నికలు జరిపారు. 2024లో కూటమి ప్రభుత్వంగా తిరిగి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు బిసి జనాభా సంఖ్య నిర్ణయానికై 2026 ఫిబ్రవరి 19న రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా చైర్మన్‌గా డెడికేటెడ్ కమిషన్‌ను నియమించారు. బిసిల రిజర్వేషన్‌ను పంచాయతీరాజ్ సంస్థల్లో 34శాతానికి, మున్సిపల్ సంస్థల్లో 33.33 శాతానికి పెంచుతూ 2026 ఆగస్టు 18న జిఒ జారీచేసి, 24 శాతానికి తగ్గించిన గత ప్రభుత్వాన్ని నిందిస్తూ, తానే బిసిల ఛాంపియన్‌గా ప్రచారం చేసుకున్నారు. అసలు బిసిలకు రిజర్వేషన్ కల్పించిందే ఎన్.టి.రామారావు గనుక వారి పుట్టిల్లు తమదేనన్నారు. అయితే హైకోర్టులో, సుప్రీంకోర్టులో ప్రభుత్వానికి చుక్కెదురైంది. మొత్తం రిజర్వేషన్‌ల పరిమితి 50శాతం దాటితే ఆ రిజర్వేషన్‌ను కోర్టులు కొట్టివేస్తాయని చంద్రబాబు నాయుడికి తెలియదా? తెలుసు. డెడికేటెడ్ కమిషన్‌ను చూపుతూ 34శాతం రిజర్వేషన్ ఇచ్చేది తామేనని బిసిలను దగ్గరకు తీసుకోవటానికి ఆయన ఈ కాలాన్ని ఉపయోగించుకున్నారు. ప్రత్యర్థి పార్టీని బిసి ద్రోహిగా నిందించారు. వైసిపి ఎదురుదాడి చేస్తూ చంద్రబాబును మోసకారిగా దాడి చేస్తోంది. ఆ విధంగా రెండు పార్టీలు తమ కార్యకర్తల్లో ఎన్నికలకు అవసరమైన రాజకీయ వేడి రగిలించాయి.

తెలంగాణ ప్రభుత్వం మరింత లోతుగా, శాస్త్రీయంగా బిసి జనగణన నిర్వహించింది. అయినా కేంద్రప్రభుత్వం దాన్ని ఆమోదించలేదు. స్థానిక ఎన్నికలు నిర్వహించకపోతే గ్రామీణాభివృద్ధికి ఫైనాన్స్ కమిషన్ నిధులు కోల్పోయే ప్రమాదం ఉన్నందున గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. ఎంపిటిసి, జడ్‌పిటిసి, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు బాకీ ఉన్నాయి.

రాష్ట్రం ఏదైనా, అధికారంలో ఉన్న పార్టీ ఏదైనా రెండు అంశాలు లోతుగా చర్చనీయాంశాలు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలు మూడవ దొంతర పరిపాలనా సంస్థలని, వాటికి కూడా లోక్‌సభ, అసెంబ్లీలవలె ఐదేళ్ల పదవీకాలం ముగిసేలోపే ఎన్నికలు నిర్వహించాలని 73, 74 రాజ్యాంగ సవరణలు జరిగినా, అవి ఆచరణకు నోచుకోవటం లేదు. పాలక పార్టీలు తమకు అనుకూల సమయం కోసం కాలయాపన చేస్తూ రాజ్యాంగ ఉల్లంఘనకు ఒడిగడుతున్నాయి. స్థానిక సంస్థల ఓటర్ల సవరణ, రిజర్వేషన్‌ల ఖరారు వంటి అంశాలు వాటిచేతిలో ఉన్నందున, ఏదోక అంశంపై ఎవరో ఒకరిచేత కోర్టు కేసులు వేయించి ఎన్నికలు జాప్యం చేస్తూ, అధికారుల ద్వారా పాలన నిర్వహిస్తున్నాయి. దీనికి ముగింపు పలికే మార్గం పార్లమెంటు ఆలోచించాలి.

రెండు, జనాభా దామాషాలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లకై బిసి సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. అందుకోసమే తాజా జనాభా లెక్కల సేకరణలో బిసిల గణన చేర్చాలని డిమాండ్ చేస్తున్నాయి. జనగణనలో కులగణనకు కేంద్రప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించినప్పటికీ దానిపై స్పష్టత రావాల్సి ఉంది. రెండోవైపున, మొత్తం రిజర్వేషన్‌లు 50 శాతం దాటరాదన్న సుప్రీంకోర్టు ఆంక్ష ఆటంకంగా కొనసాగుతోంది. లోక్‌సభ, అసెంబ్లీల్లో బిసిలకు రిజర్వేషన్ లేదు. మహిళా రిజర్వేషన్‌లో ఒబిసి మహిళలకు కోటా కోసం లాలుప్రసాద్ ఒత్తిడి చేసినపుడు ఆ అంశం ఆటంకంగా ముందుకు వచ్చింది. ఆ సమస్యే యుపిఎ ప్రభుత్వ హయాంలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదాన్ని నిరోధించింది. మండల్ కమిషన్ జనాభాలో ఒబిసిలు 50 శాతంపైగా ఉంటారని అంచనా వేసి కూడా, మొత్తం రిజర్వేషన్‌లు 50శాతం దాటకూడదనే సుప్రీంకోర్టు ఆంక్ష కారణంగా విద్య, ఉద్యోగాల్లో 27శాతం రిజర్వేషన్‌ను సిఫారసు చేసినట్లు చెప్పటం గుర్తుచేసుకోదగింది. అందువల్ల బిసిల ఓట్లకోసం వారిపట్ల ఎవరెంత సహానుభూతి ప్రదర్శించినా ఇది అఖిలభారత సమస్య. ఒబిసిలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయంకోరే రాజకీయ శక్తులు ఏకత్రాటిపైకి వచ్చి కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఏకాభిప్రాయ సాధనతో రాజ్యాంగ సవరణ చేయించటమే ఉత్తమమార్గం.

ఒక రాష్ట్ర జనాభా పొందికను బట్టి ప్రత్యేక కమిషన్‌ను నియమించి ఒబిసిల జనాభా లెక్కలు కచ్చితంగా తేల్చి, రిజర్వేషన్ శాతంపై అసెంబ్లీలో చట్టం చేసి, దానికి రాజ్యాంగ రక్షణ కల్పిస్తూ 9వ షెడ్యూలులో చేర్చేటట్లు చేయటం మరోమార్గం. దీనికి పార్లమెంటు ఆమోదం అవసరం. కావున ఇది ఎంతో కష్టతరమైన మార్గం.



## జెన్ జీకి భయపడుతున్న కేంద్రం

**మా జంతర్‌మంతర్ నిరసనను అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఢిల్లీని సైనిక కోటలా మార్చింది. ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించడం సరికాదు. జెన్ జీని చూసి కేంద్రం భయపడుతోంది. యువతను చూసి అంతగా భయపడుతుంటే దేశం మొత్తాన్ని మూసివేయండి. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు ఢిల్లీ ప్రైవేట్ ప్రాపర్టీ కాదు.**

– సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే

# ఓటు హక్కు ఉద్యమం తొలివారం గ్రాండ్ సక్సెస్

గ్యాన్‌పాఠక్

సిఇసి (ఎన్నికల ప్రధానాధికారి)కి వ్యతిరేకంగా ఆందోళన తొలివారం (అక్టోబర్ 2–8) భారతదేశంలో విశాలమైన ఓటుహక్కు ఉద్యమానికి ఆరంభంగా కనిపిస్తోంది. ఈ ఆందోళనకు ఇండియా కూటమిలోని 19 పార్టీలు సెప్టెంబరు 30న పిలుపు ఇవ్వటం గుర్తుచేసుకోదగింది. ఈ ఆందోళనలో అనేక స్రవంతులు కలుస్తున్నాయి: ఇండియా కూటమి పార్టీలు, కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) నాయకత్వంలో యువత, విద్యార్థి సంఘాలు, పౌరసమాజ క్రియాశీలురు, విద్యావేత్తలు, ఎక్కువగా సాధారణ పౌరులు చేరారు. గమనించాల్సిన తదుపరి పెద్ద విషయం ఈరోజు అక్టోబర్ 10 ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద సమీకరణ.








సిఇసి వ్యతిరేక ఆందోళన తొలివారం సాధించిన గొప్ప విషయం దాని రాజకీయ, సామాజిక పునాది విస్తరించటం, భౌగోళికంగా కూడా దాని వ్యాప్తి పెంపొందటం. రాజకీయ పునాది విస్తరణకు సంబంధించి తమిళనాడుకు చెందిన పాలక టివికె ఇండియా కూటమిలో చేరటం. దాని ఆందోళన కార్యక్రమం రాష్ట్రంలో వచ్చేవారం మొదలవుతుంది. ఇండియా కూటమిలో భాగస్వామి కాని డిఎంకె ఆ కూటమి ఆందోళనను ఆలస్యంగా బలపరిచింది. కూటమి లో భాగస్వామి కాని ఆప్ (ఎఎపి) సొంతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇండియా కూటమిలో భాగస్వామి కాని బిజూ జనతాదళ్ (బిజెపి) అక్టోబర్ 6న ఎన్నికల కమిషన్ కార్యాలయానికి ఎంపిల ప్రదర్శనలో పాల్గొన్నది.

సామాజిక పునాది విస్తరణకు సంబంధించి –సిజెపితో సంబంధమున్న యువత ముంబై, బెంగళూరుల్లో సమీకృతమై ప్రదర్శనలు జరిపారు. ఎఐఎస్ఎ, ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్‌లకు చెందిన విద్యార్థి గ్రూపులు కూడా పాల్గొన్నాయి. పౌరసమాజం నిర్వహించిన ప్రదర్శనల్లో విద్యావేత్తలు, న్యాయవాదులు, కళాకారులు, ఇతర సర్వసాధారణ ప్రజలు పాల్గొన్నారు. పేరొందిన ప్రముఖులు చాలా మంది ఈ ప్రదర్శనల్లో పాల్గొంటున్నారు. అక్టోబర్ 8 నాటికి ఈ నిరసన ప్రదర్శనలు దాదాపు అన్ని రాష్ట్రాలకు విస్తరించాయి. ఢిల్లీ, కర్నాటక, బిహార్, ఒడిసా, మహారాష్ట్ర, హర్యానా, తెలంగాణ, త్రిపుర ప్రత్యేకించి ప్రస్తావించదగినవి. ఉత్తర ప్రదేశ్‌లో కూడా ఆందోళన కార్యక్రమాలు ప్రకటించబడ్డాయి.

నిరసనలు ఆ విధంగా కలిసిపోవటం, భౌగోళికంగా విస్తరణ పెరగటం, భారతదేశంలో అతిపెద్ద ఎన్నికల హక్కుల పోరాటానికి ఆరంభాన్ని సూచిస్తున్నది. ఇది ఇంకెంత మాత్రమూ రాజకీయ పార్టీల నాయకత్వంవహిస్తున్న ఉద్యమం కాదు. అలా కొట్టిపారేయ వీలులేదు. ఇది విస్తృత విభాగాల ప్రజల్లోకి వెళ్లినందున ప్రతిపక్ష రాజకీయాలుగా చిత్రించవీలులేదు.

సిజెపిని ఈ ఎన్నికల హక్కుల ఉద్యమంలో భిన్నమైన ఫ్రంట్‌గా చూడాలి. వారు సిఇసి రాజీనామా లేదా తొలగింపును డిమాండ్ చేయటంతో పాటు యావత్ ఎన్నికల వ్యవస్థ మరమ్మతును కోరుతున్నారు. సిజెపి ఇప్పటికే ఢిల్లీ, ముంబైలు దాటి కర్నాటకకు విస్తరించింది. బెంగళూరులో వారు అక్టోబర్ 8న 'సర్' ప్రక్రియపై ప్రజా ట్రిబ్యునల్, చెప్పులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిజెపి జన్–జడ్ లేదా యువజన నిరసన సంస్కృతికి, పాత ప్రతిపక్ష లేదా పౌరసమాజ నిరసన తీరుకు మధ్య ముఖ్యమైన వారధిగా పనిచేస్తున్నది.

సమస్య ఇప్పుడు "సిఇసి రాజీనామా" నుంచి మరింత విస్తృతమైన సమస్యలకు మారటం ఈ వారంలో ఎంతో పర్యవసానంతో కూడిన మార్పు. సిఇసి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా తక్షణ నినాదంగా ఉన్నప్పటికీ, ఎన్నికల వ్యవస్థ మొత్తాన్ని సంస్కరించాలనే డిమాండ్‌లు విస్తరించాయి. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్‌భాగవత్, సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌లు భారతదేశ ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేసి, దేశద్రోహానికి పాల్పడ్డారని, వారందరినీ కోర్టుముందు నిలబెట్టాలని ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చెప్పారు.

అక్టోబర్ 5న సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవటంతో సమస్య మరింత తీవ్రతను సంతరించుకుంది. ఫారం 6లో మార్పులను తాము ఎన్నడూ ఆమోదించలేదని అది స్పష్టం గా చెప్పింది. కేంద్ర ప్రభుత్వం, సిఇసి, ఇసిఐ అధికారుల నుంచి సమాధానాలు కోరింది. ఇసిఐ ఏనిర్ణయమైనా చట్టప్రకారం జరిగి ఉండకపోతే దాన్ని రద్దు చేస్తారని చెప్పింది. ఇవి రాజ్యాంగం, లీగల్ పరిధిలో ప్రవేశించిన తీవ్రమైన ఆరోపణలు.

ఢిల్లీలో గతవారం పోలీసుల ప్రతిస్పందన సైతం వారం రోజుల నిరసన ఆందోళనలో ఒక ముఖ్యాంశంగా రాజకీయ వరవడి సంతరించుకుంది. వారు నిరసనకారులను అడ్డుకున్నారు, నిరసన ప్రదేశాలనుంచి బలవంతంగా తొలగించారు. అక్టోబరు 6,7 తేదీల్లో వారు రాహుల్ గాంధీ ,ప్రియాంక గాంధీలను సైతం నిర్బంధంలోకి తీసుకున్నారు. వేడిని రాహుల్ పైకి మళ్లించటానికిగాను పాలక బిజెపి ఆయన మహిళా పోలీసులతో అపసవ్యంగా ప్రవర్తించారని ఆరోపించింది. కాగా నిరసనలో పాల్గొంటున్న ఎంపిలపై పోలీసులు చేయిచేసుకున్నారని, నిరసన కేంద్రాలనుంచి తొలగించటానికి బలప్రయోగం చేశారని ప్రతిపక్షం ఆరోపించింది. నిరసనలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం 24వేలమంది పోలీసులను వినియోగించింది.

10వ తేదీన జంతర్‌మంతర్ వద్ద నిరసనను ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఢిల్లీలో నిషేధాజ్ఞలు విధించి నిరసనలకు అనుమతిలేదని పోలీసు అధికారులు ప్రకటించారు. ఈ పరిస్థితి కొత్త రాజకీయ కోణాలు సృష్టిస్తున్నది. ఎన్నికల వ్యవస్థలో నిజాయితీ అసలు సమస్యకాగా, పోలీసు ఆంక్షలు, డిటెన్షన్‌లు నిరసన తెలిపే స్వేచ్ఛ అనే మరో అంశాన్ని దానికి జోడించాయి.

తొలివారం ఆందోళన రాజకీయ అనుబంధాలులేని యువతను, విద్యార్థులు, తొలిసారి ఓటర్లు, పౌరసమాజ కార్యకర్తలు, వ్యక్తిగతంగా ఓటు ఫిర్యాదు వున్న వ్యక్తులను పెద్దసంఖ్యలో ఆకర్షించింది. ఆ విధంగా గడిచిన వారం గణించదగినంత విస్తృతమైన ఓటుహక్కుల ఉద్యమానికి ప్రాతిపదిక కల్పించింది. సూక్ష్మంగా చెప్పాలంటే, సిఇసి/ఎస్ఐఆర్ వివాదం పార్లమెంట్ లేదా ఎన్నికల కమిషన్ నాలుగు గోడల మధ్య అదుపులో ఉంచలేనంత కఠినంగా తయారైంది.

అక్టోబరు 8 నాటికి ఉద్యమం ఢిల్లీ హద్దులు దాటి బహుళ కేంద్రాలు, బహుళ తరగతుల ఉద్యమంగా విస్తరించింది. మరో గమనార్హమైన అంశం ఏమంటే, సిఇసి రాజీనామాతో ఆందోళన ముగుస్తుందని సిజెపి, విద్యార్థి గ్రూపులు చెప్పటంలేదు. అంతేగాక 10వతేదీ జంతర్‌మంతర్ నిరసన గతంలోలాగా (నీట్ వ్యతిరేక ఆందోళన) కాకుండా సిజెపి, వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య ఆందోళనగా ఉంటుందని ఆ సంఘాల నాయకులు బుధవారం ఢిల్లీలో ప్రకటించారు. సర్‌ను నిలుపుచేయటం, 2025 జనవరి నాటి ఓటరు జాబితాల పునరుద్ధరణ, స్వతంత్ర దర్యాప్తు, ఎన్నికల కమిషనర్‌ల నియామకానికి సంబంధించిన 2023 నాటి చట్టంలో మార్పులను వారు డిమాండ్ చేస్తున్నారు.

బిహార్ సరికొత్త ఉద్యమ కేంద్రంగా అవతరించింది. అక్టోబరు 7న ఇండియా/గ్రాండ్ అలయెన్స్ పార్టీలు రాష్ట్రంలోని 534 బ్లాక్ (మండల) కేంద్రాల్లో "ఆక్రోశ్ ప్రదర్శనలు" నిర్వహించాయి.

ఆర్‌జెడి, కాంగ్రెస్, సిపిఐ(ఎంఎల్) సిపిఐ, సిపిఐ(ఎం), విఐపి, ఐఐపి పార్టీలు పాల్గొన్నాయి. అక్టోబరు 8న ఆందోళన బ్లాక్ కేంద్రాల నుంచి జిల్లాల కేంద్రాలకు, పట్నాకు విస్తరించింది. ప్రతిపక్షనాయకుడు తేజస్వీ యాదవ్ నాయకత్వంలో లోక్‌భవన్‌కు ప్రదర్శన తీశారు.

అక్టోబరు 8న ఒడిసా బంద్ మరో ముఖ్యఘటన. భువనేశ్వర్, కటక్, బర్గా, భద్రక్, బాలాసోర్, రాయగడ్, కేంద్రపార, బోలంగీర్, బెర్హంపూర్, సంబల్‌పూర్‌లుబంద్ పాటించాయి.

మహారాష్ట్రలో సెప్టెంబరు 25, అక్టోబరు 4 మధ్య మొత్తం 88 నిరసన కార్యక్రమాలు జరిగాయి. కాంగ్రెస్ పిలుపుపై 8వ తేదీన అనేక రాష్ట్రాల్లో 'ప్రజాస్వామ్యానికి నల్లదినం'పెద్ద ఎత్తున పాటించారు.

ఢిల్లీలో ఇండియా కూటమి ఎంపిలు సిఇసిని కలుసుకుని మెమొరాండం ఇచ్చేందుకు 6వ తేదీన చేసిన ప్రయత్నాన్ని ఆ పక్కనే ఉన్న ఆకాశవాణి కార్యాలయం వద్ద, 7వ తేదీ నిరసనను జంతర్‌మంతర్ వెలుపల పోలీసులు అడ్డుకున్నందున, 8వ తేదీ రాజ్‌ఘాట్‌కు వెళ్లి గాంధీజీకి నివాళులర్పించి, తమ నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు.



## విజ్ఞాన ప్రపంచంలో మౌన ముని హెన్రీ క్యావెండీష్

విజ్ఞాన శాస్త్ర చరిత్రలో ప్రయోగాత్మక పరిశోధనలకు అత్యున్నత ప్రామాణికతను తెచ్చిన మహోన్నత శాస్త్రవేత్త హెన్రీ క్యావెండీష్. 1731 అక్టోబర్ 10న జన్మించిన ఈ ఇంగ్లీష్ రసాయన, భౌతిక శాస్త్రవేత్త శాస్త్రప్రపంచంలో ఒక మౌన విప్లవాన్ని సృష్టించారు. ప్రచారానికి, ఆడంబరాలకు దూరంగా ఉంటూ, కేవలం సత్యాన్వేషణే ధ్యేయంగా తన జీవితాంతం ప్రయోగశాలకే అంకితమైన విచిత్రమైన, అత్యంత మేధోసంపత్తి కలిగిన వ్యక్తిత్వం ఆయనది. ఆయన జన్మదినం సందర్భంగా, ఆధునిక సైన్స్ వికాసానికి ఆయన అందించిన అసమాన సేవలను స్మరించుకోవడం ఎంతో ప్రాముఖ్యమైనది.

క్యావెండీష్ సాధించిన అత్యంత ప్రసిద్ధమైన విజయాలలో 'హైడ్రోజన్' వాయువును కనుగొనడం మొదటిది. 1766లో ఆమ్లాలతో లోహాలు చర్య జరిపినప్పుడు వెలువడే ఒక తేలికపాటి వాయువును ఆయన వేరుచేసి, దానికి 'దహనశీల గాలి' అని నామకరణం చేశారు. ఈ వాయువును మండించినప్పుడు నీరు ఏర్పడుతుందని నిరూపించడం ద్వారా, నీరు అనేది ప్రాథమిక మూలకం కాదని, అది హైడ్రోజన్ మరియు ఆక్సిజన్‌ల సమ్మేళనమని ప్రపంచానికి చాటిచెప్పారు. ఇది రసాయన శాస్త్రంలో ఒక నూతన శకానికి నాంది పలికింది.

భౌతిక శాస్త్ర రంగంలో క్యావెండీష్ చేసిన ప్రయోగాలు ఆయన నిశితమైన కొలతల నైపుణ్యానికి అద్దం పడతాయి. 1797–1798 కాలంలో ఆయన నిర్వహించిన ప్రసిద్ధ 'క్యావెండీష్ ప్రయోగం' శాస్త్ర చరిత్రలోనే ఒక మైలురాయి. 'టార్షన్ బ్యాలెన్స్' అనే సూక్ష్మమైన పరికరాన్ని ఉపయోగించి, రెండు సీసపు గోళాల మధ్య ఉండే అత్యంత స్వల్ప గురుత్వాకర్షణ బలాన్ని ఆయన ఖచ్చితంగా కొలిచారు. దీని ఆధారంగా భూమి యొక్క సగటు సాంద్రతను, ద్రవ్యరాశిని మరియు ఐజాక్ న్యూటన్ గురుత్వాకర్షణ స్థిరాంకాన్ని(G) అత్యంత ఖచ్చితత్వంతో లెక్కించారు. ఆ కాలపు సాంకేతిక పరిమితులను అధిగమించి ఆయన చేసిన ఈ లెక్కలు ఆధునిక విలువలకు దాదాపు సరిసమానంగా ఉండటం విశేషం.

క్యావెండీష్ కేవలం రసాయన, గురుత్వాకర్షణ రంగాలకే పరిమితం కాకుండా విద్యుత్ శాస్త్రంలోనూ విప్లవాత్మక పరిశోధనలు చేశారు. విద్యుత్ సామర్థ్యం, ఆవేశం, మరియు విద్యుత్ నిరోధకతకు సంబంధించిన అనేక సూత్రాలను ఆయన ముందే కనుగొన్నారు. అయితే, విపరీతమైన సంకోచ స్వభావం మరియు ప్రచార విముఖత కారణంగా ఆయన తన పరిశోధనలలో అధిక భాగాన్ని ప్రచురించలేదు. ఆయన మరణించిన దశాబ్దాల తర్వాత జేమ్స్ క్లర్క్ మాక్స్‌వెల్ ఆయన పత్రాలను పరిశోధించి ప్రచురించినప్పుడు మాత్రమే ఓం నియమం, కూలుంబ్ నియమం వంటివి ప్రపంచానికి తెలియక ముందే క్యావెండీష్ కనుగొన్నారని వెల్లడైంది.

హెన్రీ క్యావెండీష్ జీవితం సైన్స్ పట్ల నిస్వార్థమైన అంకితభావానికి నిదర్శనం. ధనవంతుల కుటుంబంలో జన్మించినప్పటికీ, భౌతిక సుఖాల కంటే జ్ఞానార్జనకే ప్రాధాన్యతనిచ్చిన నిరాడంబరుడు ఆయన. ఆయన ప్రతిపాదించిన ఖచ్చితమైన కొలతల పద్ధతులు ఆధునిక ప్రయోగాత్మక శాస్త్రానికి గట్టి పునాది వేశాయి. ఆయన పేరు మీదుగా కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన 'క్యావెండీష్ ప్రయోగశాల' నేటికీ అనేకమంది నోబెల్ బహుమతి గ్రహీతలను తయారుచేస్తూ సైన్స్ రంగానికి వెలుగునిస్తోంది. హెన్రీ క్యావెండీష్ జన్మదినాన ఆయన ఆవిష్కరణలను, సైన్స్ పట్ల ఆయన చూపిన నిబద్ధతను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.

సుధాకర్ ఏ వి, 9000674747

# ప్రజల నమ్మకానికి చిరునామా 'తపాలా శాఖ'

తల్లి రాసిన ఉత్తరం కొడుకు చేతికి అందింది. ఆ కాగితంలో అక్షరాలే కాదు.. కన్నతల్లి ప్రేమ, ఆమె పడుతున్న కష్టాలు, కొడుకు క్షేమంగా ఉన్నాడనే భరోసా కనిపించేవి. సుదూర ప్రాంతంలో ఉద్యోగం చేస్తున్న కొడుకు నుంచి వచ్చిన ఉత్తరం తల్లికి కొండంత ధైర్యాన్నిచ్చేది. అప్పట్లో ఉత్తరాలు కేవలం కాగితాలు కాదు.. మనుషుల మధ్య అనుబంధాలను కలిపే ఆత్మీయ వారధులు. ఆ అనుబంధాలకు చిరునామాగా నిలిచిన తపాలా శాఖ, నేడు అనేక ప్రజోపయోగ సేవలతో దేశ ప్రజలకు అండగా నిలుస్తోంది.

కాలం మారినా తపాలా శాఖ ప్రాధాన్యం తగ్గలేదు. ఉత్తరాలు, పార్శిళ్ల పంపిణీ నుంచి పొదుపు పథకాలు, బ్యాంకింగ్, బీమా, డిజిటల్ సేవల వరకు తన సేవలను విస్తరించింది. ఎలాంటి లాభాలు ఆశించకుండా ప్రజలకు సేవ చేయాలనే స్ఫూర్తితో, నగరాల నుంచి మారుమూల గ్రామాల వరకు పౌరులకు చేరువగా ఉండటం తపాలా శాఖ ప్రత్యేకత.

**ఉత్తరాలు, పార్శిళ్ల పంపిణీ**

ఉత్తరాలు, అధికారిక పత్రాలు, పార్శిళ్లను గమ్యస్థానాలకు చేర్చడం తపాలా శాఖ ప్రధాన బాధ్యత. స్పీడ పోస్టు, రిజిస్టర్డ్ పోస్టు వంటి సేవల ద్వారా ముఖ్యమైన పత్రాలను పంపే సదుపాయం కల్పిస్తోంది. ఆన్‌లైన్ కొనుగోళ్లు పెరిగిన నేపథ్యంలో వస్తువులను వినియోగదారులకు చేరవేయడంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. దేశవ్యాప్తంగా విస్తరించిన తపాలా నెట్‌వర్క్ ప్రజలకు సమాచార, రవాణా సేవలను అందించడంలో ఉపయోగపడుతోంది.

**పొదుపు పథకాలు**

ప్రజల్లో పొదుపు అలవాటును పెంపొందించేందుకు పోస్టాఫీసులు అనేక పథకాలను అందిస్తున్నాయి. పొదుపు ఖాతాలు, రికరింగ్ డిపాజిట్లు, టైమ్ డిపాజిట్లు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ నెలవారీ ఆదాయ పథకం వంటి సదుపాయాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు, వృద్ధాప్య భద్రత కోసం డబ్బు దాచుకోవాలనుకునేవారికి ఇవి ఉపయోగపడుతున్నాయి. చిన్న మొత్తాలతో పొదుపు ప్రారంభించే అవకాశం సామాన్యులకు ఎంతో ప్రయోజనకరం.




**బ్యాంకింగ్, ఆర్థిక సేవలు**

ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా అర్హులైన వినియోగదారులకు డబ్బు జమ, నగదు ఉపసంహారణ, నగదు బదిలీ, ఖాతా నిల్వ తెలుసుకోవడం వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆధార్ ఆధారిత చెల్లింపు సేవల ద్వారా కూడా నిర్దిష్ట బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించవచ్చు. ముఖ్యంగా బ్యాంకులు దూరంగా ఉన్న గ్రామాల్లోని ప్రజలు, వృద్ధులు, దివ్యాంగులకు ఈ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నా యి. కొన్ని సేవలను ఇంటి వద్దకే అందించడంవల్ల ప్రయాణ ఖర్చు, సమయం ఆదా అవుతున్నాయి.

**బీమా సేవలు**

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాల ద్వారా అర్హులైన వర్గాలకు జీవిత బీమా సదుపాయాలను తపాలా శాఖ అందిస్తోం ది. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి అనుకోని పరిస్థితి ఎదురైనప్పుడు ఆర్థిక భద్రత అవసరం. బీమా పథకాల ద్వారా కుటుంబానికి రక్షణ కల్పించుకోవచ్చు. అర్హత, పథక నిబంధనలకు అనుగుణంగా అందించే ఈ సేవలు ఉద్యోగులు, గ్రామీణ ప్రజలకు ఉపయోగపడుతున్నాయి.

**ప్రభుత్వ, డిజిటల్ సేవలు**

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ తపాలా శాఖ తన సేవలను ఆధునికీకరిస్తోంది. పార్శిళ్లను ట్రాక్ చేసుకునే సదుపాయం, డిజిటల్ చెల్లింపులు, ఎంపిక చేసిన పోస్టాఫీసుల్లో ఆధార్ సంబంధిత సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడంలోనూ, ఆర్థిక సేవలను సులభతరం చేయడంలోనూ పోస్టాఫీసులు తోడ్పడుతున్నాయి. ప్రాంతాన్ని బట్టి సేవల లభ్యత మారినప్పటికీ, ప్రజలకు అవసరమైన సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ వ్యవస్థ పనిచేస్తోంది.

**తపాలా శాఖను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే**

తపాలా శాఖ సేవల వెనుక ఎండనక, వాననక విధులు నిర్వహించే సిబ్బంది శ్రమ, అంకితభావం ఉన్నాయి. మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా సేవలు అందించడం ఈ వ్యవస్థ ప్రత్యేకత. కొన్ని సేవలకు రుసుములు ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా ప్రజలకు అవసరమైన సేవలను అందుబాటులో ఉంచడంలో తపాలా శాఖ పాత్ర ఎంతో విలువైనది. ప్రజలకు సేవలు అందుబాటులో ఉండటం ఎంత ముఖ్యమో, వాటిని వినియోగించుకోవడం కూడా అంతే ముఖ్యం. పొదుపు పథకాల నుంచి బీమా వరకు, పోస్టల్ సేవల నుంచి బ్యాంకింగ్ సేవల వరకు మనకు అవసరమైన సేవలను పోస్టాఫీసుల ద్వారా పొందుతూ ఈ వ్యవస్థకు మన వంతు సహకారం అందించాలి.

నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న భారత తపాలా శాఖను ఆదరించాలి.. దాని సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలి. ప్రజలకు చేరువగా ఉండే ఈ ప్రజాసేవా వ్యవస్థను కాపాడుకుంటూ, దాని అభివృద్ధిలో మనమూ భాగస్వాములమవుదాం.

**(అక్టోబర్ 10 భారతీయ తపాలా శాఖ దినోత్సవం సందర్భంగా)**

కొండేటి ప్రకాష్, 7981781086

# గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్‌గా హైదరాబాద్!

- ఫిన్‌టెక్ దిగ్గజం బ్యాక్‌బేస్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం
- అధునాతన డిజిటల్ మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి
- ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ కంపెనీలకు పెట్టుబడుల గమ్యస్థానంగా మాత్రమే కాకుండా.. అంతర్జాతీయ స్థాయిలో ఎదురవుతున్న సాంకేతిక, ఆర్థిక సమస్యలకు పరిష్కారాలు అందించే కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జిసిసి) ఏర్పాటుతో పాటు పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి హైదరాబాద్‌ను వేదికగా మార్చేందుకు సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కంపెనీలకు అవసరమైన ఆధునిక డిజిటల్ మౌలిక సదుపాయాలను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. హైటెక్ సిటీలో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన నెదర్లాండ్స్‌కు చెందిన ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ 'బ్యాక్‌బేస్' డెవలప్‌మెంట్ సెంటర్‌ను శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ బ్యాంకింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో హైదరాబాద్ అంతర్జాతీయ సంస్థలకు ఆకర్షణీయమైన కేంద్రంగా ఎదుగుతోందన్నారు. బ్యాక్‌బేస్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు నగరంలో తమ కార్యకలాపాలను విస్తరించడం రాష్ట్రంలో అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాలకు, వ్యాపార అనుకూల వాతావరణానికి నిదర్శనమని పేర్కొన్నారు. డిజిటల్ బ్యాంకింగ్ పరిష్కారాలు, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, ఉత్పత్తుల అభివృద్ధి, క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ (ఎఐ), డేటా విశ్లేషణ, సైబర్ భద్రత వంటి రంగాల్లో యువతకు అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నూతన సాంకేతికతలపై అవగాహన, నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా ప్రపంచ స్థాయి కంపెనీల్లో తెలంగాణ యువత రాణించేలా ప్రోత్సహిస్తామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు తదుపరి తరం డిజిటల్ బ్యాంకింగ్ పరిష్కారాలు, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులను అందించడంలో బ్యాక్‌బేస్ డెవలప్‌మెంట్ సెంటర్ కీలక పాత్ర పోషించనుందని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా కొత్తగా 300 మంది అత్యున్నత నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులకు ఉపాధి లభించనుందని వెల్లడించారు. సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరిష్కారాలు కనుగొనే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. వినూత్న ఆలోచనలు, పరిశోధనలు, ఆవిష్కరణలతో ముందుకొచ్చే సంస్థలు, ప్రతిభావంతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంతర్జాతీయ కంపెనీల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధునాతన డిజిటల్ మౌలిక సదుపాయాలతో కూడిన సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నెదర్లాండ్స్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ యాన్ క్రెమర్స్, బ్యాక్‌బేస్ సిటిఒ గ్రెగ్ ఫాహి, చీఫ్ ఆఫ్ స్టాఫ్ రీన్‌హార్డ్ షీల్, ఇండియా సైట్ హెడ్ సురభి శర్మ పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి హృదయ స్పందన.. సమాచార హక్కు

- 'సమాచార దర్పణం' ఆవిష్కరణలో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు సామాన్య పౌరుడికి ప్రజాస్వామ్యం కల్పించిన శక్తివంతమైన ఆయుధమని, సమాచార హక్కు చట్టం కేవలం చట్టం మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్యానికి హృదయ స్పందన వంటిదని రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం, పాలనలో ప్రజల భాగస్వామ్యానికి ఈ చట్టం బలమైన పునాది అని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలు సమాచారాన్ని ముందుగానే ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పాటు, దరఖాస్తులకు సకాలంలో సమాధానాలు ఇవ్వడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమాచార హక్కు వారోత్సవాలు–2026లో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ సమాచార కమిషన్ నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కమిషన్ రూపొందించిన 'సమాచార దర్పణం' వార్తా పత్రికను ఆవిష్కరించారు. సమాచార హక్కు చట్టం కింద ప్రతి దరఖాస్తు వెనుక ఒక సమస్య, హక్కుల కోసం విన్నపం లేదా న్యాయం కోసం చేసే ప్రయత్నం ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల ఈ చట్టం విజయాన్ని దరఖాస్తులు, అప్పీళ్ల పరిష్కార సంఖ్యతోనే కాకుండా, పాలనా విధానాల్లో తీసుకొచ్చే శాశ్వత మార్పులతోనూ అంచనా వేయాలని సూచించారు. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు చేపట్టాల్సిన స్వచ్ఛంద సమాచార వెల్లడి అత్యంత కీలకమని గవర్నర్ అన్నారు. ప్రభుత్వ పథకాలు, విధానాలు, అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానాల వివరాలను ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచితే సమాచార హక్కు దరఖాస్తుల అవసరం తగ్గుతుందని వివరించారు. సమాచారాన్ని తెలుగుతో పాటు ప్రజలకు అర్థమయ్యే ఇతర భాషల్లోనూ అందించాలని, గ్రామీణులు, మహిళలు, దివ్యాంగులు, అట్టడుగు వర్గాలకు ఈ హక్కు సులభంగా చేరేలా చూడాలని సూచించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కమిషన్ గత 15 నెలల్లో 30 వేల కేసులకు గాను 21 వేల కేసులను పరిష్కరించిందని తెలిపారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాష్ రెడ్డి, డిజిపి సి.వి ఆనంద్, అటవీ శాఖ ఉన్నతాధికారి వినయ్‌కుమార్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సమాచార కమిషనర్లు, ప్రజా సమాచార అధికారులు పాల్గొన్నారు. ప్రజలు తమ హక్కులను విశ్వాసంతో వినియోగించుకునేలా, ప్రభుత్వ సంస్థలు బాధ్యతాయుతంగా పనిచేసేలా పారదర్శక పాలనను బలోపేతం చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

# పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులకు ఆహ్వానం

- డిసెంబరులో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'.. పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి
- పర్యాటక ప్యాకేజీలతో తెలంగాణకు సందర్శకులను ఆకర్షించాలి: మంత్రి జూపల్లి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో పర్యాటక రంగానికి అపార అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ భారీ పెట్టుబడులతో రాష్ట్రాన్ని జాతీయ, అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆహ్వానించారు. ఈ ఏడాది డిసెంబరులో హైదరాబాద్ వేదికగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' రాష్ట్రంలో పెట్టుబడులకు కీలక వేదికగా నిలవనుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం నిర్వహించిన 24వ ట్రావెల్ టూరిజం ఫెయిర్–2026కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పర్యాటక సంస్థలు, ట్రావెల్ కంపెనీలు, ఆతిథ్య రంగ సంస్థలు, పరిశ్రమ ప్రతినిధులు ఒకే వేదికపైకి రావడం వల్ల కొత్త వ్యాపార అవకాశాలు, భాగస్వామ్యాలు, ఉపాధి మార్గాలు ఏర్పడతాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో 16 రాష్ట్రాలు, ఏడు దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొనడం తెలంగాణ పర్యాటక రంగానికి ప్రోత్సాహకరమన్నారు. ట్రావెల్ టూరిజం ఫెయిర్ ద్వారా దేశీయ, అంతర్జాతీయ పర్యాటక రంగ సంస్థల మధ్య అనుసంధానం పెరుగుతుందని, సేవల విస్తరణకు, కొత్త వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ట్రావెల్ సంస్థలు వినూత్న పర్యాటక ప్యాకేజీలను ప్రకటించి, దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి కూడా పర్యాటకులు తెలంగాణకు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయని జూపల్లి అన్నారు. తెలంగాణ పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, పర్యాటక సంస్థల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. రానున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ నేపథ్యంలో వివిధ రంగాల పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు నాసిర్ అస్లాం వానీ, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ క్రాంతి వల్లూరి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఫెయిర్‌ఫెస్ట్ ఎండి ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచస్థాయికి తెలంగాణ ప్రతిష్ఠ

- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రతిష్ఠను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే విధంగా 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'ను నిర్వహించాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. 'డిసెంబర్ 7,8, 9 తేదీలలో' భారత్ ఫ్యూచర్ సిటీలో జరగబోయే 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2.0'రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలు సమన్వయంతో పని చేసి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. 'గ్లోబల్ సమ్మిట్' నిర్వహణ కోసం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన 'వార్ రూమ్'ను భట్టి విక్రమార్క శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులకు అప్పగించిన బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. శాఖల మధ్య నిరంతర సమాచార మార్పిడి, సమన్వయం ఉండేలా స్పష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమ్మిట్ విజయవంతానికి ప్రతి శాఖ కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయంగా రాష్ట్ర ప్రతిష్ఠను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లే లక్ష్యంతో ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రతి అధికారి సమిష్టి బాధ్యతతో కృషి చేసి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక, ప్లానింగ్ ముఖ్య కార్యదర్శి గౌరవ్ ఉప్పల్‌తోపాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకలకు రూ.10 కోట్లు మంజూరు

- నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. 2026–27 ఆర్థిక సంవత్సరంలో భాషా, సాంస్కృతిక శాఖకు కేటాయించిన బడ్జెట్ నుంచి ఈ నిధులను విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. అక్టోబరు 10 నుంచి 18వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు జరగనున్నాయి. పండుగ ముగింపు సందర్భంగా అక్టోబరు 18న హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు విజయవంతంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని భాషా, సాంస్కృతిక శాఖ అధికారులకు ప్రభుత్వం సూచించినట్లు సమాచారం. బతుకమ్మలు ఆడే ప్రదేశాలు, చెరువులు, కుంటలు, నిమజ్జన ఘాట్ల వద్ద పరిశుభ్రతతో పాటు విద్యుత్ దీపాలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించనున్నారు. తెలంగాణ ఆడపడుచుల సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగను గ్రామస్థాయి నుంచి రాష్ట్ర రాజధాని వరకు ఉత్సాహంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

## ఓట్ల తొలగింపుతో ప్రజాస్వామ్యానికి ముప్పు

- భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో జనాభా పెరుగుతున్నా ఓటర్ల సంఖ్య తగ్గడం ఎలా సాధ్యమని భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. తమకు అనుకూలంగా లేని ఓట్లను తొలగించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో 73 లక్షల ఓట్లను తొలగించారని, ఓట్ల తొలగింపు వ్యవహారం ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పుగా మారుతోందని విమర్శించారు. ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వమే దానిని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇండియా కూటమికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఈ సాయంత్రం సమావేశం కానున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లకుండా రాహుల్ గాంధీని ఢిల్లీలో పోలీసులు అరెస్టు చేశారని ఆరోపించారు. ఇండియా కూటమి నేతలకు రాష్ట్రపతిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ లభించిందని, కూటమిలోని అన్ని పార్టీల నేతలకు రాష్ట్రపతిని కలిసే అవకాశం కల్పించాలని కోరారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నియామకంలో మోదీ, అమిత్ షాలు కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ఆయన స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చడం ద్వారా ప్రభుత్వానికి అనుకూలమైన నిర్ణయాలకు అవకాశం కల్పించారని విమర్శించారు. ఎన్నికల సంఘం దేశంలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగబద్ధ సంస్థ అని, దాని నియామక వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సరికాదని చామల అన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై చర్చించి ఉంటే బాగుండేదని చామల అభిప్రాయపడ్డారు.

# కెటిఆర్.. డ్రగ్స్ టెస్టుకు సిద్ధమా?

- బల్మూర్ వెంకట్ సవాల్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెటిఆర్ డ్రగ్స్ పరీక్షకు సిద్ధమా? అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ సవాల్ విసిరారు. డ్రగ్స్ ఆనవాళ్లు బయటపడకుండా ఆయన ఓ ఫామ్‌హౌస్‌లో రూ.5 కోట్లు ఖర్చు పెట్టి, లండన్ వైద్యుడితో రహస్యంగా హెయిర్ ట్రీట్‌మెంట్ చేయించుకుంటున్నారంటూ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి తన వద్ద ఉన్న సమాచారాన్ని బయటపెడతానని, ఇకపై వారానికోసారి కెటిఆర్ వ్యవహారాలను ప్రజల ముందుకు తీసుకొస్తానని ప్రకటించారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కెటిఆర్ ఆరోగ్య పరిస్థితిపై సందేహాలు వ్యక్తం చేశారు. నిజంగానే జ్వరం వస్తే సోషల్ మీడియాలో లైవ్‌లోకి వచ్చి వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**డెక్కన్ సెరాయ్ షేర్లపై ప్రశ్నలు..**

కెటిఆర్‌కు సంబంధించిన హోటల్ వ్యాపార లావాదేవీలపైనా బల్మూర్ వెంకట్ ప్రశ్నలు లేవనెత్తారు. 2015లో డెక్కన్ సెరాయ్ షేర్ విలువ రూ.5 కోట్లుగా ఉండగా, పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా పెరిగిందని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు విచారణ జరపాలని, తాము ఫిర్యాదు చేస్తామని తెలిపారు. హోటల్ నుంచి పార్సిళ్ల రవాణా, వాటి గమ్యస్థానాలపై కూడా వ్యాఖ్యలు చేశారు. 2019 నుంచి 2022 మధ్య ఓ సినీ నటితో కెటిఆర్ చేసినట్లు చెబుతున్న సోషల్ మీడియా సంభాషణలను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. పాస్‌పోర్టు వ్యవహారంలో పోలీసుల చర్యలను కెటిఆర్ కోర్టులో సవాల్ చేయడంపైనా విమర్శలు చేశారు. కెటిఆర్ తనను విమర్శించకపోయినా, తాను మాత్రం ఆయన వ్యవహారాలను ప్రజల ముందుకు తీసుకొస్తానని బల్మూర్ వెంకట్ వ్యాఖ్యానించారు. గతంలో తమ విమర్శలకు ప్రతిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టించారని ఆరోపించారు. డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న సమయంలో కెటిఆర్ డ్రగ్స్ పరీక్షకు సిద్ధమని ప్రకటించాలని మరోసారి డిమాండ్ చేశారు.

# బిజెపితో బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం

- టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడితే 'ఫార్ములా ఈ కార్ రేస్',కాళేశ్వరంలో సిబిఐ విచారణ కేసులలో అరెస్ట్ చేస్తారనే భయంతోనే 'సర్' ప్రక్రియపై బిఆర్ఎస్ ఎటువంటి నిరసన కార్యక్రమాలను చేపట్టడం లేదని, ఉలుకు, పలుకు లేదని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. బిజెపితో బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం జరిగిందన్నారు. 'సర్' ప్రక్రియలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా రాజకీయ తీరుపై పోరాటం చేస్తుంటే, తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పాత్ర ఎక్కడ అని ప్రశ్నించారు. సర్ ప్రక్రియలో బిఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉందని, బిజెపికి కెసిఆర్ ఎందుకు భయపడుతున్నారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 'సర్' ప్రక్రియపైన బిజెపి, ఆ పార్టీ మిత్రపక్షాలు మినహా అన్ని రాజకీయ పార్టీలు రోడ్డు ఎక్కాయని, మరి బిఆర్ఎస్ పాత్ర ఎక్కడ అని నిలదీశారు. సిఇసి తప్పిదాలపైన కెసిఆర్‌తోపాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, కెటిఆర్ ఎందుకు మాట్లాడం లేదన్నారు. ఇప్పటి వరకు సర్ ప్రక్రియపైన బిఆర్ఎస్ నిరసన కార్యక్రమం చేయలేదని ఆరోపించారు. ఉండటానికి ఇల్లు లేదన్న కెటిఆర్‌కు ఫైవ్ స్టార్ హోటల్స్, వేల కోట్ల విలువ చేసే ఆస్తులు ఏక్కడివి అని ప్రజలు అడుగుతున్నారన్నారు. వెస్ట్ బెంగాల్‌లో రోహింగ్యాల పేరుతో మమత బెనర్జీని, బిహార్‌లో ఆర్‌జెడిని ఎన్నికల్లో గెలువ కుండా చేశారని ఆరోపించారు. వయసుతో నిమిత్తం లేకుండా మల్లిఖార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ పోరాటం చేస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి జ్ఞానేశ్వర్ కుమార్‌ను తొలగించే వరకు తమ నిరసన, ర్యాలీలు కొనసాగుతాయన్నారు. వివిధ కారణాలతో రాష్ట్రం లో 90 లక్షల ఓట్లు తొలగిస్తున్నారని, టిఎన్ శేషన్, లింగ్డో, కృష్ణమూర్తి హయాంలో 'సర్'న్యాయంగా జరిగిందన్నారు. ప్రకాష్ రాజ్ మాట్లాడే మాటల్లో వాస్తవం లేదన్నారు. బిజెపి టార్గెట్ ఇక తెలంగాణ, పంజాబ్ అని, అందుకే రాష్ట్రంలో దురుద్దేశ పూర్వకంగా సర్ ప్రక్రియ జరుగుతోందని ఆయన ఆరోపించారు.




# 'చేగువేరా' స్ఫూర్తితో యువత ఉద్యమించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'చేగువేరా' స్ఫూర్తితో విద్యార్థి, యువత తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ పిలుపునిచ్చింది. 'చేగువేరా 59వ' వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్, రాజ్ బహదూర్ హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎఐవైఎఫ్ అధ్యక్షుడు మర్రి శ్రీమాన్. కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ చేగువేరా పోరాట స్ఫూర్తితో విద్యార్థి, యువత, 'విద్యా, ఉపాధి, ఆర్థిక, సామజిక' అసమానతలపై పోరాటాలు కొనసాగించాలన్నారు. క్యూబా విప్లవంలో డాక్టర్ గా చేరిన చేగువేరా దోపిడీకి గురవుతున్న ప్రజలకు విప్లవాత్మక మెడిసిన్ అవసరమని భావించి, విప్లవకారుడిగా పరిణితి చెందారని, విప్లవ గెరిల్లా దళానికి నాయకుడయ్యారని గుర్తు చేశారు. బొలివియా ప్రజలను విముక్తి చేసే బాధ్యతను తన భుజాలపై వేసుకుని, 'కమ్యూనిస్టు గెరిల్లా దళాన్ని' స్వయంగా తయారు చేసుకుని విప్లవోద్యమాన్ని నిర్మించి, నాయకత్వం వహించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, నెల్లి సత్య, ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అనిల్, చైతన్య యాదవ్, ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్, నాయకులు అరుణ్, జోసెఫ్ భాను, అరుణ్, సుశాంత్, అవినాష్, సాత్విక్, సిద్దార్థ్, భారత్, శశి, చరణ్, శివ, సందీప్ పాల్గొన్నారు.


**బోధన్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం**

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీస్

Lr.No. E1/247/Oct/Ad/2026 తేదీ: 09.10.2026

బోధన్ పట్టణంలో వివిధ గ్రాంట్ల క్రింద ప్రతిపాదించబడిన 05 పనుల కొరకు టెండర్లు ఆహ్వానించడమైనది. **అన్ని పనుల మొత్తం అంచనా వ్యయం:** రూ. 14.50 లక్షలు. **బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ:** 09.10.2026 సాయంత్రం 4.00 గంటలకు మరియు **బిడ్ సమర్పణ చివరి తేదీ:** 16.10.2026.
మరిన్ని వివరాల కోసం దయచేసి బోధన్ పురపాలక సంఘం, ఇంజనీరింగ్ విభాగాన్ని సంప్రదించండి.
ఇమెయిల్ ఐడి: municipalcouncilbodhan@gmail.com, https://tender.telangana.gov.in

సం/- కమిషనర్, మున్సిపల్ కౌన్సిల్, బోధన్

DIPR R.O. No. : 11669-PP/CL/ADVT/2026-27, Date: 09-10-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**

MMC

డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, వెటెరినరి సెక్షన్, ఎంఎంసి.
మెయిల్: ddveterinary.mmc@gmail.com సెల్ నెం: 9989930-397

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

Lr.No. /DD/VET/MMC/2026 తేది: 09.10.2026

| Sl. No. | పని పేరు | అంచనా విలువ (రూ.లలో) |
|---|---|---|
| 1 | కీసర సర్కిల్ పరిధిలోని చికెన్ షాపుల నుండి వెలువడే కోడి వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించడం, రవాణా చేయడం మరియు పారవేయడం - కోడి వ్యర్థాల పారవేత కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లను పిలవడం. | రూ. 3,08,430.00 |

| ఈవెంట్స్ | క్ర.సం.1 కొరకు |
|---|---|
| డౌన్‌లోడ్ ప్రారంభ తేది | 10/10/2026 మ.3.00గం.లకు |
| డౌన్‌లోడ్ ముగింపు తేది | 14/10/2026 మ.3.00గం.ల వరకు |
| ప్రైస్ బిడ్ ప్రారంభ తేది | 14/10/2026 సా.4.00గం.లకు |

మరిన్ని వివరాలకు **www.tender.telangana.gov.in**లో చూడవచ్చు

సం/- డిప్యూటీ డైరెక్టర్, వెటెరినరి సెక్షన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్

DIPR R.O. No. : 11615-PP/CL/ADVT/2026-27, Date: 09-10-2026

**GREATER HYDERABAD MUNICIPAL CORPORATION**
**హైదరాబాద్ మహానగరపాలక సంస్థ**

| NIT No. | పని వివరణ | అంచనా విలువ / ECV | డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇఇ / ఎస్ఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 34 | జిహెచ్ఎంసి, రాజేంద్రనగర్ జోన్‌లో రాజేంద్రనగర్ సర్కిల్-19లో సిసి రోడ్డు వేయడం మరియు బిటి ప్యాచ్ మరమ్మతులు | రూ. 55.25 లక్షలు | తేది: 12.10.2026 మ.2.30 గం.లకు | తేది: 19.10.2026 మ.2.40 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9989930608. ఇ-మెయిల్: eec19.rajendranagar @gmail.com |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ సర్కిల్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 11686-PP/CL/ADVT/2026-27, Date: 09-10-2026

**మిర్యాలగూడ మున్సిపాలిటీ కార్యాలయం, నల్లగొండ జిల్లా.**

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ తేదీ: 09.10.2026

| | | |
|---|---|---|
| 1 | NIT No. | NIT No. ME/76/MM/2026 |
| 2 | పనుల సంఖ్య | 5 Nos |
| 3 | పని పేరు | 1) మున్సిపల్ సాధారణ నిధులు/ 15వ FC కింద మిర్యాలగూడ మున్సిపాలిటీలోని వార్డ్ నెం.40లో సిసి డ్రెయిన్ & కల్వర్ట్ నిర్మాణం - రూ. 5.00 లక్షలు. 2) మున్సిపల్ సాధారణ నిధులు/15వ FC కింద మిర్యాలగూడ మున్సిపాలిటీలోని వార్డ్ నెం.40లోని వివిధ ప్రదేశాలలో సిసి డ్రెయిన్ & కల్వర్ట్ నిర్మాణం - రూ. 5.00 లక్షలు. 3) మున్సిపల్ సాధారణ నిధులు/15వ FC కింద మిర్యాలగూడ మున్సిపాలిటీలోని వార్డ్ నెం.27లో సిసి డ్రెయిన్ & స్లాబ్ కల్వర్ట్ నిర్మాణం - రూ. 5.00 లక్షలు. 4) మున్సిపల్ సాధారణ నిధులు / 15వ FC కింద మిర్యాలగూడ మున్సిపాలిటీలోని వివిధ వార్డులలో దసరా పండుగ కార్యక్రమాల ఏర్పాట్లు - రూ. 5.00 లక్షలు. 5) మున్సిపల్ సాధారణ నిధులు / 15వ FC కింద మిర్యాలగూడ మున్సిపాలిటీలో బతుకమ్మ మరియు దసరా కార్యక్రమాల దృష్ట్యా వీధి దీపాల ఏర్పాటు - రూ. 5.00 లక్షలు |
| 4 | టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడం | 09-10-2026 ఉదయం 11.30 గంటలకు |
| 5 | బిడ్ సమర్పణ చివరి తేదీ | 12-10-2026 మధ్యాహ్నం 3.30 గంటలకు |
| 6 | టెక్నికల్ బిడ్ ప్రారంభ తేదీ | 12-10-2026 సాయంత్రం 4.00 గంటలకు |

టెండర్ పత్రాలు 09-10-2026 ఉదయం 11.30 గంటల నుండి 12-10-2026 సాయంత్రం 4.00 గంటల వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడానికి అందుబాటులో ఉంటాయి. టెండర్ చెల్లుబాటు గడువు, సమర్పణకు చివరి తేదీ నుండి (90 రోజులు) ఉంటుంది మరియు టెండర్ వివరాలను www.tender.telangana.gov.in లో లాగిన్ చేయడం ద్వారా చూడవచ్చు.

సం/- కమిషనర్ మిర్యాలగూడ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 11660-PP/CL/ADVT/2026-27, Date: 09-10-2026

## గోదావరి జలాల కోసం రైతు ధర్నా

పురుగు మందు డబ్బాతో ఆందోళన



**ప్రజాపక్షం/జనగామ:** గోదావరి జలాల కోసం రైతులు ధర్నాకు దిగారు. శుక్రవారం జనగామహుస్నాబాద్ ప్రధాన రహదారిపై పురుగుల మందు డబ్బాలో నిరసన తెలిపారు. వడ్లకొండ గ్రామం వద్ద యేనే చెరువును గోదావరి జలాలతో నింపాలని డిమాండ్ చేశారు. రైతులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. గత కొన్నేళ్లుగా నీళ్ల లేక భూములు బీడులుగా మారుతున్నాయని, రైతులు పంటలు వేసుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే సంఘటన స్థలానికి రావాలని డిమాండ్ చేశారు. రైతుల నిరసనతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలన్నారు. పోలీసులతో రైతులు కాసేపు వాగ్వివాదానికి దిగారు. ఎస్ఐ చెన్నకేశవులు రైతుల్ని బుజ్జగించే ప్రయత్నం చేశారు. తరువాత రైతులు శాంతించడంతో ఆందోళన ముగించారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే లారీలు సీజ్?

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదు: ఎస్పి సుధీర్



**ప్రజాపక్షం/ములుగు:** ఇసుక లారీల అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, అక్రమ పార్కింగ్, మద్యం తాగి వాహనాలు నడపడంపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకాన్ హెచ్చరించారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించేలా వ్యవహరిస్తే డ్రైవర్లతో పాటు వాహన యజమానులపైనా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలోకి వచ్చి వెళ్లే ఇసుక లారీలను తనిఖీ చేస్తామని, డ్రంగ్ అండ్ డ్రైవ్, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు పాల్పడే వారిపై జరిమానాలతో పాటు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తే వాహనాలను అవసరమైతే సీజ్ చేస్తామని పేర్కొన్నారు. జనావాస ప్రాంతాలు, విద్యాసంస్థలు, రద్దీ కూడళ్ల వద్ద డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రధాన రహదారులు, కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా లారీలను నిలపరాదని, నిర్ణీత పార్కింగ్ ప్రదేశాలనే వినియోగించాలని ఆదేశించారు. డ్రైవర్లు రహదారి భద్రతా నిబంధనలు పాటించేలా యజమానులు తగిన సూచనలు చేయాలని తెలిపారు. డ్రైవర్ల నిర్లక్ష్యం వలన ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలగకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిని, ప్రమాదకరంగా డ్రైవింగ్ చేసేవారిని ప్రజలు గుర్తిస్తే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పి కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణ పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ప్రజలు సురక్షితంగా తమ గమ్య స్థానాలకు చేరుకోవడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

## మిషన్ శక్తి మహిళా సాధికారత పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/జనగామ:** మిషన్ శక్తి పథకం కింద జనగామ జిల్లాలోని మహిళా సాధికారత జిల్లా కేంద్రంలో కాంట్రాక్ట్ ప్రాతిపధికన ఆరు పోస్టుల భర్తికి అర్హులైన అభ్యర్థుల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. శుక్రవారం వారొక ప్రకటన చేస్తూ జిల్లా మిషన్ కోఆర్డినేటర్ 1, జెండర్ స్పెషలిస్టు2, ఫైనాన్షియల్ లిటరసీలో స్పెషలిస్ట్1, అకౌంట్స్ అసిస్టెంట్ 1, మల్టీ టాస్కింగ్ స్టాఫ్1 పోస్టులు ఉన్నాయన్నారు. అభ్యర్థుల వయస్సు ఈ ఏడాది అక్టోబర్ 1 నాటికి 21 నుండి 44 సంవత్సరాలు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బిసి అభ్యర్థులకు ఐదేళ్లు దివ్యాంగులకు పదేళ్ల వయోపరిమితి సడలింపు ఉందన్నారు. అక్టోబర్ 15న ఉదయం 10 గంటలకు నెగెటివ్ మార్కింగ్‌తో కూడిన రాత పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అదే రోజు మౌఖిక పరీక్ష నిర్వహించి, ఫలితాలను ప్రకటిస్తారన్నారు. మరుసటి రోజు నియామక ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. దరఖాస్తులు అక్టోబర్ 9 నుండి 14వ తేదీ సాయంత్రం 14 వరకు జిల్లా కలెక్టరేట్ ఐడిఓసిలోని ఇన్‌వార్డు సెక్షన్‌లో సమర్పించాలన్నారు.

**మిషన్ వాత్సల్య పోస్టులకు ధరఖాస్తులు**

మిషన్ వాత్సల్య పథకం కిం జనగామ జిల్లాలోని చైల్డ్ హెల్ప్‌మైన్ 1098లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన మొత్తం 8 పోస్టుల బర్తికి అర్హులైన అభ్యర్థుల నుంచి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఈ పోస్టులలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ 1, కౌన్సిలర్ 1, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ 3, కేస్ వర్కర్ 3, పోస్టులు ఉన్నాయన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 1 నాటికి అభ్యర్థులు 21 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి అభ్యర్థులకు ఐదేళ్లు దివ్యాంగులకు పదేళ్ల వయోరిమితి సడలింపు ఉంటుందన్నారు. వీరికి ఈ నెల 15న ఉదయం 10 గంటల నుండి రాత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 14 సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్‌లోని ఐడిఓసి ఇన్‌వార్డు సెక్షన్‌లో అందజేయాలన్నారు.

## సద్దుల బతుకమ్మకు ఘనమైన ఏర్పాట్లు

జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి వెంకన్న

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీ



కగా నిలిచే సద్దుల బతుకమ్మ పండగను మహిళలు, ఆడపడుచులు ఆనందోత్సాహాలతో జరుపుకునేలా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి వెంకన్న తెలిపారు. శుక్రవారం కమిషనర్ హన్మకొండ నగర పరిధిలోని హసన్‌పర్తి చెరువు, భీమారం చెరువు తదితర ప్రాంతాలను సందర్శించి బతుకమ్మ ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్తాయిలో పరిశీలించారు. బతుకమ్మ నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు సురక్షితంగా పండగలో పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, తాగునీరు, విద్యుత్ దీపాలు, రహదారులు తదితర మౌళిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలు పూర్తయిన వెంటనే చెరువుల పరిసరాలను శుభ్రం చేయాలని, పారిశుధ్య సిబ్బంది అందుబాటులో ఉంటూ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, పారిశుధ్య విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే

# ప్రజా ప్రభుత్వ లక్ష్యం



ఇండస్ట్రియల్ కారిడార్‌గా భూపాలపల్లి

నిరుద్యోగులకు జాబ్ మేళా గొప్ప అవకాశం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత వేతనాలతో కూడిన ఉద్యోగాలు సాధించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్‌లో శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, టాస్క్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై న మంత్రి అన్ని స్టాళ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చొరవతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 142కి



పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొని యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. ప్రారంభంలో రూ.10 వేల నుంచి రూ.20 వేల వేతనంతో ఉద్యోగంలో చేరినా, అనుభవం, నైపుణ్యాలను పెంచుకుంటే రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు వేతనం పొందే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసినట్లు మంత్రి వివరించారు. గ్రూప్1, 2, 3, 4 పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తూ అర్హులకు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ తదితర విద్యార్హతలు కలిగిన యువత ప్రైవేటు రంగంలోనూ ఉద్యోగాలు సాధించేలా జాబ్‌మేళాలు దోహదపడతాయని పేర్కొన్నారు. జాబ్‌మేళా ప్రారంభమైన రెండు గంటల్లోనే 600 మందికి పైగా యువత ప్రాథమికంగా ఎంపికైనట్లు మంత్రి వెల్లడించారు.

**నిరుద్యోగులకు జాబ్ మేళా గొప్ప అవకాశం**

ఎమ్మెల్యే ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ భూపాలపల్లి నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళా గొప్ప అవకాశమన్నారు. సుమారు 10 వేల నుంచి 12 వేల వరకు ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. టాస్క్ ద్వారా జిల్లాలో నైపుణ్యాభివృద్ధి శిక్షణను మరింత విస్తరించనున్నట్లు చెప్పారు. గత సంవత్సరం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 2700 మందికి ఉద్యోగ అవకాశాలు. కల్పించినట్లు తెలిపారు. భూపాలపల్లి సింగరేణి పారిశ్రామిక ప్రాంతాన్ని ప్రభుత్వ సహకారంతో ఇండస్ట్రియల్ కారిడార్ గా మార్చడం కోసం కృషి చేస్తానని, మంత్రి శ్రీధర్ బాబు సహకరించాలని కోరారు.

**నిరుద్యోగ యువతకు డిజిటల్ లైబ్రరీ ఎంతో ఉపయోగం:** వివిధ ప్రభుత్వ ఉద్యోగాల సాధన పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు డిజిటల్ లైబ్రరీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని జిల్లా గ్రంథాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ గ్రంథాలయాల్లో అందుబాటులో లేని పుస్తకాలను సైతం ఈలైబ్రరీ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా చదివే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, గ్రంథాలయ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, లైబ్రేరియన్ శారద, ప్రజాప్రతినిధులు, పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో తక్కళ్లపల్లి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్:** హనుమకొండలోని వరంగల్1, వరంగల్2, హనుమకొండ డిపోలలో జరుగుతున్న ఆర్టీసీ ఎన్నికలలో ఓట్ల సరళిని సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు పరిశీలించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, హనుమకొండ జిల్లా ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి వరంగల్ లోకల్ డిపో, హనుమకొండ డిపోలలో పోలింగ్ కేంద్రాల్లో తిరిగి ఓటింగ్ నమోదును పరిశీలించడం జరిగింది.ఆర్టీసీ ఎన్నికలలో ఈయూ కూటమి గెలుపు ఖాయమని అన్నారు.

## ఎసిబికి చిక్కిన మహబూబాబాద్ జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింహారావు

మేనేజర్ నివాసంతోపాటు 7ప్రాంతాల్లో విస్తృత సోదాలు



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ పూర్తి అదనపు బాధ్యతల మేనేజర్ వాసంశెట్టి నర్సింహారావు ఏసిబికి చిక్కారు. జిల్లాలోని మిల్లర్ల నుంచి బియ్యం బదులుగా డబ్బులు తీసుకుని, రేషన్ బియ్యాన్ని మళ్ళీ గోదాంకు తరలించి ఒక్కో లారీ నుంచి లక్షల రూపాయలు దండుకున్నట్లు అభియోగాలు ఉన్నాయి. ఆదాయానికి మించిన ఆస్తున్న ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. ఖమ్మం ఏసిబి డిఎస్‌పి వై.రమేష్ ఆధ్వర్యంలో మేనేజర్ నర్సింహారావు నివాసంతోపాటు ఆయన బంధువుల నివాసాల్లో ఏసిబి అధికారులు విస్తృతంగా సోదాలు చేశారు. మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, హైద్రాబాద్ తదితర ఏడు ప్రాంతాల్లో సోదాలు జరుపుతూ నరసింహారావు ఆస్తులపై కూపీ లాగుతున్నారు.

## అంతర్జాతీయ విప్లవకారుడు కామ్రేడ్ చేగువేరా

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/ధర్మసాగర్:** ప్రపంచ విప్లవోద్యమ నేత క్యూబన్ విప్లవ వీరుడు ఎర్నెస్టో చేగువేరా అని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి తెలిపారు. శుక్రవారం ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామంలో గ్రామ శాఖ కార్యదర్శి ధోనికెల రాజయ్య అధ్యక్షతన చేగువేరా 59వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నేదునూరి జ్యోతి హనుమకొండ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ మాట్లాడుతూ అర్జెంటీనా మార్క్సిస్టు విప్లవ వీరుడు, వైద్యుడు, రచయిత, మేధావి గెరిల్లా పోరాట నాయకుడు సిగ్మాండ్ ఫ్రాయిడ్ భావాలతో ప్రభావితమై తత్వ శాస్త్రము, రాజనీతి శాస్త్రము, గణిత శాస్త్రము అధ్యయనం చేసిన గొప్ప తత్వవేత్త అని పేర్కొన్నారు 1948లో ప్రపంచ మోటార్ సైకిల్ యాత్ర చేసి అనేక దేశాలలో జాతి విముక్తి పోరాటాలకు దిక్సూచిగా నిలిచాడని, దక్షిణ అమెరికా మొత్తం పర్యటించి విముక్తి పోరాటాలకు యుద్ధ తంత్రం గరిల్లా పోరాటాలు నిర్వహించారని తెలిపారు. క్యూబా విప్లవంలో బాటిస్టా సైన్యాన్ని మట్టి కరిపించి క్యాస్ట్రోకు అండగా నిలిచి క్యూబన్ విప్లవానికి నాంది పలకడంలో తెగువ చూపాడని అన్నారు. యుద్ధ తంత్రాన్ని సైనిక శిక్షణను నేర్పించడంలో తనకు తానే సాటి అన్నారు అక్టోబర్ 9న 1967లో తుది శ్వాస విడిచారని తెలిపారు. చేగువేరా స్పూర్తితో రాజ్యాంగ రక్షణ ప్రజాస్వామ్య, లౌకికవాద పరిరక్షణ కొరకు ప్రతిఘటన పోరాటాలలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, మండల సిపిఐ కార్యదర్శి కొట్టె వెంకటేష్, మహిళా సమాఖ్య హనుమకొండ జిల్లా కార్యదర్శి రాస మల్ల దీన, పసునూరి సునీల్, మడికంటి లావణ్య, బైరపాక అన్నమ్మ, భూషణం, బైరిపాక ఆనందం తదితరులు పాల్గొన్నారు.

## దామెర అరుణ్ కుమార్ మరణం తీరని లోటు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/దామెర:** దామెర అరుణ్ కుమార్ మరణం తీరనిలోటని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు దామెర కృష్ణ కుమారుడు దామెర అరుణ్ కుమార్ ఇటీవల మృతి చెందగా శుక్రవారం ఆయన స్వగ్రామం అయిన హనుమకొండ జిల్లా దామెర మండల మండల కేంద్రంలో దామెర అరుణ్ కుమార్ యాది సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ గారి చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పూలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సిపిఐ దామెర మండల కార్యదర్శి కొట్టేపాక రవి అధ్యక్షతన జరిగిన యాది సభలో ముఖ్య అతిథిగా హాజరైనా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ దామెర కృష్ణ కుమారుడు దామెర అరుణ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని అన్నారు. దామెర అరుణ్ కుమార్ మరణం వారి కుటుంబానికి, సమాజానికి తీరనిలోటని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు సిపిఐ తరుపున ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నారపు రమేష్, తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు అరెల్లి రవి, జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజనర్సు, నాయకులు రొంటాల శ్యామ్, వేణు, రాజు, భవానీ, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రెహమాన్, రాష్ట్ర సహాయ కార్యదర్శి బాషబోయిన సంతోష్



**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** స్వయంప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘాన్ని, బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకొని, అధికారం సుస్థిరం చేసుకోవడానికి ప్రయత్నిస్తోందని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రెహమాన్ దుయ్యబట్టారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్ లో ఏఐఎస్ఎఫ్ కేయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొని రెహమాన్ మాట్లాడారు. భారత దేశంలో పుట్టిన ప్రతివ్యక్తికి రాజ్యాంగం కులమతాలు, లింగభేదం లేకుండా ఓటు హక్కు కల్పించిందన్నారు. ఒక వ్యక్తి, ఒక ఓటు అనే ప్రాథమిక సూత్రం ప్రాతిపదికన హక్కులు కల్పించబడ్డాయని తెలిపారు. పన్నెండు సంవత్సరాల బీజేపీ పాలనలో ప్రజలు విసిగిపోయారని, ప్రభుత్వ వ్యతిరేక పెరుగుతోందని అన్నారు. దీంతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని ప్రభావితం చేసి ఓటు చోరికి పాల్పడుతోందని విమర్శించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఓట్లను తొలగిస్తూ, తమకు అనుకూలంగా వున్నవారి ఓట్లను మాత్రమే జాబితాలో చేర్చుతున్నారని అన్నారు. వివిధ రాష్ట్రాలలో జరుగుతున్న సర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని రెహమాన్ డిమాండ్ చేశారు. తెలంగాణ లో సైతం దాదాపు యాభై లక్షల ఓట్లు గల్లంతయ్యాయని, వీటిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలి కోరారు. అర్హులైన సామాన్యుల, పేదవారి ఓట్లను పునరుద్ధరించి, ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాషబోయిన సంతోష్ మాట్లాడుతూ, రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడిన సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే విద్యార్థులు, యువకులు ఏకమై సంఘటిత ఉద్యమాలు నిర్మిస్తామని హెచ్చరించారు. అక్టోబర్ 10న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసన పోరాటానికి ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, కేయూ సహాయ కార్యదర్శి వంశీ కుమార్, సరిత, శ్రీవేణి తదితరులు పాల్గొన్నారు.

## జనగామలో ఎంప్లాయిస్ యూనియన్ విజయం

డిపో కార్యదర్శిగా విఎస్ఆర్. రెడ్డి



**ప్రజాపక్షం/జనగామ :** ఆర్‌టిసి ఎన్నికల్లో జనగామ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ విజయం సాధించింది. ప్రత్యర్థిపై వంద ఓట్ల మెజార్టీలో ఎంప్లాయిస్ యూనియన్ ఘన విజయం సాధించడంతో ఆర్‌టిసి కార్మికులు సంబురాలు జరుపుకున్నారు. ఎంప్లాయిస్, ఎన్ఎంయు కూటమి విజయం జనగామ కార్మికుల్లో ఆనందోత్సవాన్ని నింపింది. శుక్రవారం ఆర్‌టిసి ఎన్నికలు ఎన్నికలు జరగగా 400 మంది ఓటర్లకు 396 మంది ఓటు వేశారు. రాష్ట్ర గుర్తింపు సంఘం ఎంప్లాయిస్ యూనియన్‌కు వంద ఓట్ల మెజారీ రాగా డిపో గుర్తింపు సంఘంగా ఉన్న ఎన్ఎంయుకు 59 ఓట్ల మెజార్టీ వచ్చింది. ప్రత్యర్థి సంఘాలకు అత్యల్పంగా ఓట్లు పోలయ్యాయి. గెలుపొందిన సంఘాలు, కార్యదర్శులను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డితో పాటు పలువురు అభినందించారు. ఎంప్లాయిస్ యూనియన్ గెలుపొందడంలో ఆర్‌టిసి కార్మికులు సంబురాలు జరుపుకున్నారు.

**ఆర్‌టిసి ఎన్నికలు ప్రశాంతం**

ఆర్‌టిసి ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. జనగామ ఆర్‌టిసి డిపోలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని డిసిపి రాజమహేంద్రనాయక్ సందర్శించి పరిశీలించారు. ఆర్‌టిసి సిబ్బంది ప్రశాంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం నుండే పోలింగ్ ప్రారంభం కాగా ఆర్‌టిసి అధికారులు పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. వివిధ యూనియన్లు డిపో పరిధిలో ప్రచారం నిర్వయించాయి. బందోబస్తు పరిశీలించిన వారిలో డిసిపితో పాటు సిఐ సత్యనారయణరెడ్డి ఉన్నారు. ఆర్‌టిసి ఎన్నికల సందర్భంగా గుర్తింపు కోసం అన్ని సంఘాలు తీవ్రంగా పోటీ పడ్డాయి.



## పాఠశాలలో ఆరోగ్య శ్రేయస్సు కార్యక్రమం అమలు



**ప్రజాపక్షం/జనగామ:** జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహారం, మానసిక శ్రేయస్సుపై అవగాహన కల్పించేందుకు పాఠశాల ఆరోగ్య, శ్రేయస్సు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయాల్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్‌హెచ్‌డబ్ల్యూపి అమలు తీరుపై సమీక్ష సమావేశం నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా కేంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ, విద్యా మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అమలవుతున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని 21 జిల్లాలకు విస్తరించగా అందులో జనగామ జిల్లా కూడా ఉందన్నారు. ప్రతి పాఠశాల నుండి ఇద్దరు ఉపాధ్యాయులను ఎంపికచేసి శిక్షణ అనంతరం హె ల్త్ అండ్ వెల్నెస్ అంబాసిడర్లుగా కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. ప్రతి వారం ఒక గంట పాటు విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, మానసిక ఆరోగ్యం, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మంగళవారం ఆరోగ్యం, శ్రేయస్సు డేగా నిర్వహించి నిర్దేశించిన 11 అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఇతర ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి అవసరమైన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అసుపత్రులు, కౌమార ఆరోగ్య క్లినిక్‌ల ద్వారా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. యోగా, ధాన్య, సురక్షిత తాగునీరు, రుతుక్రమ పరిశుభ్రత ఆరోగ్యకరమైణ జీవనశైలిపై అవగామన పెంపొందించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంఒ డిఎంహెచ్ఓ వాణీ శ్రీ, జిసిడిఓ గౌసియాబేగం, అన్ని మండలలా ఎంఈఓలు, ప్రభుత్వ, ఎయిడెంట్ పాఠశాలలు, జూనియర్ కశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎసిబి వరుస దాడులు

- అవినీతి అధికారుల గుండెల్లో గుబులు
- సివిల్ సప్లయ్ మేనేజర్ నివాసాల్లో ఎసిబి సోదాలు



ప్రజాపక్షం/ఖమ్మం: అవినీతి నిరోధక శాఖ వరుస దాడులు చేస్తుంది. తమకు అందిన సమాచారంతో పాటు సేకరించిన సమాచారంతో వరుసగా దాడులు కొనసాగిస్తుండడంతో అవినీతి అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది. అక్రమంగా సంపాదించిన అనేక మంది అక్రమ సంపాదనను దాచి పెట్టడంతో పాటు ఇతరుల పేర దారి మళ్లించే ప్రయత్నాల్లో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. గడిచిన ఐదారేండ్లుగా ఖమ్మం జిల్లాలో జిల్లా స్థాయి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. మండల అధికారి మొదలు జిల్లా అధికారుల వరకు పైరవీ చేస్తేనో, పైసలు చెల్లిస్తేనో తప్ప పైలు కదల్చని పరిస్థితి. ప్రతి పైలుకు ఒక రేటు కట్టి వసూలు చేశారు. ఈ వసూళ్లలో కూడా తన మన అనే బేధం లేకుండా వసూళ్లు చేశారన్న ఆరోపణలు వినవచ్చాయి. పలు సందర్భాలలో ఆధారాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించారు తప్ప చర్యలు తీసుకోలేదు. ఎప్పుడైనా ఒకరిద్దరు అధికారులు విచారణ పేరుతో ఆదేశాలు జారీ చేసి ఆ తర్వాత దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. దీనితో అవినీతికి లైసెన్స్ వచ్చినట్లయింది. గడిచిన ఐదేండ్లుగా జిల్లా పౌర సరఫరాల శాఖపై తీవ్ర ఆరోపణలు వినవచ్చాయి. రైసుమిల్లు యజమానులతో కుమ్మకై పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడ్డారని తెలిసినా కనీస చర్యలు తీసుకోలేదు. కొన్ని రైసుమిల్లులకు సంబంధించి కోట్ల రూపాయల కుంభకోణాలు బయటపడ్డాయి. అయినా అరకొర చర్యలతో సరిపెట్టారు. ప్రధానమైన శాఖలకు బాధ్యులుగా వ్యవహరించిన అధికారులు అధికార పార్టీ నాయకులతో అంటగాగుతూ వారి అడుగులకు మడుగులు ఒత్తుతు తమ పనిని చక్కబెట్టుకున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఎవరైనా చట్ట వ్యతిరేకంగా పనులు చేయించుకోవాలనుకున్నప్పుడు అధికారులను కలిస్తే వెంటనే ఒక అధికార పార్టీ నాయకుని చేత ఫోన్ చేయించండి అంటూ చెప్పి ఆ పనులను చక్కబెట్టుకునే వారు. వాసంశెట్టి నర్సింహారావు ఖమ్మం సివిల్ సప్లయ్‌శాఖ మేనేజర్‌గా పనిచేసినప్పుడు పలు ఆరోపణలు వచ్చాయి. సొంత నెట్‌వర్క్‌ను నిర్వహించారన్నా ఆరోపణలు వినవచ్చాయి.చివరిలో చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు సస్పెండ్ చేసి అతి కొద్ది కాలానికే తిరిగి బాధ్యతలు అప్పగించారు. ఈ దశలో అవినీతి నిరోధక శాఖాధికారులు ఏక కాలంలో నర్సింహారావుకు సంబంధించిన నివాసాలు, బంధువుల ఇండ్లలో సోదాలు చేపట్టారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లాలో ఎసిబి డిఎస్పి వై. రమేష్ ఆధ్వర్యంలో మహబూబాబాద్‌తో పాటు



ఖమ్మం కవిరాజ్‌నగర్‌లో ఉన్న ఆయన బంధువు ఇంట్లోనూ, నేలకొండపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ లోని ఎల్‌బి నగర్‌లో కూడా సోదాలు కొనసాగిస్తున్నారు. ఆయ న ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించారన్న ఆరోపణలతోనే సో దాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఎసిబి అధికారుల నుంచి సోదాలకు సంబంధించి పూర్తి సమాచారం రావాల్సి ఉంది.

## పదవుల కోసం కాదు పనిచేసే వారికే ఓటు వేయండి



ప్రజాపక్షం/ఖమ్మంటౌన్:పదవుల కోసం కాదు పనిచేసే వారికే ఓటు వేయా టలని, ఈసారి ఎన్నికల్లో విజయం నాదేనని వరంల్– ఖమ్మం – నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్ అన్నారు. ఖమ్మ ం ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది రాత్రిరాత్రే ఎమ్మెల్సీ అభ్యర్థులు టగా పుట్టుకు వస్తున్నారని, అటువంటి వారికి తగిన గుణపాఠం చెప్పాలని, నిత్యం జనం కోసం పనిచేసే వారికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత 12 సంవత్సరాలుగా నిరుద్యోగులకు నిధులు లేవు, నియామకాలు లేవు ఇంటికో ఉద్యోగం లేదు ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు లేవని, ఊకదంపుడు ఉపన్యాసాలు 420 హామీలు తప్ప నిరుద్యోగులకు మిగిలింది శూన్యం అని అన్నారు. 25వేల ఉద్యోగాలతో మెగా డిఎస్సీని ఉద్యోగ క్యాలెండర్లో ప్రకటించినా ఇప్పటి వరకు దిక్కులేదన్నారు. సర్కారు బడిని బాగు చేస్తామని రేవంత్‌రెడ్డి ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఏమి లేదన్నారు. 33 జిల్లా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి నిరుద్యోగులను ఉద్యోగులుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సోషల్ జస్టిస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కెవి.గౌడ్, ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర నాయకులు బానోతు భద్రునాయక్, నాగరాజు, జి.వెంకటనారాయణ, ప్రణీత్, కృష్ణ, బి.రమేష్, డి.ఉదయ్, సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి సైన్స్ ప్రాజెక్టుకు స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ విద్యార్థి ఎంపిక



ప్రజాపక్షం/ ఖమ్మంవిద్యావిభాగం: స్థానిక శ్రీనగర్‌లోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ శ్రీగర్ విద్యార్థిని సిహెచ్. అనిత ఖమ్మం జిల్లా నుండి జాతీయ స్థాయి పదర్శన, ప్రాజెక్టు పోటీలకు ఎంపికై జిల్లాకు గౌరవాన్ని తీసుకువచ్చింది. సామాజిక సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానంతో పుట్‌ప్రెస్ నెమాటిక్ లిఫ్టర్ జాక్ ఆవిష్కరణకు స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మానక్‌లో జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచి సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఎన్ఐటి వరంగల్, ఎన్ఐఎఫ్ ఇన్‌స్పైర్ మానక్ వారి నుండి అవార్డు పొంది నేడు న్యూఢిల్లీలో నిర్వహించబోతున్న 12వ జాతీయస్థాయి సైన్స్ ప్రాజెక్టు పోటీలకు ఖమ్మం జిల్లా నుండి ఒకే ఒక్క ప్రాజెక్టుగా స్టెమ్ స్పార్క్ రెజొనెన్స్ ప్రాజెక్టు ఎంపిక కావడం పట్ల సంతోషంగా ఉందంటూ విద్యార్థిన్ని అన్వితకు అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొండా కృష్ణవేణి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ పథకం అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజ, కెఎంసి కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ గృహ నిర్మాణ శాఖ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో పథకం అమలు బాధ్యత పూర్తిగా ఎంపిడివోలదేనని స్పష్టం చేశారు. ఎల్2, ఎల్0తో పాటు కొత్త దరఖాస్తులను క్షేత్రస్థాయిలో వేగంగా పరిశీలించి నిబంధనల ప్రకారం అర్హులైన వారందరినీ ఎల్1 జాబితాలోకి తీసుకు రావాలని ఆదేశించారు. భూమి పత్రాలు లేవన్న సాకుతో దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టవద్దని, విద్యుత్ బిల్లులు, గ్రామ పెద్దల సమాచారం. రెవెన్యూ నివేదికల ఆధారంగా అభ్యంతరాలు లేని భూములను నిర్ధారించి ఎల్1 స్థాయికి సిఫార్సు చేయాలని సూచించారు. ఇండ్ల నిర్మాణంలో స్లాబ్ విస్తీర్ణ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ప్రతి అధికారి నిర్దేశిత నమూనాలో వాస్తవ నివేదికలు సమర్పిస్తూ అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, నియోజక వర్గ ప్రత్యేకాధికారులు, ఎంపిడిఓలు, హౌసింగ్ ఏఈలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## పోరాడితేనే సమస్యల పరిష్కారం

ఎస్‌జిపిఎటి అధ్యక్షుడు పరిశ పుల్లయ్య



ప్రజాపక్షం/ ఖమ్మం : పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం న్యూ హెల్త్ స్కీమ్‌ను ప్రకటించి ఐదు నెలలు గడిచినా అడుగు ముందుకు పడడం లేదని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఎస్‌జిపిఏటి కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వయో వృద్ధులైన పెన్షనర్ల పట్ల ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తుందన్నారు. సరైన రీతిలో స్పందించడం లేదన్నారు. రెండేళ్లు ఆలస్యంగా మం జూరు చేసిన డిఏకు సంబంధించి 33 వాయిదాలు ఇవ్వడం సరికాదని ఆ యన తెలిపారు. హెల్త్ కార్డు అప్‌లోడ్ చేసిన పెన్షనర్ల కార్డులు రావడం లే దని దీనితో వందలాది మంది పెన్షనర్లు మనోవేదనకు గురవుతున్నారని ఆ యన తెలిపారు. ఎడిట్ ఆప్షన్‌ను పెన్షనర్లకు ఇవ్వడంలో విపరీతమైన జాప్యం, హెల్త్ కార్డు వచ్చినప్పటికీ అది అమలు కావడం లేదని పుల్లయ్య తెలిపారు. పెన్షనర్ పేపర్ కావాలంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. సమావేశం ఇటీవల మరణించిన సీనియర్ పెన్షనర్లకు సంతాపం ప్రకటించి నివాళులర్పించింది. ఈ సందర్భంగా పలువురు ఎస్‌జిపిఏటి సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి వి. మేరీ ఏసుపాదం, జిల్లా నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, గుర్రా ల శ్రీనివాసరావు, బోజడ్ల కృష్ణకుమారి, కొలికొండ శరత్, జిల్లా వెంకటేశ్వ ర్లు, రాధాకృష్ణమూర్తి, ప్రసాదరావు, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఆర్‌టిసి ఎన్నికలు



98.04 శాతం పోలింగ్

ఆర్‌టిసి గుర్తింపు ఎన్నికల్లోనూ ప్రలోభ పర్వం

ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఖమ్మం డిపోలో స్వల్ప ఉద్రిక్తత మినహా మిగిలిన ఆరు డిపోల పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఖమ్మం డిపోలో ఒక యూనియన్‌కు చెందిన వ్యక్తి ఎంప్లాయీస్ యూనియన్ కార్యకర్తను నెట్టివేయడంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు ఆ వ్యక్తిని అరెస్టు చేయడంతో పరిస్థితి సర్దుమణిగింది. ఖమ్మం రీజియన్‌లో ఏడు డిపోల పరిధితో పాటు ఆర్‌ఎం కార్యాలయంలో ఓట్లు కలిపి 1789 ఓట్లు ఉండగా 1754 ఓట్లు పోలయ్యాయి. మణుగూరులో 240 ఓట్లకు గాను 238 ఓట్లు పోలయ్యాయి. మధిరలో 188 ఓట్లకు గాను 155 ఓట్లు పోల్ కాగా సత్తుపల్లిలో 294 ఓట్లకు గాను 292 ఓట్లు పోలయ్యాయి. ఇల్లందులో 107 ఓట్లకు గాను 102 పోలయ్యాయి. కొత్తగూడెంలో 176 ఓట్లకు గాను 173 ఓట్లు పోలయ్యాయి. భద్రాచలం డిపోలో 333 ఓట్లకు గాను 317 ఓట్లు పోలయ్యాయి. ఖమ్మం డిపోలో 422 ఓట్లకు గాను 418 ఓట్లు పోలయ్యాయి. ఆర్‌ఎం కార్యాలయంలో 29 ఓట్లకు గాను 29 ఓట్లు పోలయ్యాయి. రీజియన్ పరిధిలో 98.04 శాతం ఓట్లు పోలయ్యాయి. జనరల్ ఎన్నికల మాదిరి ఆర్టీసి గుర్తింపు ఎన్నికల్లోనూ ప్రలోభ పర్వం కొనసాగింది. అధికార పార్టీ మద్దతు ఉన్న కూటమి ఖమ్మం డిపోతో పాటు మరి కొన్ని చోట్ల ఓటుకు రెండువేల నుంచి మూడువేల నగదు పంపిణీ చేయగా మహిళా ఓటర్లకు రెండువేల రూపాయల చీరలను పంపిణీ చేసినట్లు సమాచారం. కొందరు ఓటర్లకు రూ.1500 విలువైన హాట్‌బాక్స్‌లను కూడా పంపిణీ చేశారు. మొత్తంగా ప్రలోభ పర్వం జనరల్ ఎన్నికలను తలపించే రీతిలో సాగింది. అన్ని డిపోల వద్ద ఎంప్లాయీస్ యూనియన్, ఏఐటియుసి నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడంతో ఏఐటియుసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బూత్‌ల వద్ద నిలబడి ప్రచారం నిర్వహించారు.

## సైబర్ నేరాల కేసుతో సత్తుపల్లి, వేంసూరులో కలకలం



ప్రజాపక్షం/సత్తుపల్లి:సత్తుపల్లి నియోజకవర్గంలో సంచలనం సృష్టించిన వెయ్యి కోట్ల సైబర్ క్రైమ్ కేసు దర్యాప్తులో బాగంగా సత్తుపల్లి, వేంసూరు మండలాల్లోని సైబర్ క్రైం నిందితుల ఇండ్లలో ఏక కాలంలో సైబర్ క్రైం సెక్యూరిటీ డి ఎస్ పి కెవిఎం ప్రసాద్ నేతృత్వంలో శుక్రవారం సోదాలు జరిగాయి. సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో ఏకకాలంలో నిర్వహించిన సోదాలు స్థానికంగా కలకలం రేపాయి. గతేడాది వీ.ఎం.బంజర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసును అధికారులు మరోసారి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో సైబర్ క్రైమ్ కేసులో నిందితుడిగా పేర్కొంటున్న సత్తుపల్లికి చెందిన బొప్పన నాగప్రసాద్ నివాసంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో ఒక బెంజ్ కారు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఆరు సెల్‌ఫోన్లను, ఇతర ఆస్తి పత్రాలు, క్రెడిట్, డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వీటితోపాటు కేసు దర్యాప్తునకు ఉపయోగపడే కీలక పత్రాలను కూడా అధికారులు సీజ్ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు, వేంసూరు మండలం రాజుగూడెంలోనూ సైబర్ క్రైమ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ కేసులో మరో నిందితుడిగా పేర్కొంటున్న మేడా సతీష్ కుమార్ నివాసంలో సోదాలు చేపట్టి, కేసుకు సంబంధించిన వివరాలను సేకరించినట్లు సమాచారం. వెయ్యి కోట్లకు సంబంధించినదిగా ప్రచారంలో ఉన్న ఈ సైబర్ క్రైమ్ కేసులో స్థానికంగా ఉన్న వ్యక్తుల నివాసాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

## కమ్యూనిస్టు పార్టీ నుండి మద్దతు తెలపండి

కూనంనేనిని కోరిన తిప్పన సిద్దులు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: ఖమ్మం–వరంగల్ – నల్గొండ పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉందని, తనకు భారతకమ్యూనిస్టు పార్టీ నుండి మద్దతు తెలపాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరాంను తిప్పన సిద్దులు కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిద్దులు మాట్లాడుతూ తాను తెలంగాణ తొలి,మలిదశ ఉద్యమాల్లో కీలంగా వ్యవహరించి ప్రజలను జాగృతి పరిచేందుకు తనదైన శైలిలో పోరాడినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్దించిన తర్వాత తనకు పదవులు ఇస్తామని చెప్పి మాటతప్పారని, తొలిమలి దశ ఉద్యమకారున్ని అయిన తనను ఇప్పటికైనా గౌరవిస్తారని ఆశించినప్పటికీ భంగపాటు ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రధానాచార్యునిగా పదవీ విరమణ పొందానని, తన ఉద్యోగ సమయంలోనూ ఇప్పుడూ అనేక మందిని సన్మార్గంలో నడిపేందుకు కృషి చేసినట్లు చెప్పారు. తనకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు పూర్తి అర్హత ఉందని, ఆసక్తి ఉందని చెప్పారు. సిపిఐ నుండి మద్దతు తెలపాల్సిందిగా కూనంనేనిని కోరడంతో సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. అదే విధంగా పిఆర్‌టియూ, పిఆర్‌టి, ఎటిఎఫ్ ప్రతినిధులు దనికొండ శ్రీనివాస్, టి వెంకటేశ్వర్లు, లక్ష్మ ణరావు, సత్యనారాయణ, డా.పి.మంజులను కూడా కలిసి తనకు మద్దతు తెలపాలని కోరానని వారు కూడా సానుకూల స్పందింన తెలిపారన్నారు.

## ‘నేడు’ ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు పర్యటన

ఖమ్మంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు రాష్ట్ర మంత్రులు శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించనున్నారు. వివిధ కార్యక్రమాలతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఓట్ల చేర్పింపు, సన్నాహక సమావేశంలో వారు పాల్గొననున్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం రూరల్ మండలంతో పాటు భద్రాద్రి కొత్తగూడెంజిల్లా అశ్వారావుపేట నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

## ఎంప్లాయిస్ యూనియన్ విజయం ఖాయం

- కార్మికుల పక్షాన నిలిచే ఇయు, ఎన్ఎంయుకె పట్టం
- ప్రభుత్వంలో విలీనమే ప్రధాన ఎజెండాగా ఉద్యమిస్తాం: సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం: తెలంగాణ రాష్ట్రరోడ్డు రవాణా సంస్థలో కార్మికుల ఉద్యోక భద్రత న్యాయమైన హక్కుల సాధనే ధ్యేయంగా రాజీలేని ఉద్యమాలు సాగిస్తామని, ఈ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి విజయం తథ్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డిపోల వద్ద సిపిఐ అనుబంధ ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ నేషనల్ మజ్దూర్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్ కూటమి ఏర్పాటు చేసిన ఎన్నికల శిబిరాలను పాషా సందర్శించి సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు డిపోల్లో గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ శుక్రవారం ప్రశాతంగా జరిగింది. మొత్తం 857 మంది ఓటర్లలో డిపోల వారీగా కొత్తగూడెంలో 176కి 173 మంది కార్మికులు, భద్రాచలంలో 333 మందికి 317మంది, మణుగూరులో 241మందికి 227 మంది, ఇల్లెందులో 107 మంది కార్మికులకు గానూ 102 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని, 70 శాతం మేరా కార్మికులు ఇయూ కూటమి వైపు మొగ్గు చూపారని మిగిలిన పోస్టల్ బ్యాలెట్స్ సైతం ఇయూ కూటమికి అనుకూలంగా ఉంటుందన్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఆర్టీసిని శ్రమజీవులైన కార్మికులను తీవ్ర నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. విలీన ప్రక్రియ డిమాండ్ సాధించడం, పెండింగ్ వేతనాల సవరణ, ఉద్యోగ భద్రత వంటి సమస్యలపై నిరంతరం పోరాడిన చరిత్ర తమ సంఘానికి ఉందని గుర్తు చేశారు. నిరంతరం కార్మికులకు అండగా ఉంటూ సేవలు అందించే సంఘాలవైపే కార్మికులు మొగ్గుచూపారని, రాష్ట్రంలో గుర్తింపు సంఘం ఎంప్లాయిస్ యూనియన్, ఖమ్మం రీజియన్‌లో ప్రాతినిధ్యం సంఘం నేషనల్ మజ్దూర్ యూనియన్ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఎన్నికుట్రలు పన్నినా కార్మిక ప్రయోజనాలే పరమావధిగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, డి వీరస్వామి, వాసిరెడ్డి మురళీ, కొమారి హన్మంతరావు, నేరెళ్ల రమేష్, భూక్య శ్రీనివాస్, వంగ వెంకట్, గెద్దాడు నగేష్, జక్కుల రాములు, కె రత్నకుమారి, ధనలక్ష్మి, రాజేశ్వరరావు, పైడిపల్లి లక్ష్మి, కార్పొరేటర్లు, నాయకులు నజీర్, అప్పారావు, ఎండి యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, బండి నర్సింహా, గుర్రం వెంకటేశ్వర్లు, దారావత్ దినేష్, నామా వినోద్, ధర్మరాజు, సత్యనారాయణచారి, షాహీన్, కైసర్, అంకూష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : మండల పరిధిలోని పలు పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలకు శనివారం నుంచి దసరా సెలవులు ఇవ్వడంతో పాఠశాలల్లో ముందస్తుగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేసి పూజలు నిర్వహించారు. సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా వేడుకల్లో పాల్గొని బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ సుజాత, ఉపాధ్యాయురాలు రమాదేవి, సుమలత, మల్లికార్జునరావు, వెంకటనర్సమ్మ, సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు. చిమ్మపుడి అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. గణేశ్వరం పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రీ ప్రైమరీ స్కూల్ సిబ్బంది, వంట ఏజెన్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె రఫీక్ పాషా, వెంకటేశ్వరరావు, మజహర్, విజయలక్ష్మి , కౌసల్య, రాధ, ప్రియాంక, సోమిలి, జ్యోతి, అరుణ, నాగమణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఎల్. గోపాలరావు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని విద్యార్థులకు పులిహార ప్రసాదాన్ని అందజేశారు.

## ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

70 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/బూర్గంపాడు:పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలతో అండగా నిలుస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు మార్కెట్ యార్డులో 70 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ద్వారా 11,204 కుటుంబాలకు లబ్ది చేకూరుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తొలి విడతలో 3,500 ఇళ్లతో పాటు అదనంగా మరో 1,000 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. 2,655 కొత్త రేషన్ కార్డులు అందించామని, 19,550 మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. మరో 920 మందికి పింఛన్లు అందించే అంశం పరిశీలనలో ఉందన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి కుటుంబం ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. చెరువు సింగారం రహదారికి రూ 2కోట్లు, మండలంలో రహదారుల అభివృద్ధికి రూ 186 కోట్లు, కరకట్ట నిర్మాణానికి రూ 36కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. సీతారామ ప్రాజెక్టు నీటిని కృష్ణసాగర్, ముసలిమడుగు, లక్ష్మీపురం, రెడ్డిపాలెం గ్రామాలకు అందించే అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నియోజకవర్గ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి వారాల వేణు, ఎంపిడిఓ జములారెడ్డి, ఎంపీఓ రామకృష్ణ, స్థానిక సర్పంచ్ మందా నాగరాజు, ఉప సర్పంచ్ గుండె వెంకన్న, డిప్యూటీ తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, పంచాయితీరాజ్ ఏఈ చారి, మండల హౌసింగ్ ఎఇ ఉదయ్ కిరణ్, సర్పంచులు బాదం వెంకటేశ్వర రెడ్డి, పూణెం సురేందర్, బానోత్ పద్మ, బాదం రమేష్‌రెడ్డి, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు హరీష్, యువజన విభాగం నియోజకవర్గ ఉపాధ్యక్షులు నాయకులు అధికారులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో పువ్వాడ నగర్‌లో ఇళ్ల స్థలాల సర్వే

ఏడు ప్రత్యేక బృందాల ఏర్పాటు

ఆర్‌డిఓ శ్రీనివాస్



ప్రజాపక్షం/రఘునాథపాలెం: పువ్వాడ నగర్‌లో త్వరలో ఇళ్ల స్థలాల సర్వే చేపట్టనున్నట్లు ఆర్ డిఓ శ్రీనివాస్ తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలు, ఆందోళన చెందకుండా సర్వే బృందాలకు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. శుక్రవారం రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2009–2016లలో ప్రభుత్వం కోయచలక పరిధిలోని సర్వే నెం.192లో దాదాపు 2వేల మందికి పైగా నిరుపేదలకు 75 గజాల చొప్పున ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిందని ఆయన తెలిపారు. ఆ ప్రాంతంలోని ఇండ్ల స్థలాలకు సంబంధించి తరచూ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలో పువ్వాడ నగర్‌లో ప్రాథమిక సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సర్వే కోసం జిపివో, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు ఒక బృందంగా మొత్తం ఏడు బృందాలను ఏర్పాటు చేశామని, ఈ బృందాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్‌ఐలు) పర్యవేక్షిస్తారని ఆర్డివో తెలిపారు. ప్రస్తుతం అక్కడ నివాసం ఉంటున్న వారు అసలైన పట్టాదారులా లేక ఆ స్థలాన్ని కొనుగోలు చేశారా, గిఫ్ట్‌గా వచ్చిందా, స్థలాలు ఖాళీగా ఉన్నాయా వంటి విషయాలపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తామన్నారు. స్థానికులు తమ వద్ద ఉన్న స్థలానికి సంబంధించిన పత్రాలతో పాటు ఆధార్ కార్డు, ఓటరు ఐడి కార్డు వంటి గుర్తింపు కార్డులను సర్వే బృందాలకు చూపించాలని సూచించారు. సర్వే ప్రారంభానికి ముందు స్థానికంగా గ్రామసభ నిర్వహించి ప్రజలకు పూర్తి స్పష్టత ఇస్తామని ఆ తర్వాతే క్షేత్రస్థాయి పరిశీలన మొదలవుతుందని తెలిపారు. ఇటీవల ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దతండాలోనూ ఇదే తరహాలో సర్వే జరిగిందన్నారు. పువ్వాడ నగర్ సర్వే నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు. ప్రజలందరూ ఎలాంటి ఆందోళన చెందకుండా అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్వేత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'గీత' విద్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం / చొప్పదండి :** పట్టణంలోని గీత విద్యాలయంలో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీలు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఆర్.లింగారావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో బతుకమ్మ పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. తీరొక్క పూలను తీసుకొచ్చి మహిళలు బతుకమ్మ వేడుకలను నిర్వహించుకోవడం ఆనవాయితిగా వస్తుందని పేర్కొన్నారు. విద్యార్థినీలు చదువుతోపాటు మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గుర్రం ఆనంద రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బతుకమ్మ రాష్ట్ర సంస్కృతికి ప్రతీక




**ప్రజాపక్షం / కొత్తపల్లి :** బతుకమ్మ పండుగ రాష్ట్ర సంస్కృతి వైభవానికి ప్రతీక అని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అత్యంత ప్రసిద్ధమైన సంప్రదాయ జానపద నృత్యాలలో దాండియా ఒకటని, గుజరాత్ రాష్ట్రంలో ఉద్భవించి దేశంలోని అన్ని ప్రాంతాలలో ప్రజాదరణ పొందిందన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉత్సాహంగా నిర్వహిస్తారని తెలిపారు. బతుకమ్మ వేడుకల్లో సద్దుల బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉందని మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో వేడుకలను నిర్వహించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలి: కలెక్టర్ హైమావతి




**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట నుండి సిరిసిల్ల వరకు రైల్వే లైన్ పనులు వేగవంతంగా జరిగేలా పర్యవేక్షణ చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో రైల్వే ప్రాజెక్టు ముఖ్య అధికారులు, రెవెన్యూ, అర్ అండ్ బి, పి ఆర్ అధికారులతో సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎన్. నవ్య శ్రీ (ఐఆర్ ఎస్ ఇ) తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల్లో రైల్వే లైన్ నిర్మాణంలో పెండింగ్ లో సమస్యలు, బ్రిడ్జి నిర్మించే ప్రాంతాల్లో భూ సేకరణ వివరాలు గూర్చి రైల్వే అధికారులు కలెక్టర్ కి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ.. రైల్వే పనుల వల్ల పక్కన రైతులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చెయ్యాలని, బ్రిడ్జి నిర్మాణాలు వేగంగా పూర్తి చెయ్యాలని రైల్వే అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డిఒసదానందం, రైల్వేస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మూర్తి, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం: కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో హౌసింగ్ అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల పథ కం అమలు, నిర్మాణ పనుల పురోగతిపై. సమీక్షనిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడు తూ కొత్తగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సం బంధించి ప్రొసీడింగ్స్ పంపిణీ ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అం దజేసి, ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా అ వ సరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మొదటి జాబితాలో ఇప్పటివరకు మార్కింగ్ పూ ర్తి కాని ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వెం టనే మార్కింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా క లెక్టర్ ఆదేశించారు. మార్కింగ్ పూర్తయిన ఇళ్ల లో నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా లబ్ధిదారులతో సమన్వయం చేసుకుంటూ పనులు ప్రా రంభించేలా చూడాలని తెలిపారు.ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్న వివరాలను సేకరి ంచి, ప్రతి ఇంటి నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గు ర్తించి, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని తెలిపారు.లబ్ధిదారులకు పథకానికి సం బంధించిన మార్గదర్శకాలను వివరించి, ఇళ్ల ని ర్మాణ పనులు సకాలంలో పూర్తయ్యేలా నిరంత రం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ సమీక్ష లో హౌసింగ్ పిడిపవన్ కుమార్,డిప్యూటిఇఇ దస్తగిరి,ఎఇలు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సిఇసి రాజీనామాకు నిరసన

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** సిఈసి ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ 13 కోట్ల ఓట్లను కొల్లగొట్టారని బిజెపికి తొత్తుగా మారి సామాన్యుల ఓట్లను కొల్లగొట్టిన, అతను తన పదవికి రాజీనామా చేయాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన నిరసన కార్యక్రమం చేపట్టారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూడిది రాజేందర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పాతూరి భూపాల్ రెడ్డి, కోరుట్లపేట దేవానందం, కల్లూరి బాపురెడ్డి, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్కే సాహెబ్, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు ఉడుగుల సురేందర్, బండారి బాల్‌రెడ్డి, లింగం గౌడ్, ఉప్పుల రవీందర్, నేరెటి భాను, నమిలికొండ సత్తయ్య, దండు శ్రీనివాస్, ఇమామ్, అన్నవేణి రవి తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యాక్స్ ద్వారా రైతులకు విశిష్ట సేవలు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజా పక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ఫ్యాక్స్) నూతన పాలకవర్గ అభినందన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేములవాడ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సొసైటీ పరిధిలోని 22 గ్రామాలు, వేములవాడ రూరల్ మండలానికి చెందిన 17 గ్రామాలు, అదనంగా మరో 4 గ్రామాలను కలుపుకొని ఏర్పాటు చేసిన ఈ సింగిల్ విండోకు ఎంపికైన చైర్మన్, పాలకవర్గ సభ్యులపై గురుతరమైన బాధ్యత ఉందని ఆయన తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు నిరంతరం సేవలు అందిస్తూ, ప్రభుత్వానికి – రైతులకు మధ్య ఒక వారధిలా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ వకుళభరణం శ్రీనివాస్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు, వారి కుటుంబ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవుల విషయంలో తీవ్ర పోటీ ఉన్నప్పటికీ, సామర్థ్యం , కష్టపడే తత్వాన్ని ప్రాతిపదికగా తీసుకుని నాయకులను ఎంపిక చేశామని తెలిపారు. అవకాశం రాని మిగతా సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత కల్పిస్తూ వారి సేవలను ఉపయోగించుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలోని 13 సొసైటీలకు గాను ఇప్పటివరకు 12 సొసైటీలలో సామాజిక సమతుల్యత పాటిస్తూ పాలకవర్గాలను విజయవంతంగా ఎంపిక చేశామని వివరించారు. రాబోయే కాలంలో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని ముందే గ్రహించి రైతులకు అవగాహన కల్పించామని తెలిపారు. సన్నరకం వరి సాగు చేసిన రైతులకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉందన్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం సన్నరకానికి మంచి డిమాండ్ లభిస్తుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతు సంక్షేమానికి కట్టుబడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పురపాలక సంఘం చైర్‌పర్సన్ పుల్కం రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వేములవాడ ఫ్యాక్స్ చైర్మన్ వకుళభరణం శ్రీనివాస్, ఫ్యాక్స్ చైర్మన్ లు.. రుద్రవరం చైర్మన్ పిల్లి కనకయ్య, రుద్రంగి చైర్మన్ చెలకల తిరుపతి, కోనరావుపేట చైర్మన్ ఎల్లయ్య, స్థానిక కౌన్సిలర్స్, ప్రజాప్రతినిధులు, డైరెక్టర్ లు, వివిధ గ్రామాల నాయకులు, సొసైటీ సభ్యులు, రైతులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపునకు చిత్తశుద్ధితో కృషి చేస్తాం

ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణారావు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలోనే ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు.సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లిలోని డాక్టర్ విజయ ఫంక్షన్ హాల్‌లో పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులతో ఆయన ప్రత్యేక ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు జర్నలిస్టులు తమ చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాలు, ఇండ్ల మంజూరు అంశంపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి తమ సమస్యలను వివరించగా ,ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పారదర్శకంగా,వేగవంతంగా సాగేందుకు యూనియన్లు, సంఘాలతో సంబంధం లేకుండా ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారమే ధ్యేయంగా జర్నలిస్టులంతా కలిసి ఒక ఐదుగురు సభ్యులతో కూడిన సమన్వయ కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.ఆ కమిటీ ముందుకు వస్తే అధికారులతో మాట్లాడి అవసరమైన పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఎక్కడైనా అనువైన ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉంటే, సంబంధిత సర్వే నంబర్లను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని జర్నలిస్టులకు సూచిస్తూ,అధికారులతో కలిసి సమష్టిగా పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఆయన పూర్తి భరోసా ఇచ్చారు.ఈ ఆత్మీయ సమ్మేళనంలో పెద్దపల్లి నియోజకవర్గంలోని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు,నియోజకవర్గంలోని వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

## 'ఆల్ఫోర్స్' విద్యాసంస్థల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు





**ప్రజాపక్షం/జగిత్యాల / కరీంనగర్ టౌన్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని జగిత్యాల ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల,పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి పాల్గొని మొదటగా అమ్మవారి విగ్రహానికి పూలమాల వేసి బతుకమ్మల కు జ్యోతి వెలిగించి అట్టహాసంగా ఈ కార్యక్రమాన్ని ప్రా రంభించారు.ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ కళాశాలల పా ఠశాలల ప్రిన్సిపాల్స్,అధ్యాపకులు,సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

### మహిళా కళాశాలలో బతుకమ్మ సంబరాలు

ఆల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ, పిజికళాశాల ఆధ్వర్యంలో స్థానిక శుభం గార్డెన్స్‌లో శుక్రవారం అత్యంత వైభవంగా బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. ఈ వేడుకలకు కళాశాల చైర్మన్ డా.వి.రవీందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థినీలు తమలోని ప్రతిభను గుర్తించి నిరంతరం శ్రమిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినీలు సంప్రదాయ దుస్తుల్లో తరలివచ్చి తీరొక్క పూలతో బతుకమ్మలను తీర్చిదిద్దారు. విద్యార్థినీలు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేయడంతో ప్రాంగణమంతా పండుగ శోభతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తి

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల :** నిర్ణిత గడువులోగా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు .మెడికల్ కళాశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్అండ్‌బి ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్,జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, మెడికల్ కళాశాల విద్యార్థి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు.మెడికల్ కళాశాల నిర్మాణ పనుల పురోగతి, విద్యార్థుల సమస్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు.జగిత్యాల మెడికల్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్అండ్‌బి ఇంజినీరింగ్ శాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు.కళాశాలలో ఇంకా పూర్తికావాల్సిన నిర్మాణ పనులను గుర్తించి, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణ పనులన్నింటినీ విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్‌కు, విద్యార్థి నాయకులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్‌డిఒ పి.మధుసూదన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్,ఆర్అండ్‌బి ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి, బిఆర్ఎస్‌లకు ప్రజాక్షేత్రంలో పరాభవం తప్పదు

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అనంతుల రమేష్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** పదేళ్లు అధికారంలో ఉండి అడ్డగోలు అవినీతికి పాల్పడి ప్రతిపక్ష పాత్ర నిర్వహించకుండా వ్యవహరిస్తున్న బిఆర్ఎస్.. నగర మేయర్ పీఠము కైవసం చేసుకుని ఎనిమిది నెలలు గడుస్తున్న అభివృద్ధి పట్టని బిజెపి పార్టీల వైఖరితో నగర ప్రజలు అసహ్యించుకుంటున్నారని, రానున్న రోజుల్లో ఆ రెండు పార్టీలకు ప్రజల చేతిలో చీత్కారం తప్పదని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అనంతుల రమేష్ హెచ్చరించారు.. శుక్రవారం తీగలగుట్టపల్లి 3వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నీనోతో వర్షాభావ పరిస్థితుల వలన నీటి ఎద్దడి కరువు పరిస్థితులు కరెంటు కోతలు తదితర సమస్యలతో ప్రజలు ఉంటే బాధ్యతాయుతమైన ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ప్రభుత్వానికి సూచనలు సలహాలు ఇస్తూ ప్రజలకు అండగా ఉండాల్సింది పోయి అధికార కాంక్షతో నిత్యం రాజకీయం చేయడం రెండు పార్టీలకు చెల్లిందని విమర్శించారు. డంపు యార్డుతో నగర ప్రజలు అనేక అవస్థలు పాలవుతున్నారని , రైల్వే ఓవర్ బ్రిడ్జి నత్తనడక పనుల వలన నాలుగేళ్లుగా ప్రజలు నరకయాతనపడుతున్నారని బిజెపి నిత్యం రాజకీయ రగడతో అనవసర అల్లర్లకు ఆజ్యం పోయడం సిగ్గుచేటని అన్నారు.పథకం ప్రకారమే మేయర్ పీఠం బిజెపికి కట్టబెట్టిన బిఆర్ఎస్ పార్టీ బిజెపిని విమర్శించడం, బిఆర్ఎస్ అండతోని నగరపాలక సంస్థపై జెండా ఎగురవేసిన బిజెపి 8 నెలలుగా చేసింది శూన్యమని స్పష్టం చేశారు..మూల క్రిష్ణారెడ్డి, కూన దామోదర్, మెతుకు కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లాలో భవిష్యత్తులో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసుకుందాం



మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా అనేది ఒక దశాబ్దాల కల..ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్దిపేట జిల్లా చేస్తామని 30 ఏళ్లు, 40 ఏళ్లు గోడల మీద రాతలు, ఎన్నికల నినాదాలు, కరపత్రాలు చూశామని..కానీ ఆ కలను నిజం చేసుకున్న రోజు 2016 అక్టోబర్ 11..2026 అక్టోబర్ 11కు పదేళ్లు నిండుతున్నాయని .. అంటే మన సిద్దిపేట జిల్లాకు 10 ఏళ్లు నిండుతున్నాయని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటి ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు అన్నారు. పదేళ్లు నిండుతున్న పండుగలో మీరందరూ ఈ 10కె రన్‌లో పాల్గొనడానికి రావడం చాలా సంతోషమన్నారు. ఇంత పొద్దున్నే ఎంతో ఆహ్లాదకరంగా, ఉత్సాహభరితంగా ఈ 10కె రన్‌లో మీరందరూ ఉత్సాహం పాలుపుంచుకోవం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ రన్ ఎంత వేగంగా జరుగుతుందో.. మన సిద్దిపేట జిల్లా కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం తెల్లవారు జామున 6గంటలకు సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో 10కె రన్‌ను జెండా ఊపి మాజీ మంత్రి హరీష్‌రావుప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయాన్నే సూర్యుడు చీకటిని చీల్చుకుని ఎలా వస్తాడో.. ఈ దశాబ్దాల కాలం పాటు కలగా ఉన్న సిద్దిపేట జిల్లా కూడా ఆ సూర్యుడు చీకటిని చీల్చుకుని వచ్చినట్టుగా ఆవిర్భవించిందన్నారు.

# ఓటర్ జాబితా సవరణలో అవకతవకలు

ఇండియా కూటమి నేతల అరెస్టును నిరసిస్తూ

కేంద్రం దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల :** ఓటర్ జాబిత సవరణలో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలో నిరసన తెలియజేసిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని ఇండియా కూటమి నేతలను బిజెపి ప్రభుత్వం అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌక్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు మాట్లాడారు. ప్రజలకు ఓటు హక్కును కల్పించి వాటిని ప రిరక్షించే బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని దానిని ఏమాత్రం పట్టించుకోకుండా ప్రధాని మోదీ, మంత్రి అమిత్ షా ఆదేశాలతో ఫామ్ 6లో చట్ట విరుద్ధమైన మార్పులు చేసి ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్ చట్ట విరుద్ధంగా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా డిక్లరేషన్ మార్చారాని మండిపడ్డారు. మిగతా కమీషనర్లు చెప్పినా వారి అభ్యంతరాలను లెక్కచేయకుండా దేశంలో ఎన్నికల సంఘం 13 కోట్ల ఓట్లను తొలగించి పక్కదోవ పట్టిస్తుందని , ఎన్నికల సంఘం బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ఎన్నికల సంఘం రాజ్యాంగ బద్ధ సంస్థ అయిన కేంద్ర ఎన్నికల కమిషన్ బుద్ధి మార్చుకొని ప్రజల పక్షాన ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆకునూరి బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల జగన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, కౌన్సిలర్లు వెంకలలీల లక్ష్మీ నరసయ్య, కూరపాటి శ్రీశైలం, లింగంపల్లి గంగరాజు, బొద్దుల శ్రీను, పట్టణ ఉపాధ్యక్షులు నీలి రవిందర్, పట్టణ కమిటీ వార్డు అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ సింగరేణి స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించనున్న దసరా ఉత్సవాలను ఘనంగా, ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ సూచించారు. దసరా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సింగరేణి, మున్సిపల్, పోలీస్ శాఖల అధికారులతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. దసరా ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. స్టేడియం పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, ప్రజల భద్రతకు అవసరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సింగరేణి, మున్సిపల్, పోలీస్ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ దసరా ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. ప్రజలు కుటుంబ సమేతంగా ఉత్సవాల్లో పాల్గొని సంతోషంగా పండుగను జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ జల్ద అరుణశ్రీ, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, ఏసిపి మడత రమేష్, సీఐ ఇంద్రసేనారెడ్డి , సింగరేణి, మున్సిపల్ శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్ రీజియన్‌లో97.66 శాతం ఓటింగ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (ఆర్‌టిసి)లో శుక్రవారం జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కరీంనగర్ రీజియన్ లోని 11 డిపోలు, ఒక వర్క్ షాపు పరిధిలోని కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రీజియన్ పరిధిలో 11 డిపోలు, ఒక వర్క్ షాపు, ఆర్ ఎం కార్యాలయం కలుపుకొని మొత్తం 2869 ఓట్లకు గాను 2802 ఓట్లు (97.66 శాతం) పోలయినట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా కరీంనగర్ వర్క్‌షాపులో 116 ఓట్లకు 115 మంది (99.13 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే వేములవాడలో 218 మందికి 213 మంది, కరీంనగర్ వన్ డిపోలో 351 మందికి 343 మంది, జగిత్యాల డిపోలో 302 ఓట్లకు 295, గోదావరిఖని 412 ఓట్లకు 400, హుజురాబాద్ 213 ఓట్లకు 210, కోరుట్లలో 186 ఓట్లకు 170, హుస్నాబాద్ 207 ఓట్లకు 205, ఆర్ ఎం కార్యాలయం 40 ఓట్లకు 39, మెట్‌పల్లి 177 ఓట్లకు 171, సిరిసిల్లా 208 ఓట్లకు 206, మంథని 178 ఓట్లకు 177, కరీంనగర్ టూ డిపోలో 261 ఓట్లకు 258 మంది కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్,ఎన్ ఎంయు, టిఎంయు ఒక కూటమిగా, ఐ ఎ న్‌టియుసి ఆధ్వర్యంలో మరో కూటమిగా బరిలో నిలిచి హోరిహోరీగా ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ రీజియన్ లో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలోని కూటమి వైపు కార్మికులు మొగ్గుచూపారని, గెలుపు ఖాయమనే ధీమాను ఆ యూనియన్ నాయకులు వ్యక్తం చేశారు.

**ఇయు కూటమికిఎఐటియుసి నేతల మద్దతు**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఆర్‌టిసి) గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ (ఇయు), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎంయు), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయు) ఐక్య కూటమికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కరీంనగర్ జిల్లా బాధ్యుడు ఎస్. సన్నీ ఎడ్వర్డ్ మద్దతు ప్రకటించారు. కరీంనగర్–2 డిపోలో ఇయు డిపో అధ్యక్షుడు రంగాచారి, కార్యద ర్శి చిర్లవంచ శ్రీనివాస్, డిపో చైర్మన్ కె. తిరుపతి, టిఎంయు డిపో అధ్యక్షు డు కనకయ్య, కార్యదర్శి ఎం.ఆర్. రెడ్డి, చైర్మన్ ఎం.వి.డి. రెడ్డి, మహిళా డి పో కార్యదర్శులు ఉమాదేవి, పద్మ ఆధ్వర్యంలో కార్మికులను కలిసి ఐక్య కూటమికి మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, మెరుగైన వేతనాలు, సంక్షేమం, మెరుగైన పని పరిస్థితుల సాధనకు ఐక్య కూటమికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం పోరాడుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పి.ఎ. రావు, శోభన్ బాబు, ఎం. రవి, సుచరిత సురేష్ రావు, లక్ష్మణ్, బి.కె. స్వామి, సునీత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత ఆందోళనలపై..

# బిజెపి సర్కారు అణిచివేత చర్యలు

- తీవ్రంగా ఖండించిన సిపిఐ
- విద్యార్థులు, ప్రజలు శాంతియుత పద్ధతుల ద్వారా ప్రతిఘటించాలని పిలుపు




**న్యూఢిల్లీ :** ప్రజల ప్రజాస్వామిక హక్కులను బిజెపి ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేస్తోందని, బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక అణిచివేత చర్యలను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఇక్కడొక ప్రకటన విడుదల చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీనామాను డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుత ర్యాలీలు నిర్వహిస్తామని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి), అన్ని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు ప్రకటించాయని, అయితే, భారత ప్రభుత్వం, ఢిల్లీలోని పోలీసు అధికారులు శాంతియుత ఆందోళనకు అనుమతిని నిరాకరించడం ఆక్షేపణీయమని మండిపడింది. అంతేకాకుండా, ఆందోళనలను అణిచివేయడానికి ప్రభుత్వం 50,000 మందికి పైగా పోలీసులను మోహరించడం అప్రజాస్వామికమని ఆరోపించింది. జంతర్ మంతర్ వద్ద సిజెపి నిర్వహిస్తున్న అక్టోబరు 10వ తేదీ ఆందోళనకు మద్దతు ఇస్తున్న వివిధ సంస్థల విద్యార్థులను అడ్డుకోవడం, నిర్బంధించడం, ఢిల్లీకి చేరుకోకుండా నిలువరించడం రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాలరాయడమేనని సిపిఐ ధ్వజమెత్తింది. గోవా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఎఐఎస్‌ఎఫ్, ఇతర సంస్థల విద్యార్థులను ఇటార్సీ రైల్వే స్టేషన్‌లోనే నిర్బంధించారని, పోలీసులు, ప్రభుత్వం అవలంభిస్తున్న అప్రజాస్వామిక చర్యను సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అలాగే, వివిద రాష్ట్రాలలోని పలువురు విద్యార్థి నాయకులను నిర్బంధించడం, విద్యార్థి సంఘాల ఢిల్లీ కార్యాలయాలను పోలీసులు చుట్టుముట్టడం అభ్యంతరకరమని సిపిఐ ఆగ్రహం వ్యక్తంచేసింది. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం ప్రజల ప్రజాస్వామిక హక్కు అని, దానిని వినియోగించుకోకుండా వారిని నిరోధించడం ప్రజల రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన అవుతుందని, అంతేకాకుండా ఇది అప్రజాస్వామిక చర్య అని ఆరోపించింది. భారత కమ్యూనిస్టు పార్టీ ఈ రాజ్యాంగ విరుద్ధమైన, అప్రజాస్వామిక చర్యలను ఖండిస్తున్నదని, అంతేకాకుండా విద్యార్థులు, ప్రజలు శాంతియుత పద్ధతుల ద్వారా దీనిని ప్రతిఘటించాలని విజ్ఞప్తి చేసింది.

## పోటీతత్వాన్ని అంతం చేస్తూ...

# ఆర్థిక ఉగ్రవాదం అమలు

- దేశంలో బిజెపి గుత్తాధిపత్యం, ద్వంద్వాధిపత్యం రుద్దుతోంది
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ



**న్యూఢిల్లీ :** వివిధ రంగాలలో పోటీని అంతం చేసి, దానికి బదులుగా గుత్తాధిపత్యం, ద్వంద్వాధిపత్యం రుద్దడం ద్వారా బిజెపి దేశంలో ఆర్థిక ఉగ్రవాదాన్ని అమలు చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆర్థిక వ్యవస్థపై నియంత్రణను తనకు అనుకూలమైన పెట్టుబడిదారులైన మిత్రులకు అప్పగించడమే మోదీ ఆర్థిక విధాన లక్ష్యమని విమర్శించారు. ప్రతిఫలంగా బిజెపి లాభాలలో తన వాటాను పొందుతుందని, పోటీని అంతం చేసి, గుత్తాధిపత్యం, ద్వంద్వాధిపత్యం రుద్దడం ద్వారా, వారు కేవలం బిజెపి ఖజానాను నింపడానికే కృషి చేస్తూ ఆర్థిక సరళీకరణ పునాదిని దెబ్బతీసిందని మడిపడ్డారు. 2014కు ముందు టెలికాం రంగంలో 13 సంస్థలు ఉండేవని, కానీ ఇప్పుడు కేవలం మూడు ప్రధాన ప్రైవేట్ సంస్థలు మాత్రమే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 'దేశీయ విమానయాన రంగాన్ని చూడండి.

2014కు ముందు 7 సంస్థలు ఉండేవి; నేడు కేవలం 2 ప్రధాన సంస్థలు మాత్రమే ఉన్నాయి!' అని ఆయన ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'డిజిటల్ చెల్లింపులు, సిమెంట్ లేదా ఫుడ్ డెలివరీ యాప్‌లు... ఇలా ఎక్కడ చూసినా పోటీని తొలగించడమే ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉంది' అని అన్నారు. బిజెపి అనుసరిస్తున్న 'ఆర్థిక ఉగ్రవాదం' కారణంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇ) మూతపడ్డాయని, యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'కాంగ్రెస్ పార్టీ ఆర్థిక సరళీకరణకు జనని... బిజెపి తన సొంత లాభాల కోసం కేవలం ఆర్థిక ఉగ్రవాదాన్ని అమలు చేస్తోంది. దీని ఫలితంగా ఎంఎస్‌ఎంఇలు, ఇతర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పూర్తిగా మూతపడ్డాయి, అలాగే మన యువత తీవ్రమైన నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్నారు' అని ఖర్గే అన్నారు. భారతీయ మార్కెట్‌పై తమ 'ఏకస్వామ్య పట్టు'ను కాపాడుకోవడానికి కొందరు అపార సంపన్నులు తన 'స్టార్‌లింక్' సేవలను అడ్డుకుంటున్నారని అమెరికా వ్యాపార దిగ్గజం ఎలాన్ మస్క్ ఆరోపించిన నేపథ్యంలో కాంగ్రెస్ అధినేత ఈ వ్యాఖ్యలు చేశారు.

### ఆశ్రిత పెట్టుబడిదారీ విధానగొలుసు తెంచుతాం : రాహుల్

భారతదేశానికి సమాన అవకాశాలున్న వేదిక అవసరమని, ప్రతి వ్యాపారానికీ పోటీపడేందుకు సమాన అవకాశం ఉండాలని, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానపు గొలుసును తెంచడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం అన్నారు. స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవల వివాదం నేపథ్యంలో, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ భారతదేశానికి అసలైన బాస్ అవునా అని అమెరికా వ్యాపార దిగ్గజం ఎలాన్ మస్క్ ప్రశ్నించగా, ఆయనతో ఎక్స్ యాప్‌లో జరిపిన సంభాషణ జరిగిన మరుసటి రోజు రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానపు గొలుసును తెంచి, రాజకీయ అండతో కాకుండా, ఆవిష్కరణలు, కఠోర శ్రమతో నడిచే ఆర్థిక వ్యవస్థను నిర్మించడానికి కాంగ్రెస్ పార్టీ, తాను కట్టుబడి ఉన్నామన్నారు. మస్క్‌తో తన సంభాషణకు సంబంధించిన ఒక వీడియో సంకలనాన్ని కూడా ఆయన పంచుకున్నారు. 'నేను వ్యాపార వ్యతిరేకిని కాదు; నేను ఏకస్వామ్య వ్యతిరేకిని' అని రాహుల్ గాంధీ ఆ వీడియోలో అన్నారు.

# యువతకు మోదీ సర్కార్ వణుకుతోంది

### రైళ్ల రద్దు, భారీ భద్రత మోహరింపుపై విపక్ష, సిజెపి నేతలు మండిపాటు




**న్యూఢిల్లీ :** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చేపట్టనున్న నిరసన ప్రదర్శనకు ముందు ఢిల్లీకి రైళ్లను రద్దు చేయడాన్ని ఇండియా కూటమి పార్టీల నేతలు, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మండిపడ్డారు. భద్రతను కట్టుదిట్టం చేయడంపై మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ విరుచుకుపడింది. యువతకు ప్రభుత్వం భయపడుతోందని తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరెక్ ఓబ్రియన్ ఆరోపించగా, ఈ ఆంక్షలను సిపిఐ(ఎం) సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో జరిగిన అవకతవకల ఆరోపణలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిజెపి, విద్యార్థి సంఘాలు ఈ నిరసనకు పిలుపునిచ్చాయి. రైళ్ల రద్దును విమర్శిస్తూ, 'మీరు యువతకు భయపడితే, దేశం మొత్తాన్ని మూసివేయండి' అని దీప్కే అన్నారు. శుక్రవారం బయలుదేరి శనివారం ఢిల్లీకి చేరుకోవాల్సిన హౌరా–న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్, సీల్దా–న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్‌ల రద్దుపై తూర్పు రైల్వే చేసిన ప్రకటనను ఓబ్రియన్ ఒక ఎక్స్‌పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఇది భారత యువతకు పెద్ద విజయం. ఒక్క బంతి కూడా వేయకముందే, భయంతో వణికిపోతున్న ప్రభుత్వం కంగారు పడుతోంది!' అని ఓబ్రియన్ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. నిరసనలకు ముందు విధించిన ఆంక్షలను, అంటే ఢిల్లీకి రైలు సర్వీసులను రద్దు చేయడం, మెట్రో స్టేషన్లు, ఇంటర్నెట్‌ను నిలిపివేయడాన్ని సవాలు చేస్తూ సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు ఆ వామపక్ష పార్టీ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో తెలిపింది. ఈ కేసులో బేబీ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తున్నారు. ఈ ఆంక్షలను విమర్శిస్తూ, 'భారత ప్రభుత్వం శనివారం ఢిల్లీ బంద్‌కు పిలుపునిచ్చింది. హాస్యాస్పదం!' అని సిజెపి అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ కూడా అన్నారు. ఆందోళనలో చేరడానికి వచ్చే యువత రాకపోకలను అడ్డుకోవడానికి, నిరసనకు ముందుగానే 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ఢిల్లీ పోలీసులు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌ను కోరారు. ఈ రద్దులపై స్పందిస్తూ సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో 'నరేంద్ర మోదీ ఇప్పుడే అత్యవసర పరిస్థితిని అధికారికం చేశారు' అని పోస్ట్ చేశారు. మరో పోస్ట్‌లో ఆయన, 'మెట్రో: షట్ డౌన్, రైల్వేస్: షట్ డౌన్, ఇంటర్నెట్: షట్ డౌన్, 50 అంగుళాల విశ్వగురు మహామానవ్' అని రాశారు. 'తరువాత ఏమిటి? ప్రజలను వారి సొంత ఇళ్లకు చేరుకోవడానికి కూడా ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరిస్తారా?' అని మరో పోస్టులో ప్రశ్నించారు. నిరసనలకు పిలుపు 'మోదీ ప్రభుత్వం తీవ్రంగా కుదిపేయబడింది' అని పేర్కొంది. ప్రతిపాదిత మెట్రో స్టేషన్ల మూసివేత, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు వచ్చే రైళ్ల రద్దు, ఢిల్లీ వ్యాప్తంగా 30,000 మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించడాన్ని ఉటంకిస్తూ, 'మనం అత్యవసర పరిస్థితిని సృష్టించడాన్ని చూస్తున్నామా?' అని ప్రశ్నించింది. తమ పార్టీకి చెందిన సహఇన్‌చార్జ్ దీపక్ బలియాన్‌ను గృహ నిర్బంధంలో ఉంచారని, ఆయన ఇంటి వద్ద సాదా దుస్తుల్లో 40 మందికి పైగా పోలీసు సిబ్బంది ఉన్నారని సిజెపి ఆరోపించింది. బలియాన్ మాటలను ఉటంకిస్తూ, ఆయన కుటుంబం భయపడిందని, తమ భద్రత గురించి ఆందోళన చెందుతోందని, ఆయన కుటుంబానికి ఏదైనా హాని జరిగితే దానికి అల్వార్ పోలీసులే బాధ్యులని పార్టీ పేర్కొంది. భారీగా భద్రతా సిబ్బందిని మోహరించడంపై కాంగ్రెస్ శుక్రవారం మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. నాలుగు రోజుల పాటు భారత కూటమి అవిశ్రాంతంగా సాగిస్తున్న నిరసనల తర్వాత ప్రజలలో నెలకొన్న భయాందోళన, ఆందోళన' స్థాయిని ఇది చూపిస్తోందని పేర్కొంది.

# విజయన్, కుటుంబ సభ్యులపై ఎఫ్ఐఆర్

### కేరళం హైకోర్టు




**తిరువనంతపురం :** సిఎంఆర్‌ఎల్ ముడుపుల కేసులో మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుటుంబ సభ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కేరళం హైకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. అయితే దీనిపై ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసే అవకాశం లేదని ఒక ఉన్నతాధికారి తెలిపారు. విజయన్, ఆయన కుమార్తె వీణ టి, అల్లుడు, మాజీ మంత్రి మహమ్మద్ రియాస్‌లపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నివేదికను అప్పట్లో సమర్థించిన ప్రభుత్వం, ప్రాథమిక విచారణ కోసం ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) కూడా ఏర్పాటు చేసింది. అయితే, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే సిట్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం చట్టవిరుద్ధమని హైకోర్టు శుక్రవారం పేర్కొంది. విచారణ లేకుండానే ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఉంటే, అది అతి తొందరపాటు చర్యగానూ, రాజకీయ కక్షసాధింపుగానూ పరిగణించబడేదని ఆ అధికారి తెలిపారు. అందుకే సిట్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. అయితే, ఇప్పుడు జస్టిస్ ఎ. బద్రుద్దీన్ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించినందున, ప్రభుత్వం ఆ పని చేస్తుంది. అప్పీల్ దాఖలు చేసే ప్రశ్నే లేదు. కోర్టు ఆదేశాలకు కట్టుబడి ఉంటాము అని ఆ అధికారి పిటిఐకి చెప్పారు. ఏజెన్సీ నివేదికలో ప్రత్యేకంగా పేర్కొన్న వ్యక్తులపై, అవినీతి నిరోధక చట్టం కింద వెల్లడైన నేరాలకు సంబంధించి, మనీ లాండరింగ్ నిరోధక చట్టం లోని సెక్షన్ 66(2) కింద Eా అందించిన సమాచారం ఆధారంగా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తిరువనంతపురంలోని విజిలెన్స్ అండ్ యాంటీకరప్షన్ బ్యూరో (విఎసిబి) డైరెక్టర్‌ను కోర్టు నిర్దిష్టంగా ఆదేశించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద జరిపిన దర్యాప్తు, సోదాల సమయంలో సేకరించిన సాక్ష్యాల ఆధారంగా కేసు నమోదు చేయాలని ఇడి కోరింది. ఐటి కన్సల్టెన్సీ సేవల ముసుగులో కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సిఎంఆర్‌ఎల్) సంస్థ, వీణకు చెందిన (ప్రస్తుతం మూతపడిన) ఎక్సలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి రూ. 2.78 కోట్ల మేర అక్రమ చెల్లింపులు జరిపిందని ఆ ఏజెన్సీ ఆరోపించింది.

## జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయానికి

# నరేంద్ర మోదీ పేరు

- ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం



**లక్నో :** తాను ప్రాణాలతో ఉండగానే పలు కార్యాలయాలకు నరేంద్ర మోదీ పేరును పెడుతుండడం విడ్డూరంగా మారింది. ఇప్పటికే ఒక స్టేడియంకు ఆయన పేరు పెట్టగా, తాజాగా ఓ అంతర్జాతీయ విమానాశ్రయానికి మోదీ పేరును పెడుతున్నట్లు ప్రకటించారు. ఉత్తరప్రదేశ్ నోయిడా పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును ఇకపై 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం'గా మారుస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఆ విమానాశ్రయాన్ని ఉత్తర్‌ప్రదేశ్ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన అపురూపమైన కానుకగా ఆయన అభివర్ణించారు. ఆయనపై ఉన్న ఆ కృతజ్ఞతతోనే మంత్రివర్గం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రభుత్వాధినేతగా ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల 25ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న నేపథ్యంలో యుపి కేబినెట్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. శుక్రవారం సిఎం యోగి అధ్యక్షతన లోక్ భవన్‌లో మంత్రివర్గ సమావేశం జరిగింది. అనంతరం కేబినెట్ నిర్ణయాలను ముఖ్యమంత్రి యోగి మీడియాకు వివరించారు. 'ఉత్తర్‌ప్రదేశ్‌కు నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం (జెవార్)ను బహుమతిగా ఇచ్చినందుకు ప్రధానికి మంత్రివర్గం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఇది రాష్ట్రంలోనే అతిపెద్ద విమానాశ్రయం. అంతేకాకుండా భవిష్యత్తులో దేశంలోనే అతిపెద్ద విమానయాన కేంద్రంగా మారనుంది. ఈ నేపథ్యంలో ఈ ఎయిర్‌పోర్టుకు 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం నోయిడా (జెవార్)' అని నామకరణం చేయాలనే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది' అని యోగి పేర్కొన్నారు. ఇక అత్యాధునిక హంగులతో నిర్మితమవుతున్న ఈ విమానాశ్రయం రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే అతి పెద్ద విమానయాన కేంద్రంగా అవతరించనుందని యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారి, రాష్ట్ర ఆర్థిక రూపురేఖలను పూర్తిగా మార్చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**మార్చిలో ప్రారంభం– జూన్‌లో తొలి విమానం ల్యాండ్**

కాగా, ఎయిర్‌పోర్టును యమునా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్‌తో కలిసి అభివృద్ధి చేసింది. యమునా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ స్విస్ సంస్థ జూరిచ్ ఎయిర్‌పోర్ట్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థగా ఉంది. ఆ విమానాశ్రయంలో భారీ విమానాల రాకపోకలకు సరిపడే 3,900 మీటర్ల రన్‌వేతో ఉంది. అంతేకాకుండా ఇక్కడ ఆధునిక నావిగేషన్ వ్యవస్థలు కూడా ఉన్నాయి. రూ. 11,282 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఎయిర్‌పోర్టును ఇదే ఏడాది మార్చి 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. ఆ తర్వాత జూన్ 15న లఖ్‌నవూ నుంచి వచ్చిన ఇండిగో విమానం తొలిసారి ల్యాండ్ అయ్యింది.

# ట్రక్కు, పికప్ ట్రక్కు ఢీ

- ఏడుగురు కార్మికులు మృత్యువాత, 20 మందికిపైగా గాయాలు
- గుజరాత్‌లోని కచ్ జిల్లాలో ఘటన



**భుజ్ :** గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. కచ్ జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఒక ట్రక్కు, పికప్ ట్రక్కును ఎదురెదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుగురు కార్మికులు మృత్యువాతపడగా, 20 మందికి పైగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఖవడా సమీపంలోని రెన్యూవబుల్ ఎనర్జీ పార్క్ లోపల తెల్లవారుజామున 3 నుండి 4 గంటల మధ్య ఈ ప్రమాదం జరిగిందని వారు చెప్పారు. ఎదురెదురుగా ప్రయాణిస్తున్న ఒక ట్రక్కు, ఒక బొలెరో క్యాంపర్ (పికప్ ట్రక్కు) ఢీకొన్నాయి. ఈ ధాటికి పికప్ ట్రక్కు నుజ్జునుజ్జు అయింది అని ఖవడా పోలీస్ స్టేషన్‌కు చెందిన సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం.బి. చావడా తెలిపారు. ప్రమాద బాధితులందరూ పికప్ ట్రక్కులో ఉన్నవారేనని ఆ అధికారి చెప్పారు. 'ధ్వంసమైన బొలెరో క్యాంపర్‌లో ఏడుగురు కార్మికులు చిక్కుకుపోయారు. వారిని క్రేన్ సహాయంతో బయటకు తీశారు. వారందరూ మరణించగా, గాయపడిన 20 మందికి పైగా కార్మికులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు' అని ఆయన తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించామని, ఈ భారీ స్వచ్ఛ ఇంధన కేంద్రంలో జరిగిన ఈ విషాదానికి కారణమైన నిర్లక్ష్యంపై పోలీసులు విచారణ జరుపుతున్నారని ఆయన తెలిపారు.

## యుద్ధ స్వరూపంలో మార్పులను...

# ముందుగా ఊహించే వారికే విజయం

### ఐఎఎఫ్ చీఫ్ ఏపి.సింగ్ ఉద్బోధ



**న్యూఢిల్లీ :** యుద్ధ స్వరూపంలో వచ్చే మార్పులను ముందుగానే ఊహించి, అందుకు అనుగుణంగా తమను తాము మలచుకునే వారినే విజయం వరిస్తుందని భారత వైమానిక దళం (ఐఎఎఫ్) చీఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపి. సింగ్ అన్నారు. ఆయన శుక్రవారం ఇక్కడ 'మారుతున్న యుద్ధ రంగంలో వాయు శక్తి కేంద్ర పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ప్రసంగించారు. ప్రపంచంలో కొనసాగుతున్న రెండు ప్రధాన సంఘర్షణలు, గత సంవత్సరం ఆపరేషన్ సిందూర్ సమయంలో భారతదేశానికి ఎదురైన అనుభవం, వాయుశక్తి ప్రాధాన్యతను నొక్కిచెప్పాయని పునరుద్ఘాటించారు. ఇక్కడ సుబ్రతోపార్క్‌లో ఒక రక్షణరంగ మేథోమథన సంస్థ నిర్వహించిన సమావేశం, రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ వైమానిక దళ కేంద్రంలో ప్రస్తుతం జరుగుతున్న 'తరంగ్ శక్తి' భారీ బహుపాక్షిక వైమానిక విన్యాసాల సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన ఒక సమాంతర కార్యక్రమం ఇది. భారత వైమానిక దళం ఆతిథ్యం ఇస్తున్న ఈ విన్యాసాల రెండవ ఎడిషన్‌లో అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా సహా ఏడు విదేశాలు తమ వాయు ఆస్తులతో పాల్గొంటున్నాయి. అమెరికాకు చెందిన బహుళ ప్రయోజన స్టెల్త్ ఫైటర్ జెట్ ఎఫ్–35 ఈ విన్యాసాలలో తొలిసారిగా పాల్గొంటోంది. ఎయిర్‌ఫోర్స్ ఆడిటోరియంలో జరిగిన సెమినార్‌లో ప్రసంగించిన ఐఎఎఫ్ చీఫ్ ఏపి.సింగ్ మాట్లాడుతూ యుద్ధ స్వరూపంలో మార్పులను ముందుగానే ఊహించే వారికి విజయం వరిస్తుందని ఉద్బోధించారు. వేగంగాఅభివృద్ధి చెందుతున్న సాంకేతిక యుగం, మారుతున్న యుద్ధ స్వభావం ఉన్న ఈ కాలంలో, మార్పులను ముందుగా ఊహించకుండా, అవి జరిగిన తర్వాత వాటికి అనుగుణంగా మారితే, అప్పటికే చాలా ఆలస్యం అవుతుందేమో అని సింగ్ అన్నారు. గురువారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌బేస్‌లో జరిగిన ఒక ఘనంగా జరిగిన ఒక వేడుక ద్వారా ఎయిర్ చీఫ్ మార్షల్ సింగ్ ఐఎఎఫ్ 94వ వార్షికోత్సవ వేడుకలకు నేతృత్వం వహించారు. అంతకుముందు, వైమానిక దళ దినోత్సవంలో ఆయన తన ప్రసంగంలో, ప్రపంచంలోని పలు ప్రాంతాలలో జరిగిన సంఘర్షణలు జాతీయ ప్రయోజనాలను పరిరక్షించడానికి వాయుశక్తియే ప్రధానసాధనమని నిరూపించాయని తెలిపారు. గత ఏడాది జరిగిన ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడుతూ, ఐఎఎఫ్ తన పోరాట కార్యకలాపాల వేగాన్ని ప్రదర్శించిందని ఎయిర్ చీఫ్ మార్షల్ సింగ్ పేర్కొన్నారు. 1932లో స్థాపించబడినప్పటి నుండి, ఐఎఎఫ్ ఒక అసాధారణమైన, సమర్థవంతమైన నెట్‌వర్క్, కేంద్రీకృత, బహుళ రంగ దళంగా అభివృద్ధి చెంది, ప్రపంచంలోనే అత్యుత్తమైన వాటిలో ఒకటిగా నిలిచిందని సింగ్ నొక్కిచెప్పారు.

## ఐటి సంస్థలకు అమెరికా'గ్రీన్ కార్డు సస్పెన్షన్'ను...

# తీవ్రంగా ఖండించిన భారత్

### విదేశీనిపుణులను జెడి.వాన్స్ 'బానిసలు'గా వ్యాఖ్యానించడంపై ఆక్షేపణ




**న్యూఢిల్లీ :** టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో వంటి ప్రధాన అంతర్జాతీయ, భారతీయ ఐటి సంస్థలకు చెందిన కీలక గ్రీన్ కార్డు ప్రాసెసింగ్ కార్యక్రమంపై ఆంక్షలు విధించాలన్న అమెరికా నిర్ణయాన్ని భారత్ శుక్రవారం విమర్శించింది.ఈ చర్య ఇరు దేశాల ఉమ్మడి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో విఫలం అవుతున్నదని పేర్కొంది.అలాగే, విదేశీ నిపుణులను అమెరికా వైస్ ప్రెసిడెంట్ జెడి.వాన్స్ 'బానిసలు'గా అభివర్ణించడాన్ని పూర్తిగా 'అనవసరమైనది', 'తీవ్ర అభ్యంతరకరమైనది' అని కొట్టిపారేసింది.అమెరికాలో విదేశీ కార్మికులను తగ్గించే విస్తృత ప్రయత్నాలలో భాగం, భారత్–అమెరికా సంబంధాలలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం 8 ప్రధాన ఐటి సంస్థలకు పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ (పిఇఆర్‌ఎం) కార్యక్రమాన్ని నిలిపివేసి, పలు విశ్వవిద్యాలయాలపై విచారణలను ప్రారంభించింది.ఈ చర్యలను ఎదుర్కొంటున్న కంపెనీలు ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో, హెసిఎల్ టెక్నాలజీస్, మైక్రో సాఫ్ట్, అడోబ్, క్యాప్‌జెమిని, కాగ్నిజెంట్ ఉన్నాయి.పిఇఆర్‌ఎం అనేది యుఎస్‌లో శాశ్వత నివాసం, పౌరసత్వం పొందడానికి ఒక మార్గంగా, విస్తృతంగా పరిగణించబడుతుంది. హెచ్1బి వీసాలపై అమెరికాలోకి ప్రవేశించి, శాశ్వత నివాసం కోసం యజమాని–ప్రాయోజిత గ్రీన్‌కార్డులపై ఆధారపడి వేలాదిమంది భారతీయ టెక్నాలజీ నిపుణులను ఈ అమెరికా నిర్ణయం ప్రభావితం చేస్తుందని భావిస్తున్నారు. దీనిపై స్పందిస్తూ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) అమెరికా చర్యను విమర్శిస్తూనే, పిఇఆర్‌ఎం అనేది హెచ్1బి వీసా కార్యక్రమానికి భిన్నమైనది అని పేర్కొంది. పిఇఆర్‌ఎం దరఖాస్తులను నిలిపివేయడం అనేది, దానికదే, ఇప్పటికే ఉన్న హెచ్1బి వీసాల చెల్లుబాటును లేదా హెచ్1బి వీసా హోల్డర్లు వారిపై ఆధారపడిన వారి హోదాను ప్రభావితం చేయదని, అయితే, ప్రభావిత కంపెనీల అర్హులైన ఉద్యోగుల శాశ్వత నివాసం, గ్రీన్ కార్డు ప్రక్రియపై కొంత ప్రభావం ఉండవచ్చని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది.ప్రతిభావంతుల బదిలీ రెండు ఆర్థిక వ్యవస్థలకు విలువను చేకూరుస్తుందనే విషయంపై కూడా స్పష్టత ఉండాలి. ఇది భారతీయులకు అవకాశాలను కల్పిస్తున్నప్పటికీ,అమెరికాకు కూడా అంతే స్థాయిలో సహాయపడుతుంది.'అమెరికాలో అత్యాధునిక ప్రతిభ, ఆవిష్కరణ, పరిశోధన, ఉత్పాదకత, పోటీతత్వం, ఉద్యోగ కల్పనతోపాటు వాటాదారుల సంపదను సృష్టించే కంపెనీలు' అని ఎంఇఎ పేర్కొంది. అమెరికాలో పనిచేస్తున్న విదేశీ నిపుణులపై జెడి.వాన్స్ 'బానిసలు' అంటూ చేసిన వ్యాఖ్యలను న్యూఢిల్లీ కూడా తీవ్రంగా వ్యతిరేకించింది. 'బాధాకరమైన, చారిత్రక, వలసవాద, వారసత్వ భావనలను మోసుకొచ్చే పదజాలాన్ని ఉపయోగించడం తీవ్ర అభ్యంతరకరమైనది' అని ఎంఇఎ జోడించింది. కొత్త చర్యలను ప్రకటిస్తూ, అమెరికా కార్మిక శాఖ కార్యదర్శి కీత్ సోండర్లింగ్ గురువారం మాట్లాడుతూ, 'ఈ కంపెనీలకు సంబంధించిన ఏ కొత్త శాశ్వత కార్మిక ధృవీకరణ దరఖాస్తులను మేం స్వీకరించం , లేదా పెండింగ్‌లో ఉన్న వాటిని మేం ప్రాసెస్ చేయం' అని ఆయన అన్నారు. విదేశాల నుంచి ఒప్పంద కార్మికులను తీసుకొచ్చి, అమెరికన కార్మికులను తొలగించి, మీరు ఒక కార్పొరేషన్ అయితే, అమెరికన్ కార్మికుల వేతనాలను తగ్గించి,అసలు అమెరికాలో ఉండటానికి కూడా అర్హతలేని వారిని వారి స్థానంలో నియమించడం ద్వారా మీరు టన్నుల కొద్దీ డబ్బు సంపాదిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## జిఎస్‌టి ఎగవేతకు శిక్షను...

# 'జైలుశిక్ష లేదా జరిమానా' లేదా 'రెండూ విధింపు'గా మార్పు

**న్యూఢిల్లీ :** కేంద్ర, రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన జిఎస్‌టి మండలి, జిఎస్‌టి ఉల్లంఘనలకు విధించే గరిష్ఠ జైలు శిక్షను 5 సంవత్సరాల వరకు, జరిమానా లేదా రెండూ ఉండేలా హేతుబద్ధీకరించింది. అలాగే, శిక్షను 'జైలు శిక్ష, జరిమానా' నుంచి 'జైలుశిక్ష లేదా జరిమానా లేదా రెండూ' గా మార్చింది. పన్ను ఎగవేత మొత్తం రూ.10కోట్లు దాటిన కేసులలో గరిష్ఠ జైలుశిక్షను 5 ఏళ్ల వరకు, లేదా జరిమానా, లేదా రెండూ విధించేలా హేతుబద్ధీకరించారు. 57వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో జిఎస్‌టి ఎగవేత రూ.5కోట్లు దాటి, రూ.10కోట్లకు మించని సందర్భంలో, రెండు సంవత్సరాల వరకు జైలుశిక్ష లేదా జరిమానా, లేదా రెండు విధించడానికి ఆమోదం లభించింది. ఒక 'ఎఫ్ఏక్యూ'లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సిబిఐసి) ఎవరైనా దోషిగా తేలితే, జైలుశిక్ష తప్పనిసరి కాదని పేర్కొంది. 'శిక్షను 'జైలు శిక్ష, జరిమానా నుంచి జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ'గా మార్చాలని ప్రతిపాదించబడింది. తద్వారా, శిక్ష విధించడంలో కోర్టుకు విచక్షణాధికారం ఉంటుంది' అని సిబిఐసి తెలిపింది. కోర్టుకు విచక్షణాధికారం కల్పించడానికి సెక్షన్ 132(3) కింద కనీసం 6నెలల జైలుశిక్ష అనే నిబంధనను తొలగించారు. గురువారం కౌన్సిల్ ఆమోదించిన ప్రతిపాదనలు ఏప్రిల్ 1, 2027 నుంచి అమలులోకి వస్తాయి. ఒక కీలకమైన నేరరహితీకరణ చర్యలో భాగంగా, జిఎస్‌టి కౌన్సిల్ జిఎస్‌టి కింద అరెస్ట్ నిబంధనలను తొలగించాలని నిర్ణయించింది. ఇకపై ఈ చట్టం కింద ఏ నేరానికైనా ఏ వ్యక్తిని కూడా జిఎస్‌టి అధికారి అరెస్ట్ చేయరు. అయితే, ఇందులో ఉన్న మొత్తం రూ.5 కోట్లకు మించినట్లయితే, పన్ను అధికారులు దాఖలు చేసిన ఫిర్యాదుపై సమర్థ న్యాయస్థానంలో విచారణ ప్రారంభించవచ్చు. జిఎస్‌టి ఎగవేత కేసుల్లో విచారణ ప్రారంభించేందుకు ఉన్న పరిమితిని కౌన్సిల్ ప్రస్తుతం ఉన్న రూ.1 కోటి నుంచి రూ.5కోట్లకు పెంచింది.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS30-0173 | BHAGYAMMA NAGULA | ZEST 1.3L XMS QUADRAJET 75PS DIESEL 5 SEATER | 2016 |
| 2 | AP29W-3003 | NARSIMHARADDY YERRAM | FORCE TEMPO TRAVELLER-P | 2014 |
| 3 | TS01EF-4440 | RAJU GOLLENA | JCB 3DX | 2016 |
| 4 | TS02FJ-5095 | RAJENDRA PRASAD KOUDAGANI | VERITO BS4 1.5 D4 DIESEL 5 SEATER | 2015 |
| 5 | TS24E-1635 | RAJU MOUTAM | MAHINDRA 475 DI | 2020 |
| 6 | TS25F-9693 | THIAGALA BALAKRISHNA | MAHINDRA 585 DI | 2022 |
| 7 | TS30D-8401 | RASAMALLA ASHOK | SONALIKA DI 740 | 2018 |
| 8 | TS02ER-5491 | GURRAPU SWATHI | CAT 424 B | 2016 |
| 9 | TG258308 | BHUKYA KIRAN | SWARAJ 843 XM | 2025 |

**AUCTION DATE : 10-10-2026**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**
H.No :4-316,4-317,4-318,Ground Floor,
Opp : Fire Station, Parkal, Warangl Rural
Cell : 9666726222, 9951242872



**డాక్యుమెంట్స్ పోయినవి**

నేను, **చేపూరి మంజుల, భర్త: సత్తిరెడ్డి,** నివాసం: 1-1-47/3, రోడ్ నెంబర్ : 8/1, చైతన్యపురి కాలనీ, ఎన్ఐటీ వరంగల్ సమీపంలో ఉన్నాను. నా ఆస్తికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ **(Document No. 2731/1999)** పోయినది. ఈ డాక్యుమెంట్ నేను ప్రయాణ సమయంలో పోగొట్టుకున్నాను. చాలా ప్రయత్నాలు చేసినప్పటికీ ఇప్పటివరకు దొరకలేదు. ఈ లింక్ డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినట్లయితే లేదా దాని గురించి ఏదైనా సమాచారం తెలిసినట్లయితే, దయచేసి నన్ను వెంటనే సంప్రధించగలరు. ఈ డాక్యుమెంట్ దొరికితే నాకు తెలియజేయడం ద్వారా నాకు ఎంతో సహాయం చేసినవారు అవుతారు. అలాగే దానిని దుర్వినియోగం చేయకుండా కాపాడగలరు.

సం/-
**చేపూరి మంజుల**
స్థలం : వరంగల్
మొబైల్ నంబర్ : **7989166094**
తేదీ : **09-10-2026**

## నెల రోజుల్లో పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసిందని తెలిపారు. 22ఎ సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు ఏడు కీలక ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన 24 గంటల్లోనే ఈ అంశంపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, 22ఎకు సంబంధించిన 10 నుంచి 12 ప్రధాన సమస్యలను ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కరిస్తున్నామన్నారు. జి.ఓ 118, జి.ఓ76లకు అనుగుణంగా స్పష్టమైన మార్గదర్శకాలతో మెమోలు జారీ చేశామన్నారు. 22ఎ జాబితాలో ఉన్నప్పటికీ జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఎ, డిటిసిపి లేదా మున్సిపల్ సంస్థల అనుమతులు పొందిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్‌లకు అనుమతి కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. అలాగే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల రిజిస్ట్రేషన్‌లకు కూడా ప్రభుత్వం త్వరలో పరిష్కారం చూపుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

**భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమగ్ర రీసర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేసేలా పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సర్వే పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన అధికారులతో భూ సర్వే పురోగతిపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సర్వే ప్రక్రియలో వేగం, నాణ్యతతో పాటు ప్రతి దశలో నిరంతర పర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సుమారు 125 ఏళ్ల తర్వాత చేపడుతున్న ఈ సమగ్ర భూ సర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అధికారులు అత్యంత బాధ్యతతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించేందుకు 7 జోన్‌లకు ఒక్కో జోన్‌కు రెవెన్యూ, సర్వే విభాగాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 14 మంది అధికారులను నియమించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం తొలి దశలో 365 నక్షాలేని గ్రామాలు, అలాగే జిల్లాకు 70 గ్రామాల చొప్పున 2,240, మొత్తం 2,768 గ్రామాల్లో రీసర్వే ముమ్మరంగా సాగుతోందన్నారు. ఇప్పటివరకు 245 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మొదటి దశ సర్వేను నవంబర్ చివరినాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నామన్నారు. ప్రతి మండలంలో కనీసం రెండు రెవెన్యూ గ్రామాల్లో సర్వే తప్పనిసరిగా చేపడుతున్నామని, ఇందుకోసం ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాల్లో లైసెన్స్ సర్వేయర్, జిపిఓ, డిప్యూటీ తహసీల్దార్ లేదా ఆర్‌ఐ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌ల ఉంటారన్నారు. సర్వే జరుగుతున్న ప్రాంతాల్లో ప్రతిరోజు తహసీల్దార్ స్వయంగా పర్యటించాలని, రోజువారీ పురోగతిపై స్పష్టమైన సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. రీ సర్వే పేరుతో స్థానికంగా ఎవరైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే సహించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

**ఎర్రవల్లి అసైన్డ్ భూములపై చర్యలు..**

సమీక్ష అనంతరం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రి పొంగులేటి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఎర్రవల్లిలో 385 ఎకరాలలో 45 ఎకరాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించామని, సర్వే కోసం మరోసారి నోటీసులు జారీ చేశామని తెలిపారు. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములు చేతులు మారినట్లు తేలితే వాటిని స్వాధీనం చేసుకుని, పేదలకు పంచుతామని స్పష్టం చేశారు. అలాగే తెలంగాణ ఉద్యమ అమరులను గుర్తించి వారికి తగిన న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## ‘గ్రీన్‌కార్డ్ ప్రోగ్రామ్’ నుంచి

# మైక్రోసాఫ్ట్‌సహా పలు కంపెనీలు అవుట్

### ‘సస్పెన్షన్’ వేటు విధించిన అమెరికా ప్రభుత్వం

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం, గ్రీన్‌కార్డుల కోసం విదేశీ ఉద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు వీలుకల్పించే కార్యక్రమం నుంచి మైక్రోసాఫ్ట్, మరికొన్ని ఇతర సంస్థలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో మోసాలు, దుర్వినియోగం జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలిపారు. అయితే, ఇవి ప్రభుత్వ ఆరోపణలు మాత్రమే కావడం గమనార్హం. తప్పులు జరిగినట్టుగానీ, తుది నిర్ధారణ తీసుకున్నట్టుగానీ ఎలాంటి ధ్రువీకరణ వెలువడలేదు. అమెరికన్ ఉద్యోగులకు బదులుగా విదేశీ కార్మికులను నియమించుకుంటున్నారని మైక్రోసాఫ్ట్‌పై వాన్స్ ఆరోపణలు గుప్పించారు. గత ఏడాది సంస్థ 6,000 మంది అమెరికన్ ఉద్యోగులను తొలగించిందని, అదే సమయంలో 6,300 హెచ్1బి వీసాలు, దాదాపు 3,000 గ్రీన్కార్డులు పొందిందని ఆయన పేర్కొన్నారు. అయితే, మైక్రోసాఫ్ట్ ఈ ఆరోపణలను పరోక్షంగా ఖండించింది. గత ఆర్థిక సంవత్సరంలో తాము దాఖలు చేసిన సుమారు 6,000 హెచ్1బి వీసా దరఖాస్తుల్లో 80 శాతం ఇప్పటికే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల వీసా స్థితి పొడిగింపు లేదా మార్పు కోసమేనని ప్రకటించింది. కొత్త ఉద్యోగుల కోసం చేసిన దరఖాస్తులు అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తున్న వ్యక్తులకు సంబంధించినవేనని, అవి తమ అమెరికా ఉద్యోగుల సంఖ్యలో కేవలం ఒక శాతమేనని వివరించింది. కాగా, మైక్రోసాఫ్ట్‌తో పాటు అడోబ్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, హెచ్‌సిఎల్, క్యాప్‌జెమినీ సంస్థలపైనా ఇదే తరహా చర్యలు తీసుకుంటున్నట్లు వాన్స్ ప్రకటించారు.

అంతర్జాతీయ విద్యార్థుల విషయంలోనూ ట్రంప్ ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబిస్తోంది. అమెరికాలో చదువుతో సంబంధమున్న ఉద్యోగాలు చేసేందుకు వీలు కల్పించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఒపిటి) కార్యక్రమంలో పాల్గొనే ప్రతి విద్యార్థికి సంబంధించి విద్యాసంస్థలు 70,000 డాలర్ల రుసుము చెల్లించాలనే ప్రతిపాదనను తీసుకొచ్చింది. అలాగే, జె1 వీసాల దుర్వినియోగంపై తొమ్మిది అమెరికా విశ్వవిద్యాలయాలపై విచారణ అవసరమని వాన్స్ పేర్కొన్నారు. వాటిలో హార్వర్డ్, యేల్, స్టాన్‌ఫర్ట్, ఎంఐటి తదితర ప్రముఖ విశ్వవిద్యాలయాలు కూడా ఉన్నాయి. ఈ పరిణామాలు హెచ్1బి వీసాలు, గ్రీన్‌కార్డులు, అంతర్జాతీయ విద్యార్థులపై అమెరికా ప్రభుత్వం తన వలస విధానాలను మరింత కఠినతరం చేస్తున్నదనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులు, అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులపై ఈ నిర్ణయాల ప్రభావం ఎలా ఉంటుందనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. అయితే, కొన్ని చర్యలు ఇంకా ప్రతిపాదనల దశలోనే ఉన్నందున వాటి తుది అమలు, చట్టపరమైన పరిణామాలను గమనించాల్సిన అవసరం ఉంది.

# మదురోపై కొత్త అభియోగాలు



**న్యూయార్క్ :** వెనిజులా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌పై అమెరికా న్యాయవాదులు కొత్త క్రిమినల్ అభియోగాలు నమోదు చేశారు. ప్రభుత్వ ప్రాయోజిత అణచివేత వ్యవస్థ ద్వారా పలువురిని కొట్టడం, విద్యుత్ షాక్‌లు ఇవ్వడం, ఊపిరాడకుండా చేయడం వంటి చిత్రహింసలకు పాల్పడ్డారని ఆరోపించారు. బాధితుల్లో అమెరికా పౌరులు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. 2013 నుంచి అధికారంలో ఉన్న మదురో, తనకు వ్యతిరేకంగా ఉన్నవారిని అణచివేసేందుకు సైనిక నిఘా సంస్థను ఉపయోగించుకున్నారని ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఖైదీలపై హింసకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడం, బలవంతపు ఒప్పుకోలు వీడియోలను చూడడం వంటి చర్యలకు పాల్పడినట్టు ఆయనపై సమర్పించిన అభియోగపత్రంలో పేర్కొన్నారు. ఫ్లోరెస్ కూడా ఈ వ్యవస్థ రూపకల్పనలో భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు. అయితే, మదురో ఈ ఆరోపణలను ఖండించారు. అమెరికాలో ఎదుర్కొంటున్న మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులోనూ తమ ప్రమేయం లేదని, తాము నిర్దోషులమని ఆయన ఇది వరకే ప్రకటించారు. మదురో, ఆయన భార్యను ఈ ఏడాది జనవరిలో కారకాస్‌లోని వారి నివాసం నుంచి అమెరికా సైన్యం అదుపులోకి తీసుకుంది. మరోవైపు, వెనిజులా మాజీ సైనిక నిఘా అధిపతి హ్యూగో కార్వజాల్ అమెరికా విచారణకు సహకరిస్తున్నట్లు సమాచారం. కాగా, ఫ్లోరెస్ ఆరోగ్య కారణాలతో గృహ నిర్బంధం నుంచి విడుదల చేయాలని చేసిన విజ్ఞప్తిని అమెరికా న్యాయస్థానం తిరస్కరించింది.

## ఒకవైపు ఆంక్షలు.. మరోవైపు పురస్కారం

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్లకు జాతీయ సాంకేతికత, ఆవిష్కరణ పతకాన్ని ప్రదానం చేశారు. అయితే, హెచ్1బి వీసాదారులు గ్రీన్‌కార్డులు పొందేందుకు అధికారికంగా ఉన్న కార్యక్రమం నుంచి మైక్రోసాఫ్ట్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే సత్య నాదెళ్లకు ట్రంప్ పురస్కారాన్ని అందించేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సత్య నాదెళ్ల నాయకత్వంలో మైక్రోసాఫ్ట్ ప్రపంచవ్యాప్తంగా వ్యాపారాలు, విద్యార్థులు, వినియోగదారులకు సాంకేతిక సేవలను అందించిందని ట్రంప్ ప్రశంసించారు. ఎలాన్ మస్క్, గూగుల్ సహ వ్యవస్థాపకుడు సెర్గీ బ్రిన్, ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్, ఎఎండి సిఇఒ లిసా సు సహా పలువురు ప్రముఖులకు కూడా శాస్త్ర, సాంకేతిక రంగాల పురస్కారాలను ట్రంప్ అందించారు. వీరిలో పలువురు విదేశాల్లో జన్మించిన వలసదారులు కావడం గమనార్హం. విదేశీ నిపుణుల నియామకాలపై ఆంక్షలు విధించే ప్రభుత్వ విధానానికి, అమెరికా సాంకేతిక రంగ అభివృద్ధిలో వలసదారులు అందిస్తున్న సహకారానికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఈ పరిణామం ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులపై ఈ విధానాల ప్రభావం ప్రాధాన్యం సంతరించుకుంది.

## వాణిజ్య అసమతుల్యతపై... చైనా–ఇయు చర్చలు

**బీజింగ్ :** చైనా, యూరోపియన్ యూనియన్ (ఇయు ) మధ్య పెరుగుతున్న వాణి జ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇరు పక్షాల ఉన్నతాధికారులు రెండు రోజుల పాటు చర్చలు జరిపారు. చైనా నుంచి అధికంగా దిగుమతులు జరుగుతుండటంతో ఏర్పడుతున్న వాణిజ్య అసమతుల్యతను సరిచేయడమే ఈ చర్చల ప్రధాన లక్ష్యంగా చెప్పున్నారు. ఇయు వాణిజ్య విభాగం అధిపతి మారోస్ సెఫ్కోవిచ్ బీజింగ్‌లో జరిగిన చర్చల్లో స్పష్టమైన ఫలితాలు రావాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.



మరోవైపు, తన అధునాతన చిప్ తయారీ యంత్రాల దిగుమతులపై ఇయు విధించిన ఆంక్షలను తొలగించాలని చైనా కోరుతోంది. చైనా ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, ఉక్కు దిగుమతులపై ఇయు ఆంక్షలు విధించడంతో ఇరు వర్గాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగాయి. దీనికి ప్రతిగా, ఇయు నుంచి దిగుమతి చేసుకునే పినైట్రోటొల్యూన్ అనే రసాయనంపై చైనా డంపింగ్ నిరోధక విచారణ ప్రారంభించింది. 2025లో చైనా ప్రపంచ వాణిజ్య మిగులు 1.2 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఇయు గణాంకాల ప్రకారం, ఏప్రిల్–జులై కాలంలో చైనాతో ఇయు వాణిజ్య లోటు 103.34 బిలియన్ యూరోలకు పెరిగింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ చైనాపై సుంకాలు పెంచడం కూడా ప్రపంచ వాణిజ్య పరిణామాలపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో, చైనాఈయూ చర్చల ఫలితాలు అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలకు కీలకంగా మారాయి.

## ముందే ‘ఆంక్షలా’ ?

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లడానికి అనుమతించాలని వామపక్షపార్టీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆదేశాల మేరకు విధించిన ఆంక్షల లక్ష్యం జనసమీకరణను నిరోధించడం, అరికట్టడమేనని వామపక్ష పార్టీలు ఆరోపించాయి. ‘ప్రదర్శనకు అనుమతిని నిరాకరించడం, విస్తృతమైన బారికేడింగ్, నిషేధాజ్ఞలు, 57 మెట్రో స్టేషన్ల మూసివేత, ఢిల్లీకి వెళ్లే రైళ్ల రద్దు, దేశంలోని వివిధ ప్రాంతాలలో గృహ నిర్బంధం వంటి ఆరోపణలను వామపక్షపార్టీల నేతలు ఉదహరించారు. వివిధ ప్రదేశాలలో విద్యార్థులను నిర్బంధంలోఉంచుతున్నట్లు వార్తలు అందుతున్నాయి. విద్యార్థి సంఘాల కార్యాలయాలు కూడా నిఘాలో ఉన్నాయని సమాచారం ఉంది’ అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆంక్షల మూలంగా సాధారణ ప్రజలు కూడా ఇబ్బందులను గురవుతున్నారని, వేధింపులకు లోనవుతున్నారని వామపక్ష పార్టీలు తెలిపాయి.‘ఢిల్లీ పోలీసులు కేంద్ర ప్రభుత్వం నిరసనలో పాల్గొనబోయే వారిని బెదిరించడం, వేధించడం ఆపాలని, ప్రజలను ఏకపక్షంగా నిర్బంధించడం మానుకోవాలని మేం డిమాండ్ చేస్తున్నాం’ అని వారు హెచ్చరించారు. అడ్డంకులను తొలగించి, జంతర్ మంతర్ వద్ద ప్రజలను నిరసనలు తెలిపేందుకు అనుమతించాలని అధికారులను కోరారు. ఈ ప్రకటనపై సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.బేబీ, సిపిఐ (ఎంఎల్)–లిబరేషన్ ప్రధానకార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఎఐఎఫ్‌బి ప్రధానకార్యదర్శి జి.దేవరాజన్, ఆర్‌ఎస్‌పి ప్రధానకార్యదర్శి మనోజ్ భట్టాచార్య సంతకాలు చేశారు.

## ప్రజాస్వామ్యం ధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

ఆ మెమోరాండంలో ఆరోపించారు. రాష్ట్రపతిని కలిసిన ప్రతినిధుల బృందంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఎన్‌సిపి(ఎస్‌పి)కి చెందిన సుప్రియా సూలే, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, ఆర్‌జెడికి చెందిన మనోజ్ ఝా, విసికె అధినేత తోల్. తిరుమావళవన్, ఐయుఎంఎల్‌కు చెందిన ఇ.టి. మహమ్మద్ బషీర్ ఉన్నారు. సమావేశం అనంతరం మీడియా సమావేశంలో మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ఓట్ల చోరీకి సంబంధించిన ఆధారాలను సమర్పించాలని రాష్ట్రపతి కోరారని, వాటిని సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ‘మేము రాష్ట్రపతికి ఓట్ల చోరీ గురించి, జ్ఞానేష్ కుమార్ చేసిన తీవ్రమైన తప్పిదం గురించి వివరించాము; ఎందుకంటే ఆయన కార్యాలయం నుండే ఓట్లు దొంగిలించబడుతున్నాయి. అందుకే ఇవిఎంల వినియోగాన్ని రద్దు చేసి, తిరిగి బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశాము. ఓట్ల చోరీ ఎక్కడైతే జరిగిందో దానికి సంబంధించిన ఆధారాలను అడిగారు, ఆ ఆధారాలను సిద్ధం చేసి సమర్పిస్తాము. రాష్ట్రపతి మా మాటలను శ్రద్ధగా విన్నారు. ఈ విషయంపై సమగ్రంగా విచారణ జరిపి, సంబంధిత వ్యక్తులతో మాట్లాడి, తదుపరి తగిన చర్యలపై నిర్ణయం తీసుకుంటానని ఆమె చెప్పారు. ఆమె మా గొంతుకతో గొంతుక కలిపి, ప్రజల వాణిని ఆలకించడం ఇదే మొదటిసారి కాబట్టి, మేము సంతృప్తితో తిరిగి వచ్చాము’



అని ఖర్గే పేర్కొన్నారు. మరోవైపు, సమావేశం తర్వాత కూడా ‘ఇండియా’ కూటమి ఐక్యంగానే ఉందని మమతా బెనర్జీ అన్నారు. ‘మేమంతా కలిసి ఉన్నాము, చాలా బలంగా ఉన్నాము, 60 శాతానికి పైగా ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాము అని ఆమె చెప్పారు. భారత ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కుట్ర పన్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రతిపక్షాల ఆరోపణలను రాష్ట్రపతి ఖండించలేదని లేదా వాటిని ప్రశ్నించలేదని, పైగా ఎన్నికల చోరీకి సంబంధించిన ఆధారాలను సమర్పించాలని బృందాన్ని కోరారని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ భారత ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడానికి కుట్ర పన్నారని స్పష్టంగా పేర్కొన్నామన్నారు. అయితే రాష్ట్రపతి తాము చెప్పినదాన్ని ఖండించలేదు, మా ప్రకటనలను ప్రశ్నించలేదు లేదా వాటికి వ్యతిరేకంగా ఏ విధంగానూ మాట్లాడలేదన్నారు. ఆమె తమ ప్రకటనలను అంగీకరించి, ఆ తర్వాత ఎన్నికల దొంగతనానికి సంబంధించిన రుజువులను తనకు అందించాలని చెప్పారన్నారు. ఎన్నికల దొంగతనానికి సంబంధించిన సాక్ష్యాలు యావత్ దేశానికి తెలుసని ఆమెతో చెప్పానని, రాష్ట్రం తర్వాత రాష్ట్రంలో ఎన్నికలు దొంగిలించబడ్డాయి, మీకు తెలిసినట్లుగా, 2024 ఎన్నికలు దొంగిలించబడ్డాయి అని రాహుల్ అన్నారు. అంతేకాకుండా, రాష్ట్రపతి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నప్పుడు ప్రతిపక్షం సాక్ష్యాలను అందిస్తుందని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు,. ఆమె స్పందనకు తాను ఆశ్చర్యపోయానని చెప్పారు. ఓట్ల దొంగతనం జరుగుతోందన్న విషయాన్ని భారత రాష్ట్రపతి ఖండిస్తారని నిజానికి ఆశించానని, భారతదేశంలో స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికల వ్యవస్థ ఉందని ఆమె చెబుతారని ఊహించానన్నారు. తాము చెప్పినదాన్ని భారత రాష్ట్రపతి అంగీకరించడం చూసి దిగ్భ్రాంతికి, నివ్వెరానికి గురయ్యానని రాహుల్ పేర్కొన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తిని కలిసి, వినతిపత్రం అందజేయడానికి ప్రతిపక్షం సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుందని కూడా గాంధీ తెలిపారు.

**ర్యాలీని అడ్డుకున్న పోలీసులు**

ఇదిలా ఉండగా ప్రతిపక్ష ప్రతినిధి బృందం రాష్ట్రపతి భవన్‌కు బయలుదేరడానికి ముందే, పార్లమెంట్ హౌస్ నుండి ర్యాలీ చేపట్టిన ఇతర ఇండియా కూటమి ఎంపిలు, నాయకులను విజయ్ చౌక్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ‘ప్రజాస్వామ్యాన్ని కాపాడండి‘ అనే పెద్ద బ్యానర్‌ను పట్టుకుని ఎంపిలు విజయ్ చౌక్ వైపు నిరసన ప్రదర్శన చేయగా, అక్కడ పోలీసులు వారిని అడ్డుకుని బారికేడ్లు ఏర్పాటు చేశారు. అంతకు ముందు, ఓటు దొంగతనం ఆరోపణలపై ఆందోళనను కొనసాగించడానికి, ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని ఒత్తిడి చేయడానికి తమ వ్యూహాన్ని చర్చించేందుకు ఇండియా బ్లాక్ ఎంపిలు సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ఖర్గే, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ముఖ్యమంత్రి కర్ణాటక డికె శివకుమార్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, మమతా బెనర్జీ, సూలే, బషీర్, బేబీ, రాజా, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రాజీవ్ రాయ్, మొహిబుల్లా నద్వీ, స్వతంత్ర ఎంపీలు కపిల్ సిబల్, పప్పు యాదవ్ ఉన్నారు. అంతకు మందు ఇండియా కూటమి ఎంపిలతో రాహుల్ మాట్లాడుతూ, ఆరోపించబడిన అవకతవకలు కేవలం ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు మాత్రమే పరిమితం కాలేదని, ప్రస్తుత ప్రభుత్వాన్ని తొలగించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతిపక్షం తమ డిమాండ్లను కొనసాగిస్తే ప్రభుత్వం కూలిపోతుందని ఆయన అన్నారు. ప్రతిపక్షాల నిరసనలు ప్రభుత్వ పునాదులను కదిలించాయని, ఇప్పుడు ప్రభుత్వం భయపడిందని గాంధీ సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో ఇండియా బ్లాక్ ఎంపిలతో అన్నారు.

## సుత్తి వాడలేం!

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టారు. ఇందులో భాగంగా పలు మెట్రో స్టేషన్ల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను మూసివేయడంతో పాటు కొన్ని రైళ్లను కూడా రద్దు చేశారు. ఈ నిర్ణయాలను సవాలు చేస్తూ సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, ఉద్యోగాలు, ఇతర అవసరాల కోసం ప్రయాణించే వారికి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంది. యువత, వృద్ధులు సహా అనేక మంది ప్రజా రవాణాపైనే ఆధారపడతారని ధర్మాసనం గుర్తు చేసింది. ప్రజలకు కనీస రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. మూసివేసిన మెట్రో స్టేషన్ల సంఖ్యను తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది, ఎంపి కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. రైళ్లను రద్దు చేయడం, మెట్రో స్టేషన్లను మూసివేయడం వల్ల ప్రజలు ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇది శాంతియుత నిరసన మాత్రమేనని, ఇలాంటి పరిస్థితుల్లో రవాణా వ్యవస్థను పూర్తిగా నిలిపివేయడం ఎందుకని ప్రశ్నించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ, తమ ఆందోళన నిరసనకారుల గురించి మాత్రమే కాదని, ఢిల్లీకి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వేలాది మంది ప్రయాణికుల గురించి కూడా అని స్పష్టం చేశారు. గురుగ్రామ్, గ్రేటర్ నోయిడా, తూర్పు ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం నగరానికి వచ్చే ప్రజలకు రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. భద్రతా చర్యలు తీసుకునే అధికారం అధికారులకు ఉందని ధర్మాసనం అంగీకరించింది. అయితే, ఆంక్షల పేరుతో అన్ని రకాల రవాణాను నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేయకూడదని స్పష్టం చేసింది. ప్రతి ఒక్కరికీ సొంత కారు లేదా ప్రైవేటు వాహనం ఉండదని, చాలామంది ప్రజా రవాణాపైనే ఆధారపడతారని గుర్తు చేసింది.

**‘రైళ్ల సంఖ్య తగ్గించొచ్చు..పూర్తిగా ఆపొద్దు’**

సుప్రీంకోర్టు వ్యాఖ్యలపై స్పందించిన కేంద్ర ప్రభుత్వ తరఫు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ప్రభుత్వంతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత జులైలో సిజెపి నిర్వహించిన నిరసన సందర్భంగా హింస చోటుచేసుకున్న విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. అయితే, భద్రతా చర్యలు అవసరమైన స్థాయిలోనే ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మెట్రో రైళ్ల రాకపోకల సంఖ్యను తగ్గించవచ్చని, కానీ సేవలను పూర్తిగా నిలిపివేయకూడదని సూచించింది. రహదారులపై విధించిన ఆంక్షలను కూడా మరోసారి పరిశీలించాలని ఆదేశించింది. ఏయే ప్రాంతాల్లో ఆంక్షలు అవసరం, ఎక్కడ వాటిని సడలించవచ్చనే అంశంపై సమీక్ష జరపాలని పేర్కొంది.

## ఢిల్లీ దిగ్బంధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. భద్రతా కారణాలు, మెట్రోల్ రైళ్ల రద్దు రీత్యా స్కూళ్లు, కాలేజీలను మూసివేస్తున్నట్లు ప్రకటించారు. శనివారం జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశారు. అయితే ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నట్లు ఆయా పాఠశాల, కాలేజీ యాజమాన్యాలు పేర్కొన్నాయి. ఆయా రాష్ట్రాల నుంచి ఢిల్లీ వస్తున్న విద్యార్థులు, యువతను అక్కడికక్కడే నిర్బంధిస్తున్నారు. ఢిల్లీలోని ఎఐఎస్‌ఎఫ్ ప్రధాన కార్యాలయం చుట్టూ పోలీసు వాహనాలను మోహరింపచేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల గొంతు నొక్కలేరు, లేదా నిరసన తెలిపే వారి ప్రజాస్వామ్య హక్కును అణచివేయలేరని విద్యార్థి సంఘం పేర్కొంది.

**జంతర్ మంతర్ నిరసనకు అనుమతి నిరాకరణ**

జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి), విద్యార్థి, యువజన సంఘాలు తలపెట్టిన నిరసనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. నిరసనలు దృష్ట్యా గతంలో ఎప్పుడూ లేని విధంగా భద్రతా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 25,000 మంది పోలీసులు, పారామిలిటరీ సిబ్బందిని మోహరించడం, 57 మెట్రో స్టేషన్లను మూసివేయడం, నగర సరిహద్దు పాయింట్లు, రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినళ్లు, హోటళ్లు, ఇతర కీలక ప్రదేశాలలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. జంతర్ మంతర్ వద్ద నిరసనకారులు అనధికారికంగా ధర్నా చేయకుండా నిరోధించడం, అలాగే పెద్ద ఎత్తున ప్రజలు సమీకరించబడే అవకాశం ఉన్న నేపథ్యంలో నగరం అంతటా శాంతిభద్రతలను కాపాడటమే విస్తృత భద్రతా ఏర్పాట్ల లక్ష్యమని పోలీసులు పేర్కొన్నారు. నిరసనలకు చాలా తక్కువ వ్యవధి ఇవ్వడం, గతంలో జరిగిన నిరసన సందర్భంగా నిబంధనలు, ఆదేశాలను ఉల్లంఘించారనే ఆరోపణలను కారణంగా చూపుతూ, ఈనెల 10న ప్రతిపాదించిన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించినట్లు జాయింట్ కమిషనర్ నూపుర్ ప్రసాద్ శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ప్రతిపాదిత సమావేశానికి కేవలం మూడు రోజుల ముందు, అంటే 7న, ప్రదర్శనకు అనుమతి కోరుతూ దరఖాస్తు సమర్పించారని, నిబంధనల ప్రకారం ఇలాంటి దరఖాస్తులను కనీసం 10 రోజుల ముందుగా సమర్పించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. ఈ దరఖాస్తు నిర్దేశించిన నోటీసు గడువును పాటించలేదని, అలాగే జూలైలో జరిగిన ప్రదర్శన తీరు, అధికారులు జారీ చేసిన ఆదేశాలను పాటించడంపై ఆందోళనలను రేకెత్తించిందని పోలీసులు తెలిపారు.

**భద్రత కట్టుదిట్టం : రైళ్లు, మెట్రోల్ స్టేషన్ల మూసివేత**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా 10న జంతర్ మంతర్ వద్ద చేపట్టనున్న నిరసన నేపథ్యంలో ఈ ఆంక్షలను ప్రతిపాదించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా, ఢిల్లీ పోలీసులు పలు ప్రాంతాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించారు. 120కి పైగా కేంద్ర సాయుధ పోలీసు బలగాల కంపెనీలు పాల్గొంటాయని అంచనా. ముందస్తు జాగ్రత్త చర్యగా అక్టోబర్ 9, 10 తేదీలలో ఢిల్లీ వ్యాప్తంగా మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రాజీవ్ చౌక్, న్యూఢిల్లీ, సెంట్రల్ సెక్రటేరియట్, పటేల్ చౌక్, కశ్మీర్ గేట్‌తో సహా 57 ఢిల్లీ మెట్రో స్టేషన్లలోని ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు శుక్రవారం రాత్రి 9 గంటల నుండి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు మూసివేయనున్నారు. ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డిఎంఆర్‌సి) ప్రకారం, న్యూఢిల్లీ మెట్రో స్టేషన్ మినహా ప్రభావితమైన అన్ని స్టేషన్లలో ఇంటర్‌ఛేంజ్ సౌకర్యం అందుబాటులో ఉండగా, 10న కూడా ఈ ఆంక్షలు కొనసాగుతాయి. ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు మూసివేయబడే ఇతర ప్రముఖ స్టేషన్లలో జన్‌పథ్, మండి హౌస్, బారాఖంబా రోడ్ సుప్రీంకోర్ట్, ఇంద్రప్రస్థ, ఐటిఒ, ఢిల్లీ గేట్, ఖాన్ మార్కెట్, జామా మసీద్, చాందినీ చౌక్, హౌజ్ ఖాస్, ఐఎన్‌ఎ ఉన్నాయి. ఈ జాబితాలో షాహీన్ బాగ్, జామియా మిలియా ఇస్లామియా, ఓఖ్లా విహార్, కళిందీ కుంజ్, లజపత్ నగర్, ఆశ్రమ్, సరాయ్ కాలే ఖాన్‌నిజాముద్దీన్, వెల్కమ్, షాదారా, రిథాలా, రోహిణి, ఆజాద్‌పూర్, కశ్మీర్ గేట్, శివాజీ స్టేడియం వంటివి కూడా ఉన్నాయి. రైల్వే సేవలకు కూడా అంతరాయం కలిగే అవకాశం ఉంది. శనివారం ఉదయం 4 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల మధ్య న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు రావలసిన లేదా అక్కడి నుండి బయలుదేరవలసిన అనేక రైళ్లు రద్దు అయినట్లు సమాచారం. సున్నితమైన ప్రదేశాలలో పెద్ద సమూహాలు గుమిగూడకుండా, ప్రదర్శనలకు అనుమతి లేని ప్రాంతాల వైపు వెళ్లకుండా నిరోధించడమే ఈ ఆంక్షల ఉద్దేశం. ప్రతిపాదిత చర్యలు, రోజువారీ ప్రయాణం కోసం మెట్రోపై ఆధారపడే ఉద్యోగులు, విద్యార్థులు, దుకాణదారులు, ఇతర ప్రయాణికులపై ప్రభావం చూపనున్నాయి. ప్రయాణికులు అధికారిక ప్రకటనలను తనిఖీ చేయాలని సూచించారు.

**సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై నిఘా**

ఇదిలా ఉండగా, నిరసన కోసం ప్రజలను సమీకరించడంలో భాగంగా, పోలీసులు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై నిఘాను ముమ్మరం చేశారు. 200 మందికి పైగా కంటెంట్ క్రియేటర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. జాతీయ రాజధాని సరిహద్దుల్లో కూడా నిఘాను పెంచారు. అదనపు భద్రతా కెమెరాలను ఏర్పాటు చేశారు. భద్రతా అంచనా, క్షేత్రస్థాయి పరిస్థితిని బట్టి, శనివారం ఉదయం 6 గంటల తర్వాత న్యూఢిల్లీలోకి ప్రవేశించే వాహనాలపై ఆంక్షలు విధించే అవకాశం ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. నివారణ భద్రతా చర్యల్లో భాగంగా హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు మరియు ధర్మశాలలను తనిఖీ చేస్తున్నారు. ప్రజలు శాంతిని పాటించాలని కోరుతూ, పోలీసులు వివిధ మసీదులు, దేవాలయాల నుండి కూడా విజ్ఞప్తులు జారీ చేస్తున్నారు. రాజధాని వ్యాప్తంగా ఉన్న బస్ టెర్మినళ్లలో నిఘాను పెంచారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే ప్రయాణికులను, వాహనాలను భద్రతా సిబ్బంది పర్యవేక్షిస్తారు. ప్రయాణికుల రాకపోకలు క్రమబద్ధంగా ఉండేలా చూసేందుకు, విమానాశ్రయం, దానికి వెళ్లే రహదారులపై అదనపు తనిఖీలు, నిఘాతో కూడిన కట్టుదిట్టమైన భద్రత కొనసాగే అవకాశం ఉంది. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకునేటప్పుడు, సాధ్యమయ్యే రద్దీ, భద్రతా తనిఖీలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

# వెస్టిండీస్‌తో రెండో టి–20..దూకుడుగా ఆడుతున్న భారత్

## 'పవర్ ప్లే'లో రికార్డు స్కోర్



రాంచీలో ఓపెనర్ సంజూ శాంసన్(74 నాటౌట్) దంచేస్తున్నాడు. వెస్టిండీస్ బౌలర్ల భరతం పట్టిన సంజూ 21 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. మరో ఎండ్‌లో ఇషాన్ కిషన్(43 నాటౌట్) సైతం బ్యాట్ ఝులిపించగా టీమిండియా స్కోర్ బోర్డు పరుగులు తీసింది. వీరిద్దరి విధ్వంసంతో పవర్ ప్లేలో విండీస్పై అత్యధిక స్కోర్ నమోదు చేసింది మెన్ ఇన్ బ్లూ. ఫామ్ అందుకున్న సంజూ శాంసన్(74 నాటౌట్) రెండో టి–20లో ఎడాపెడా బౌండరీలతో విరుచుకుపడుతున్నాడు. రాంచీలో యథేచ్ఛగా ఆడుతున్న శాంసన్.. 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో చెలరేగగా పవర్ ప్లేలో భారత్ రన్స్ కొట్టింది. అకీల్ హోసేన్ ఓవర్లో వరసగా 4, 6, 6, 4తో 22 పరుగులు పిండుకున్న సంజూ.. షెపర్డ్ వేసిన ఆరో ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ బౌండరీలతో ఈ ఫార్మాట్లో 11వ అర్ధ శతకం సాధించాడు. శాంసన్ జోరుతో పవర్ ప్లేలో 79 రన్స్ చేసింది ఇండియా. ఫలితంగా ఈ ఫార్మాట వెస్టిండీస్‌పై గతంలో అత్యధిక స్కోర్‌గా ఉన్న 72 పరుగుల రికార్డు బద్ధలైంది. అభిషేక్ శర్మ(20) ఔటయ్యాక దూకుడు పెంచిన సంజూ కు ఇషాన్ కిషన్(43 నాటౌట్) అగ్నికి వాయువులా తోడయ్యాడు. దాంతో..11 ఓవర్లలో 139 టీమిండియా రన్స్ కొట్టింది. వన్డే సిరీస్ను ఒడిసిపట్టిన భారత జట్టు టి–20 సిరీస్‌లో రెండో విజయంపై కన్నేసింది. తొలి మ్యాచ్‌లో అదిరే విజయంతో ముందంజ వేసిన టీమిండియా.. అదే ఊపు కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఖాతా తెరవాలనే పట్టుదలతో విండీస్ ఉంది. దాంతో.. ఇరుజట్ల మధ్య ఉత్కంఠ పోరు అభిమానులను అలరించనుంది. రికార్డు స్థాయిలో 9సార్లు టాస్ నెగ్గిన శ్రేయాస్ అయ్యర్ బదులు.. షాయ్ హోప్ టాస్ గెలిచాడు. మొదటి మ్యాచ్ ఓటమి అనుభవంతో భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడతడు. రాంచీలో జరుగుతున్న టి–20లో వెస్టిండీస్ కెప్టెన్ బౌలింగ్ తీసుకున్నాడు. విధ్వంసక ఆటతో విరుచుకుపడే భారత స్టార్లకు కళ్లెం వేసి.. ఛేదనలో చెలరేగాలనే ఉద్దేశంతో అతడు ఈ నిర్ణయం తీసుకున్నాడు. విండీస్ ఒక మార్పు(ఫోర్డే స్థానంలో గుడకేశ్ మోతీ)తో ఆడుతుండగా.. జోరు మీదున్న టీమిండియా మాత్రం అదే పదకొండు మందిని కొనసాగించింది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే శ్రేయాస్ అయ్యర్ సేన 2–0తో ఆధిపత్యం చాటుకుంది. ఒకవేళ కరీబియన్ జట్టు విజయం సాధిస్తే సిరీస్ సమం అవుతుంది. లక్నోలోని ఎకనా స్టేడియంలో జరిగిన తొలి టి–20లో టీమిండియా భారీ విక్టరీ కొట్టిన విషయం తెలిసిందే. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన శ్రేయాస్ అయ్యర్(102 నాటౌట్) అంతర్జాతీయ టి–20ల్లో తొలి శతకంతో రెచ్చిపోగా.. ఇషాన్ కిషన్(37 నాటౌట్) మరోసారి మెరిశాడు. దాంతో..171 పరుగుల ఛేదనలో పవర్ ప్లేలోనే అభిషేక్ శర్మ(21), సంజూ శాంసన్(11)లు ఔటైనా.. వీరిద్దరూ దూకుడైన ఆటతో చెలరేగారు. అర్ధ శతకం తర్వాత మరింత ఉతికేసిన అతడు 42 బంతుల్లో వంద కొట్టేశాడు. దాంతో.. ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా సిరీస్‌లో ముందంజ వేసింది.

**భారత తుది జట్టు:** అభిషేక్ శర్మ, సంజూ శాంసన్(వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ, శివం దూబే, నమన్ ధిర్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్, మయాంక్ యాదవ్.

**వెస్టిండీస్ తుది జట్టు:** షాయ్ హోప్(కెప్టెన్), కమిల్ పూరన్, షిమ్రన్ హెట్మైర్, రొవ్మన్ పావెల్, రూథర్‌ఫోర్డ్, రొమారియో షెపర్డ్, గుడకేశ్ మోతీ, రోస్టన్ ఛేజ్, అకీల్ హోసేన్, షమర్ స్ప్రింగర్, షమర్ జోసెఫ్.

# పాటిదార్ పోరాడినా..తప్పని పరాజయం

## ఆస్ట్రేలియా-ఎతో జరిగిన అనధికారిక వన్డే సిరీస్‌ను కోల్పోయిన భారత్-ఎ



సొంతగడ్డపై ఆస్ట్రేలియా–ఎతో జరిగిన అనధికారిక వన్డే సిరీస్‌ను భారత్–ఎ కోల్పోయింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించిన ఆస్ట్రేలియా–ఎ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది. శుక్రవారం జరిగిన రెండో అనధికారిక వన్డేలో రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని భారత్–ఎ జట్టు 69 పరుగుల తేడాతో చిత్తయ్యింది. రజత్ పాటిదార్(82 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 67) హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా లాభం లేకపోయింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా–ఎ 49.5 ఓవర్లలో 275 పరుగులకు ఆలౌట్ అయ్యింది. సామ్ కోన్‌స్టాస్(88 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 67), జోష్ ఫిలిప్(58 బంతుల్లో 8 ఫోర్లతో 58) హాఫ్ సెంచరీలతో రాణించగా.. నాథన్ మెక్స్వీనీ(32) పర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో అర్షద్ ఖాన్ మూడు వికెట్లు తీయగా.. యశ్ ఠాకూర్(2/46) రెండు వికెట్లు పడగొట్టాడు. విప్రజ్ నిగమ్, నిశాంత్ సింధు, సూర్యాన్ష్ షెడ్గే, అనుకూల్ రాయ్ తలో వికెట్ తీశారు. అనంతరం భారత్–ఎ 45.2 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. రజత్ పాటిదార్(82 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్తో 67) ఒంటరి పోరాటం చేసినా.. ఇతర బ్యాటర్లు రాణించలేకపోయారు. వరుసగా రెండు మ్యాచ్‌లలో హాఫ్ సెంచరీలతో సత్తా చాటడంతో రజత్ పాటిదార్‌ను న్యూజిలాండ్ పర్యటనకు ఎంపిక చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఆసీస్–ఎ బౌలర్లలో స్పెన్సర్ జాన్సన్(3/35) మూడు వికెట్లు తీయగా.. రిలే మెరిడిత్, తన్వీర్ సంఘా తలో రెండు వికెట్లు తీసారు. తొలి అనధికారిక వన్డేలో కూడా రజత్ పాటిదార్(51 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్తో 53) హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. 2023లో సౌతాఫ్రికాపై వన్డేల్లో అరంగేట్రం చేసిన రజత పాటిదార్.. మళ్లీ అవకాశం అందుకోలేదు. ఐపిఎల్‌లో ఆర్‌సిబీని వరుస సీజన్లలో రజత్ పాటిదార్ విజేతగా నిలబెట్టాడు. అప్పటి నుంచి అతన్ని టీమిండియాలోకి తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతున్నా.. సెలెక్టర్లు పట్టించుకోవడం లేదు. మరో రెండు రోజుల్లో న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లే భారత వన్డే జట్టును సెలెక్టర్లు ప్రకటించే అవకాశం ఉంది. రజత్ పాటిదార్‌కు అవకాశం దక్కుతుందో లేదో చూడాలి.

# సైన్స్

# జీవసాంకేతిక రంగంలో వృద్ధి



జీవసాంకేతిక విభాగం (డిబిటి) తాజాగా విడుదల చేసిన 2025 సంవత్సరాంత సమీక్ష ప్రకారం, భారతదేశ జీవసాంకేతిక రంగం గత దశాబ్దంలో అసాధారణ వృద్ధిని సాధించింది. 2014లో కేవలం 10 బిలియన్ అమెరికన్ డాలర్ల విలువ కలిగిన ఈ రంగం, 2024 నాటికి 165.7 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 2030 నాటికి 300 బిలియన్ డాలర్ల లక్ష్యంతో భారత్ వేగంగా ముందుకు సాగుతోంది. ఈ వృద్ధి భారతదేశాన్ని ప్రపంచంలో 12వ అతిపెద్ద బయోటెక్ హబ్‌గా, ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో 3వ స్థానంలో, ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టంగా నిలిపింది.అలాగే ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సిన్ తయారీ దేశంగా భారత్‌కు గుర్తింపు లభించింది. ఈ విజయానికి పునాదిగా ప్రభుత్వ విధానాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పరిశోధన–వాణిజ్యీకరణ మధ్య బలమైన అనుసంధానం ఉన్నాయి. 2025లో దేశంలో తొలి జాతీయ బయోఫౌండ్రీ నెట్‌వర్క్ ప్రారంభించబడింది. దీని ద్వారా దేశీయ బయోమాన్యుఫాక్చరింగ్ సామర్థ్యాలు గణనీయంగా పెరిగాయి. బయోఇ3 విధానం అమలులోకి రావడం ద్వారా బయో ఆధారిత రసాయనాలు, ప్రెసిషన్ బయోథెరప్యూటిక్స్, వాతావరణానికి తట్టుకునే వ్యవసాయంవంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధికి దారితీసింది. యువత ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు డిజైన్ ఫర్ బయోE3 కార్యక్రమం ప్రారంభించబడింది. జీవసురక్షను కాపాడుతూ ఆవిష్కరణలకు మార్గం సుగమం చేయడానికి 2025లో స్టాక్ జన్యుపరంగా మార్పు చేసిన పంటలపై మార్గదర్శకాలు నోటిఫై చేయబడ్డాయి. ఒకే పంటలో రెండు లేదా అంతకంటే ఎక్కువ లక్షణాలను కలిపే ఈవిధానం వ్యవసాయ ఉత్పాదకతను పెంచే కీలక అడుగుగా నిలిచింది. జీనోమ్ ఇండి యా ప్రాజెక్ట్ ద్వారా 10,000 పూర్తి మానవ జీనోమ్ నమూనాలతో జాతీయ జన్యు డేటాబేస్ రూపొందించబడింది. వన్ డే వన్ జీనోమ్ కార్యక్రమం భారతదేశంలోని సూక్ష్మ జీవ వైవిధ్యాన్ని ప్రజలకు పరిచయం చేస్తూ, దేశంలో వేరు చేసిన బ్యాక్టీరియా జీనోమ్‌లను ప్రతిరోజూ విడుదల చేసే వినూత్న ప్రయత్నంగా నిలిచింది. బయోమెడికల్ పరిశోధనలో మానవ వనరుల అభివృద్ధికి బయోమెడికల్ రీసెర్చ్ కెరీర్ ప్రోగ్రాం (బిఆర్‌సిపి) మూడవ దశను ప్రారంభించారు. దీని ద్వారా అత్యాధునిక పరిశోధనలకు అవసరమైన శాస్త్రవేత్తలను తయారు చేయడం, ప్రాంతీయ అసమానతలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. 2025లో డిబిటి సాధించిన విజయాలు అనేక రంగాల్లో స్పష్టంగా కనిపించాయి. ఆరోగ్యరంగంలో గర్భధారణ తేదీ నిర్ణయం, ముందస్తు ప్రసవ అంచనాల కోసం స్వదేశీ కృత్రిమ మేధస్సు ఆధారిత నమూనాలు అభివృద్ధి చేయబడ్డాయి. టిబి నిర్మూలన దిశగా టిబికార్యక్రమంలో భాగంగా 18,000 క్షయ వ్యాధి బ్యాక్టీరియా నమూనాల జీనోమ్ విశ్లేషణ జరిగింది. గర్భిణి ఎన్ఐ కోహోర్ట్‌లో 12,000 గర్భిణులను నమోదు చేసి, విస్తృత బయోస్పెసిమెన్ డేటాను భద్రపరిచారు. వ్యవసాయ బయోటెక్నాలజీలో అధిక దిగుబడినిచ్చే జన్యు సవరణ చేసిన బియ్యం రకం అభివృద్ధి చేయబడింది. కరవు నిరోధక శనగ రకాలు దేశీయ విత్తనోత్పత్తి లో కీలక పాత్ర పోషించాయి. అంతరిక్ష బయోమాన్యుఫాక్చరింగ్ రంగంలో భారత్ ముందడుగు వేసింది. సాంకేతిక బదిలీ, వాణిజ్యీకరణలో ఇంజినీర్డ్ ఈస్ట్ స్ట్రైయిన్లు, మస్టర్డ్ పంటల్లో వ్యాధి నిరోధకత వంటి అనేక ఆవిష్కరణలు పరిశ్రమలకు అందించబడ్డాయి.'యువ' పథకం ద్వారా దేశవ్యాప్తంగా యువ పారిశ్రామికవేత్తలకు మద్ద తు లభించింది. ఈశాన్య భారతంలో అడవి ఆపిల్స్, పెద్ద ఏలకుల వంటి ఉత్పత్తుల విలువ పెంచే సాంకేతికతలను అభివృద్ధి చేశారు. కేంద్ర–రాష్ట్ర స్థాయిలో బయోఇ3 సెల్‌లు, యునైటెడ్ కింగ్డమ్, స్విట్జర్లాండ్ వంటి దేశాలతో అంతర్జాతీయ భాగస్వామ్యాలు భారత బయోటెక్‌రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాయి. మొత్తంగా, బయోఇ3 వంటి విధానాలు, అత్యాధునిక పరిశోధన, ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యాల సమ్మేళనంతో భారత జీవసాంకేతిక రంగం 2025 నాటికి గణనీయమైన పరివర్తనను సాధించింది. ఇది దేశాన్ని స్థిరమైన బయో–ఆర్థిక వ్యవస్థలో ప్రపంచ నాయకుడిగా నిలబెట్టే దిశగా బలమైన పునాది వేసింది.

## అంతరిక్షం నుంచి రాత్రిపూట సూర్యకాంతి?



అమెరికా కమ్యూనికేషన్స్ నియంత్రణ సంస్థ 'ఎఫ్‌సిసి' ఈ ఏడాది జులై మాసంలో ఒక ప్రయోగాత్మక ఉపగ్రహ మిషన్‌కు అనుమతినిచ్చింది. 'రిఫ్లెక్ట్ ఆర్బిటల్' అనే సంస్థ రూపొందిస్తున్న 'ఇయరెండిల్ 1' ఉపగ్రహంలో సుమారు 18 మీటర్ల వ్యాసం గల భారీ అద్దం ఉంటుంది. ఈ అద్దం సూర్యరశ్మిని అంతరిక్షంలో ప్రతిబింబించి, సూర్యాస్తమయం తర్వాత కూడా భూమిపైని నిర్దిష్ట ప్రాంతాలకు వెలుతురు అందించే ప్రయత్నం చేస్తుంది. ఈ సాంకేతికత విజయవంతమైతే, ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రాంతాల్లో రాత్రిపూట అత్యవసర వెలుతురు అందించవచ్చు. అలాగే, సౌర విద్యుత్ కేంద్రాలకు అదనపు సమయం పాటు సూర్యకాంతిని అందించి విద్యుత్ ఉత్పత్తిని పెంచే అవకాశం ఉంటుంది. విద్యుత్‌సరఫరా నిలిచిపోయిన సందర్భాల్లో ఇది ఉపయోగపడుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. అయితే ఈప్రాజెక్టుపై తీవ్ర చర్చ సాగుతోంది. ఖగోళ శాస్త్రవేత్తలు, చీకటి ఆకాశ పరిరక్షణ కోసం పనిచేసే సంస్థలు తమ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి ప్రతిబింబ ఉపగ్రహాలు రాత్రి ఆకాశంలోని సహజ చీకటిని తగ్గించి కాంతి కాలుష్యాన్ని పెంచవచ్చని వారు హెచ్చరిస్తున్నారు. దీంతో నక్షత్రాలు, గెలాక్సీలు వంటి ఖగోళ వస్తువుల పరిశీలనకు అంతరాయం కలగవచ్చు. రాత్రివేళలపై ఆధారపడే పక్షులు, జంతువులు, కీటకాల సహజ జీవన చక్రాలపై ప్రభావం పడే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. అమెరికా ఎఫ్‌సిసి మాత్రం ఈ అంశాలు రేడియో తరంగాల నియంత్రణ పరిధిలోకి రావని, అందువల్ల వాటి ఆధారంగా అనుమతిని నిరాకరించే అధికారం తమకులేదని స్పష్టం చేసింది. రిఫ్లెక్ట్ ఆర్బిటల్ సంస్థ ఈ ప్రయోగాన్ని తొలి అడుగుగా చూస్తోంది. 2035నాటికి 50,000 వరకు ప్రతిబింబ ఉపగ్రహాల సముదాయాన్ని ఏర్పాటు చేయాలనే దీర్ఘకాలిక లక్ష్యాన్ని ప్రకటించింది. ఈ సాంకేతికత భవిష్యత్తులో సూర్యకాంతి వినియోగాన్ని కొత్త దశకు తీసుకెళ్లే సామర్థ్యం కలిగి ఉన్నప్పటికీ, శాస్త్రీయ పురోగతి, పర్యావరణ పరిరక్షణ, సహజ రాత్రి ఆకాశ సంరక్షణ మధ్య సమతుల్యత ఎలా సాధించాలన్న ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది.

# ఓటుహక్కు కాలరాసే చర్యలు నిలిపివేయాలి

## ఎస్ఐఆర్ రద్దు చేయాలి
## ముస్లిం ఐక్యవేదిక నిరసన
## సంఘీభావం తెలిపిన సిపిఐ




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే బర్తరఫ్ చేయాలని, పాత పద్ధతిలో ఎన్నికల కమిషనర్లను నియమించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ముస్లిం ఐక్యవేదిక నాయకులు నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమానికి సిపిఐ పెద్దపెల్లి జిల్లా నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం ఐక్యవేదిక నాయకులు, సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానంద మాట్లాడుతూ పధాన ఎన్నికల అధికారిగా కొనసాగుతున్న జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని, ఎన్నికల అధికారుల నియామకాన్ని పాత పద్ధతిలో సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి భాగస్వామ్యంతో ఉండే నిష్పక్షపాత ఎంపిక కమిటీ ద్వారా జరిపేలా చూడాలని, ఎస్ఐఆర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జామా మసీదు మౌలానా మహమ్మద్ అజీముద్దీన్ అహ్మద్ ముస్లిం నాయకులు సయ్యద్ మస్రత్, అబ్దుల్ హై జావిద్, ఎంఏ మొహీద్, కౌన్సిలర్లు మీర్జా షంషేర్ బేగ్,అస్లాం పర్వేజ్, సల్మాన్, అష్రాఫ్, అదిల్‌ఖాన్, నదీమ్, రఫీ ఉల్లా ఖాన్,మెహరాజ్, ఎంఐఎం జిల్లా అధ్యక్షులు ఇమ్రాన్, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు బాలసాని లెనిన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్, కుక్క శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.






**నిజామాబాద్ :** ఓటు హక్కును కాలరాసే చర్యలను నిలిపివేయాలని ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురాం నాయక్ అన్నారు. శుక్రవారం ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, ఎస్ఎఫ్ఐ, ఎఐపిఎస్‌యు, పిడిఎస్ యు,ర్వైఎఫ్ తదితర విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మను నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద దహనం చేస్తూ నిరసన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు విఘ్నేష్, అనిల్, వేణురాజ్, విపుల్‌గౌడ్, గణేష్, సుభోద్, రంజిత్, నరేష్, అనిల్, సన్నీ, గోపాల్‌సింగ్, రాజు, శివ పాల్గొన్నారు.

**నేరేడుచర్ల:** సిఇసి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందేనని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం నేరేడుచర్లలో జరిగిన సిపిఐ మండల కమిటీ సమావేశంలో బెజవాడ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌లో జరుగుతున్న అప్రజాస్వామిక విధానాలపై న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు దూళిపాళ ధనుంజయనాయుడు మాట్లాడుతూ ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కత్తి శ్రీనివాస రెడ్డి, నాయకులు రావుల సత్యం, అమరారపు పున్నయ్య, కొమ్రరాజు వెంకట్, ముత్యాల భాస్కర్, బెల్లంకొండ గోవింద తదితరులు పాల్గొన్నారు.

# నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి.నరసింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి.నరసింహ అన్నారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'అక్టోబర్ 10న' జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని సిజెపి పిలుపునిస్తే, నిరసనకు పోలీసుల అనుమతి నిరాకరించడంతో పాటు నిరసనకారులను ఎక్కడికక్కడ నిర్బంధించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలో పాల్గొనకుండా అడ్డుకునేందుకు కార్యకర్తల ఇండ్లకు వెళ్లి పోలీసులు ముందస్తు నిర్బంధాలు చేపట్టడం, ఢిల్లీలో లాడ్జీలు, హోటళ్లతో పాటు ఇంటర్‌నెట్, మెట్రో సేవలపై ఆంక్షలు విధించారని దుయ్యబట్టారు. ఇప్పటికే 25 వేల మంది భద్రతా బలగాలను మోహరించి ఢిల్లీ వీధులను పోలీసు నిర్బంధ ప్రాంతాలుగా మార్చారని, ఇలాంటి చర్యలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్యాయంపై నిరసన తెలపడం పౌరుల ప్రాథమిక హక్కు అని, రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని నరసింహ విమర్శించారు. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల్లో అక్కడి పాలకులు ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు ప్రయత్నిస్తే ప్రజలు తిరుగుబాటు చేసి, దేశ అధ్యక్షులను పారిపోయేలా చేశారని గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధమైన సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందని, జ్ఞానేశ్ కుమార్ పట్ల ప్రజల్లో విశ్వాసం పోయిందని విమర్శించారు. ఈ పరిణామాలను సిపిఐ ఖండిస్తోందన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తప్పించి, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈటి.నరసింహ డిమాండ్ చేశారు.

# పనిభారం తగ్గించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

## ఎఐటియుసి యాదాద్రి జిల్లా ప్రధానకార్యదర్శి ఇమ్రాన్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులకు పనిభారం తగ్గించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) సమావేశం భువనగిరి జిల్లా హాస్పిటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ జిల్లా హాస్పిటల్ లో పనిచేస్తున్న కార్మికులతో మెడికల్ కాలేజీలో పని చేయించడంతో సిబ్బంది తక్కువ ఉండటంతో కార్మికులపై అదనపు భారం పడుతుందన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా ఆసుపత్రిలో నూతన భవనాలు, కొత్త వార్డులు నెలకొల్పబడుతున్నా వాటికి అనుగుణంగా కార్మికుల సంఖ్య మాత్రం పెరగటం లేదని ఆరోపించారు. నూతన టెండర్లను పిలిచి కనీస వేతనం ప్రతి కార్మికునికి రూ.26,000 ఇవ్వాలని ఇమ్రాన్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కోశాధికారి సామల శోభన్‌బాబు, మెడికల్ కార్మికులు లక్ష్మమ్మ, నరసింహ, సులోచన, కృష్ణవేణి, సోమ నరసయ్య, ఉమా రాణి, శారద, విజయలక్ష్మి , లలిత, మహేందర్, హేమలత సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# చెగువేరా స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమాలు

## వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన విద్యార్థి, యువజన నాయకులు

**ప్రజాపక్షం/వరంగల్ :** విప్లవ ధృవతార చెగువేరా ఉద్యమ పోరాట స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్ పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్ లోని తమ్మెర భవన్ ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో చేగువేరా వర్ధతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. చెగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హరీష్, శివ శ్రేయాస్, నిఖిల్, ధనుష్, ప్రశాంత్, రాకేష్, రాజు, సాగర్, ఆఫీస్ ఇంచార్జీ వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ విప్లవ యోధుడు చెగువేరా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నునావత్ శ్రీనివాస్, హేమంత్, చంచల మురళి, కసిరెడ్డి సందీప్‌రెడ్డి, జువ్వాజి తిరుపతి, అజయ్, శ్రావణ్, అభి, సన్నీ, సాయి గణేష్ పాల్గొన్నారు.






**భద్రాద్రి కొత్తగూడెం :** చెగువేరా వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్, మాణిక్యాల వినయ్, జంజు నూరి రాజ్ కమల్, సుభాష్, ప్రకాష్, లక్ష్మణ్, చరణ్, కళ్యాణ్, రాకేష్ పాల్గొన్నారు.

**ఖమ్మం అర్బన్ :** ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలోని గిరిప్రసాద్ భవన్‌లో చెగువేరా వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బుర్రా మనోజ్, జిల్లా ఉపాధ్యక్షులు శివ, నాయకులు సుభాష్, ఉమామహేష్, అభి, రోహిత్, ధోనీ, అజయ్, శ్రీరాం, వంశీ, కుమార్, రాంచరణ్, సాయి, ప్రవీణ్, లోకేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

**ఎఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో :** ఎఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో చెగువేరా వర్ధంతిని న్యూలైక్ కోచింగ్ సెంటర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్, నాయకులు బొప్పి ఉమా, పి.దుర్గానాథ్, యశ్విన్, వీరబాబు, శ్రీకాంత్, శ్రీధర్, శ్రావణి, మౌనిక, మనీషా, శ్రీలత, సునీత పాల్గొన్నారు.











## ప్రశాంతంగా ఆర్‌టిసి గుర్తింపు ఎన్నికలు

20,36 మంది ఓటర్లకు గాను 20,15మంది ఓటు హక్కు వినియోగం

**ప్రజాపక్షం/నల్లగొండ:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. కార్మికులు ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.నల్లగొండ రీజియన్ పరిధిలోని 7డిపోల పరిధిలో 7కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 20,36 మంది ఓటర్లకు గాను 20,15 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సమాచారం.ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు కోసం నిర్వహించిన ఈ ఎన్నికలను కార్మికులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. తమ సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం తదితర అంశాలపై తమ వాణిని బలంగా వినిపించే కార్మిక సంఘానికి మద్దతు తెలిపేందుకు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు.

## డిండి ఆయకట్టు పంట పొలాలకు నీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి




**ప్రజాపక్షం/డిండి:** డిండి ఆయకట్టు పంట పొలాలకు నీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం సిపిఐ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం ఎండి. మైనోద్దీన్ అధ్యక్షతన పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగింది.ఈ సందర్భంగా పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఆయకట్టు పరిధిలోని రైతులు వరి పంటను సాగు చేసుకోవడం జరిగిందని చివరి దశలో ప్రస్తుతం పొట్టదశలో ఉన్నందున వరి పొలాలకు నీరు అందడం లేదని ఎండిపోయే పరిస్థితిలో ఉన్నందున కల్వకుర్తి ద్వారా డిండి ప్రాజెక్టును నింపి రైతులను ఆదుకోవాలని అన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని దీనికి అధికార పార్టీ చొరవ తీసుకొని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. వ్యవసాయానికి 16 గంటల నాణ్యమైన కరెంటు ఇచ్చి రైతులను ఆదుకోవాలని, లో వోల్టేజ్ సమస్యతో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం వలన పంటలు ఎండిపోతున్నాయని నాణ్యమైన 16 గంటల కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, వెంకటయ్య, జయరాములు, వెంకట్‌రెడ్డి, రామస్వామి, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పోలీస్ శాఖలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా వినియోగించుకోవాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ సూచించారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న పలు రికార్డులను, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. సిబ్బంది విధుల నిర్వహణ తీరును పర్యవేక్షించి, విధుల పట్ల వారి అంకితభావాన్ని, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో బ్లూకోల్ట్స్, పెట్రోకార్, డయల్ 100 సిబ్బంది నిర్వహించే విధులు అత్యంత కీలకమన్నారు. విధులు నిర్వహించే ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులు, గంజాయి కేసులతో సంబంధం ఉన్న వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. రాబోయే దసరా పండుగ, దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సూర్యాపేట పట్టణంలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ తనిఖీలో సూర్యాపేట సిఐ వెంకటయ్య, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## శివ రైస్‌మిల్లు యజమానులపై కేసు నమోదు

6,302 మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం కొరతగా గుర్తింపు

అధికారుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ప్రభుత్వ ధాన్యం నిల్వల్లో భారీ కొరత.. విలువ జరిమానాతో కలిపి ఏకంగా రూ.23 కోట్లు దాటింది. ప్రభుత్వానికి బియ్యం అప్పగించాల్సిన కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుతో భువనగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. రాయిగిరి గ్రామంలోని శివ పారాబాయిల్ ఇండస్ట్రీస్లో 6,302.80 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం కొరత ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఖరీఫ్ 202526 సీజన్కు సంబంధించి ఈ నెల 7న అధికారులు, సాంకేతిక సిబ్బందితో కలిసి మిల్లులో భౌతిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వ ధాన్యం నిల్వల్లో భారీ కొరత ఉన్నట్లు గుర్తించినట్లు తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ యాదాద్రి జిల్లా మేనేజర్ దాచేపల్లి హరికృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొరతగా ఉన్న ధాన్యం విలువ, జరిమానాతో కలిపి రూ.23,03,67,347గా అంచనా వేసినట్లు ఫిర్యాదులో వెల్లడించారు. ప్రభుత్వ ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేసి, నిబంధనల ప్రకారం బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా, నిల్వల్లో ఇంత భారీ కొరత ఏర్పడటంపై అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో మిల్లు భాగస్వాములైన గంప నాగేందర్, మంచాల రవీందర్లపై చర్యలు తీసుకోవాలని కోరడంతో భువనగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## చేగువేరా విప్లవ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు



**ప్రజాపక్షం/చండూరు:** చేగువేరా విప్లవ స్ఫూర్తితో ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు అన్నారు. చేగువేరా 59వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం చండూరు సిపిఐ కార్యాలయంలోని మాధగోని నర్సింహ్మా భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బొడ్డు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చేగువేరా ఆశయాలను , విప్లవ పోరాట స్ఫూర్తిని ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్ , ప్రజాపక్షం చండూరు జర్నలిస్టు కర్నాటి వెంకటేశం, సిపిఐ నాయకులు అందిర్క పరమేష , చెరుకు లింగస్వామి పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు అప్పగించేందుకు సిద్ధమవుతున్న రామస్వామి గుట్ట హౌసింగ్ కాలనీ

రూపుదిద్దుకుంటున్న 2,160 ఇళ్ల అత్యాధునిక మోడల్ కాలనీ

116 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం

ఇళ్ల కేటాయింపులో పారదర్శకత, కాలని నిర్వహణపై మంత్రి ఉత్తమ్ ప్రత్యేక దృష్టి





**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నిర్మించిన హౌసింగ్ కాలనీ లబ్ధిదారులకు అప్పగించేందుకు సిద్ధమవుతుంది. ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు సురక్షితమైన నివాస వసతితో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలు, సామాజిక సౌకర్యాలు కల్పించి ఈ కాలనీని ఆదర్శ నివాస సముదాయంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారు. సుమారు 116 ఎకరాల విస్తీర్ణంలో 2160 సింగిల్ రూమ్ ఇళ్లతో ఈ భారీ హౌసింగ్ కాలనిని నిర్మించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సొంతింటి భద్రత కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011/12 సంవత్సరంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఈప్రాజెక్టును ప్రారంభించారు. అయితే వివిధ కారణాలతో కొన్నేళ్లపాటు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. 2023లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ ప్రాజెక్టును తిరిగి చేపట్టిపూర్తి చేసే దిశగా చర్యలు తీసుకున్నారు.

**పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలి: మంత్రి ఉత్తమ్**

శుక్రవారం హైద్రాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో హౌసింగ్ శాఖ కార్యదర్శి విపి గౌతమి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనిలో మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. లబ్ధిదారులు ఇళ్లలోకి ప్రవేశించే నాటికి తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, మురుగునీరు పారుదల, పారిశుద్ధ్య సదుపాయలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. చిన్నారుల విద్యాభివృద్ధికి ప్రత్యేక స్టడి రూమ్‌లు ఈ మోడల్ కాలనీలో ప్రత్యేక ఆకర్షణగా లబ్ధిదారుల కుటుంబాలకు చెందిన పిల్లల కోసం కామన్ స్టడి రూమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి సూచించారు. కాలనీలో సామూహిక మరుగుదొడ్లు, స్నానపు గదులు, బట్టలు ఉతుక్కునేందుకు ప్రత్యేక ప్రదేశాలు, చిన్నారుల విద్యా, వినోద కార్యక్రమాల కోసం స్థలాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కాలనీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలో భాగంగా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, వైద్య సదుపాయలు, ఆట స్థలాలు తదితర సౌకర్యాలను కూడా కల్పించేలా ప్రణాళిక రూపొందించారు.

**20న లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు పత్రాలు**

దసరా సందర్భంగా అక్టోబర్ 20 రామస్వామి గుట్ట హౌసింగ్ కాలనీ ప్రాంగణంలో లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఇళ్ల కేటాయింపు ప్రక్రీయ పూర్తిస్థాయిలో పారదర్శకంగా జరగాలని అధికారులను అదేశించారు. అర్హులైన ఒక్క కుటుంబం కూడా జాబితా నుంచి తప్పిపోకూడదని, అదే సమయంలో అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇళ్లు కేటాయించరాదని స్పష్టం చేశారు. లబ్ధిదారుల జాబితాను తుది పరిశీలన చేయడంతో పాటు అభ్యంతరాలను స్వీకరించి, సంబంధిత ఆధార పత్రాలను పరిశీలించాలని సూచించారు. లబ్ధిదారుల సమక్షంలో సాఫ్ట్‌వేర్ ఆధారిత ర్యాండమ్ పద్ధతిలో ఇళ్ల కేటాయింపు చేపట్టే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

**కాలనీ నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ :** ఇళ్ల కేటాయింపుతోనే ప్రభుత్వ బాధ్యత ముగిసిపోదని కాలనీని దీర్ఘకాలం పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ శాఖ సమన్వయంతో నిరంరత పారిశుద్ధ్య నిర్వహణ, శాస్త్రీయ పద్ధతుల్లో చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ చేపట్టాలని సూచించారు. కాలనీ నిర్వహణలో నివాసితుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర పౌర సేవలు నిరంతరాయంగా అందేలా చూడాలని అదేశించారు.



## పురాతన ఆలయ గోపురం ధ్వంసం

సుదర్శన చక్రం చోరీకి యత్నం

**ప్రజాపక్షం/నకిరేకల్ (కట్టంగూరు) :** కట్టంగూరు మండలం చెర్వుఅన్నారం గ్రామంలోని పురాతన శ్రీశ్రీశ్రీ కోదండ రామస్వామి ఆలయ గోపురాన్ని గుర్తుతెలియని వ్యక్తులు పెకిలించి ధ్వంసంచేసిన ఘటన కలకలం రేపింది. గోపురంపై ఉన్న సుదర్శన చక్రాన్ని చోరీ చేసేందుకు యత్నించినట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనను గుర్తించిన వారు సుదర్శన చక్రాన్ని భద్రపరిచారు.గోపురాన్ని ధ్వంసం చేయడం వెనుక నిధుల అన్వేషణ ఉందా మరేదైనా కారణమా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కొన్నేళ్ల చరిత్ర కలిగిన ఈఆలయం ఇప్పటికే దేవదాయ శాఖ పరిధిలో నమోదైంది.అయితే గత కొంతకాలంగా నిత్య దీపధూప నైవేద్యాలకు నోచుకోవడం లేదు. ఆలయాన్ని పునర్నిర్మించేందుకు గ్రామస్థులు ప్రయత్నాలు చేస్తున్నారు.ఈ మేరకు దేవదాయ శాఖకు డిపాజిట్ సైతం చెల్లించారు. టెండర్ ప్రక్రియ ప్రారంభమైతే ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతుంది.ఇలాంటి సమయంలో ఆలయ గోపురం ధ్వంసం కావడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవదాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పురాతన ఆలయాలు, చారిత్రక కట్టడాలను పరిరక్షించేందుకు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## లప్వానాయక్ తండాను 'మినీ బంజారాహిల్స్'గా తీర్చిదిద్దుతాం

అన్ని వసతులు కల్పించాకే తండాను ఖాళీ చేయిస్తాం

విపక్షాల చిల్లర రాజకీయాలను ప్రజలే బొంద పెడతారు: ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** దాతరుపల్లి గ్రామ సమీపంలో బస్వాపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితులైన లప్వానాయక్ తండా గిరిజన సోదరులకు సకల సౌకర్యాలతో కూడిన కొత్త లేఅవుట్ను ఏర్పాటు చేసి, ఈ ప్రాంతాన్ని 'మినీ బంజారాహిల్స్'గా తీర్చిదిద్దుతానని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. శుక్రవారం దాతారుపల్లి పంచాయతీ పరిధిలో జరిగిన లప్వానాయక్ తండా నిర్వాసితుల ప్లాట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలు, స్వార్థ రాజకీయాల వల్లే బస్వాపూర్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1 టీఎంసీ నుంచి 11 టీఎంసీలకు పెంచి చుట్టుపక్కల 10 గ్రామాలు, తండాలను ముంచే పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం వచ్చాకే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద 30 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ అభివృద్ధి, విద్యుత్, తాగునీటి వసతుల కోసం ₹26 కోట్లు మంజూరు చేశామని తెలిపారు.

**5 ఏళ్ల పాటు పాత తండాలోనే నివాసం:** కొత్త లేఅవుట్లో లబ్ధిదారులు ఇళ్లు పూర్తి చేసుకుని, అన్ని రకాల సదుపాయాలు సమకూరే వరకు (కనీసం ఐదేళ్ల పాటు) పాత లప్వానాయక్ తండాలోనే నివసించవచ్చని స్పష్టం చేశారు. తండా ప్రజల ఆమోదం లేనిదే, ఇళ్లు పూర్తయ్యే వరకు బస్వాపూర్ ప్రాజెక్టులో 5 టీఎంసీలకు మించి నీటిని నింపబోమని మాటిచ్చారు. వయస్సు మరియు ఇతర సాంకేతిక కారణాల వల్ల ప్లాట్లు రాని 60 మంది అర్హులకు కలెక్టర్, జేసీలతో మాట్లాడి ప్లాట్లు ఇప్పిస్తామని, అంతేగాక ఈ తండాకు ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్ల ప్యాకేజీని ముఖ్యమంత్రి ద్వారా మంజూరు చేయిస్తామన్నారు.

**విపక్షాలపై తీవ్ర ఆగ్రహం**

తనపై, ప్రజా ప్రభుత్వంపై అనవసర వ్యాఖ్యలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నేను ఎమ్మెల్యే కాకముందే వ్యాపారం చేసినవాడిని, రాజకీయాన్ని సేవా దృక్పథంతో చేస్తున్నా. ఏ ఒక్క ఎకరం కబ్జా చేయలేదు' అని యాదగిరి లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా సవాలు విసిరారు. వార్డు మెంబర్గా కూడా గెలవలేని నాయకులు ఇవాళ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సన్న బియ్యం, ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే చిల్లర రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వాల మాదిరిగా అక్రమాలకు తావులేకుండా, లబ్ధిదారుల సమక్షంలోనే డ్రా (లక్కీ డిప్) తీసి ప్లాట్లను కేటాయించిన అధికారులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో లప్ప నాయక్ తండ సర్పంచ్ గసిరాం నాయక్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు దాతారు పల్లి సర్పంచ్ సరితభాస్కర్, ఆర్డీవో, జేసీ, ఎంఆర్ఓ, పిఎసిఎస్ చీర శ్రీశైలం, యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్. కానుగు బాల రాజు తుమ్మల నాగరాజ్,భరత్ పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లాకు అవార్డు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సమాచార హక్కు చట్టాన్ని జిల్లాలో సమర్థంగా అమలు చేయడంలో అధికారులు,పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ల కృషి వల్లనే జిల్లాకు అవార్డు వచ్చిందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.సమాచార హక్కు చట్టం సెక్షన్ 4(1)(బి) కింద సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించడంలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు శుక్రవారం హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా అవార్డు, జ్ఞాపికను కలెక్టర్ అందుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అధికారులు, సిబ్బంది కృషితోనే ఈ గుర్తింపు లభించిందన్నారు. సమాచార హక్కు కేసుల పరిష్కారంలోనల్లగొండ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందని, అధికారులంతా మరింత కృషి చేస్తే మొదటి స్థానానికి చేరుకుంటామని తెలిపారు.

### ఆర్‌టిఐ అమలులో సూర్యాపేట జిల్లాకు అరుదైన గౌరవం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సమాచార హక్కు చట్టం అమలులో సూర్యాపేట జిల్లా రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. పారదర్శకమైన పాలన, వేగవంతమైన సమాచార వేదికగా నిలవడంతో సూర్యాపేటను ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. రాష్ట్రంలోనే అత్యుత్తమ జిల్లాగా ఎంపికై అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్‌కు జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

## వరిధాన్యం కొనుగోలులో నిబంధనలు తప్పనిసరి




నల్లగొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ

**ప్రజాపక్షం/నల్లగొండ :** వానాకాలం (ఖరీఫ్) 2026/27 సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో సిబ్బంది నిబంధనలను తప్పని సరిగా పాటించాలని డీఆర్‌డీఓ వై. శేఖర్‌రెడ్డి ఆదేశించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.రైతుల నుంచి క్వింటాల్‌కు రూ.45 మాత్రమే హమాలీ చార్జీలుగా వసూలు చేయాలని, అదనంగా డబ్బులు లేదా ధాన్యం తీసుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు.శుక్రవారం నల్లగొండలోని టిటిడిసి జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో డీఆర్‌డీఏసెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహణపై సిబ్బంది, పీపీసీ వీవో అధ్యక్షురాళ్లు, వీవోఏలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వై.శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 16 మండలాల్లో 77 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.కొనుగోలు కేంద్రాలను ఎత్తైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని,వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరల ప్రకారం గ్రేడ్‌ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461,సాధారణ రకం ధాన్యానికి రూ.2,441 చెల్లించనున్నట్లు తెలిపారు.ఒక్కో బస్తాలో 40 కిలోల 700 గ్రాముల చొప్పున మాత్రమే ధాన్యం తూకం వేయాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యాన్ని క్రమపద్ధతిలో రాశులుగా పోయించాలని,ఒక్కో రాశిలో 150 నుంచి 200 బస్తాల వరకు ఉండేలా చూడాలని సూచించారు.శిక్షణ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ ఎం. శ్రవణ్‌కుమార్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఏ. మాధవి, కోశాధికారి వై. సునీత, డీపీఎం (నాన్‌ఫామ్) పి. వీరయ్య, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, మార్కెటింగ్ ఎస్‌సీఆర్‌పీలు జానకమ్మ, నాగలక్ష్మి, రేణుక, శాంత, స్వాతి, నిర్మల, దీపిక, బాషపాక చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకే చోట.. అన్ని ప్రభుత్వ సేవలు

పనుల వేగవంతానికి ఎమ్మెల్యే వేముల వీరేశం సూచనలు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో కొలువుదీరనున్నాయి.ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు నకిరేకల్ పట్టణంలో రూ.20 కోట్లతో నిర్మించనున్న సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులకు సూచించారు.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన ఈ భవన సముదాయ నిర్మాణ ప్రణాళికను బుధవారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో పరిశీలించారు. అనంతరం నిర్మాణ స్థలాన్ని సందర్శించి, పనుల పురోగతి, నాణ్యతపై అధికారులకు పలు సూచనలు చేశారు.నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈసముదాయంలో ఎంఆర్ఓ, ఎంపీడీఓ,నీటిపారుదల,విద్యుత్తు,వ్యవసాయ శాఖలతో పాటు ఇతర ప్రభు త్వ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో వివిధ పనుల కోసం ప్రజలు వేర్వేరు కార్యాలయాలకు వెళ్లే ఇబ్బందులు తొలగి,ప్రభుత్వ సేవలు ఒకే చోట అందుబాటులోకి రానున్నాయని ఆయన తెలిపారు.వారి వెంట తహశీల్దార్ యశ్వంత్ రాజ్,చౌగోని శ్రీనివాస్ మాధవరెడ్డి,ప్రవీణ్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అధికార పార్టీ ప్రలోభాలు, బెదిరింపులకు లొంగని ఆర్‌టిసి కార్మికులు

బస్సు, నిచ్చెన గుర్తుపై ఓటేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

యాదగిరిగుట్ట డిపోలో ఎన్నికల సరళిని పరిశీలించిన ఈదురు వెంకన్న



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని, కూటమి గెలుపు తథ్యమని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న ధీమా వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోకు విచ్చేసిన ఆయన, అక్కడ జరుగుతున్న ఎన్నికల సరళిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈదురు వెంకన్న మాట్లాడుతూ అధికార పార్టీ అండదండలతో కొందరు నాయకులు కార్మికులను డబ్బులు, మద్యం, బిర్యానీలు, చీరల పేరుతో ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మరికొందరికి ఫోన్లు చేసి బెదిరింపులకు కూడా పాల్పడ్డారని తెలిపారు. అయితే ఆర్టీసీ కార్మికులు ఎలాంటి ప్రలోభాలకు, బెదిరింపులకు లొంగకుండా తమ హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్ కూటమికి పూర్తి మద్దతుగా నిలిచారని స్పష్టం చేశారు. 'ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమమే ధ్యేయంగా ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం పోరాడుతోంది. కార్మికుల సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం సాగించే సంఘానికే ఉద్యోగులు పట్టం కడతారు. బస్సు, నిచ్చెన గుర్తుపై ఓటేసి కూటమిని ఆదరించిన ప్రతి ఒక్క కార్మికునికి ధన్యవాదాలు. ఈదురు వెంకన్న, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్టీసీ కార్మికులకు ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య ఎదురైనా ఎంప్లాయిస్ యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. కార్మికుల హక్కుల సాధన, సంస్థ పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బోలగాని సత్యానారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఇమ్రాన్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చెక్క వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పెరబోయిన మహేందర్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మంగలతో పాటు నాయకులు సామల శోభన్ బాబు, పెరబోయిన బంగారి, జగదీష్, సోకం వెంకన్న, సోమేశ్, రమేష్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు

బిసి జెఎసి రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించైనా సరే బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల లింగం గౌడ్ మాట్లాడారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాల్సిన అత్యవసర పరిస్థితి ఉందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడం రాజ్యాంగ స్ఫూర్తిలో ప్రధాన భాగమని గుర్తు చేశారు. బీసీ వర్గాలు అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించాలంటే విద్య, ఉద్యోగ, రాజకీయ ప్రాతినిధ్యంలో జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు భాస్కర్, నరసింహ చారి, బండిగారి రాజు, నరసింహ నాయక్, బ్రహ్మ చారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు చేరువగా 'ప్రజాసేతు'

### కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** ప్రజా సమస్యల ను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో 'కె.బి. ఆసిఫాబాద్ ప్రజాసేతు' డిజిటల్ వేదికను అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు తదితర సమస్యలతో పాటు వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండానే అధికారుల దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. వాట్సాప్ నంబర్ 7569986036 ద్వారా సమస్య వివరాలు, ప్రాంతం పేరు, ఫొటోలను జతచేసి పంపవచ్చని సూచించారు. ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక వెబ్‌సైట్ https://kbasifabad.in ను సైతం అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ఆధునిక సాంకేతికతతో సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి పాలనలో జవాబుదారీతనాన్ని పెంపొందించడమే దీని ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు.

## జాతీయ ఇన్‌స్పైర్ ప్రదర్శనకు పల్లె ప్రతిభ

### న్యూఢిల్లీలో మంచిర్యాల విద్యార్థి ప్రాజెక్టు ప్రదర్శన



**ప్రజాపక్షం/మంచిర్యాల:** న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఈ నెల 12 నుంచి 14 వరకు నిర్వహించే 12వ జాతీయస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు మంచిర్యాల జిల్లా ఎంపికైంది. కోటపల్లి మండలం అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి జనగామ శ్రావణ్‌కుమార్ రూపొందించిన 'ఆటోమేటిక్ అప్‌డేటెడ్ టాయిలెట్ క్లీనింగ్ సిస్టమ్' ప్రాజెక్టును అక్కడ ప్రదర్శించనున్నారు. తక్కువ ఖర్చుతో రూపొందించిన ఈ ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో ప్రశంసలు పొంది జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీకి పయనమైన విద్యార్థి శ్రావణ్‌కుమార్, గైడ్ టీచర్ సురేందర్‌లను కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్, ప్రధానోపాధ్యాయుడు రమేష్, మండల విద్యాధికారి, సెక్టోరియల్ అధికారులు అభినందించారు.

## రైతుల భూసమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ టౌన్ :** కేరమెరి మండలం సవరఖేడ్ గ్రామ పట్టాదారు రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి అజ్మీరా శ్యామ్ నాయక్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. పట్టా భూముల వద్ద అటవీశాఖ అధికారులు సరిహద్దులు ఏర్పాటు చేస్తుండటంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై ఉన్నతాధికారులతో మాట్లాడి నిబంధనల ప్రకారం పరిష్కరించి, రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని శ్యామ్ నాయక్ హామీ ఇచ్చారు.మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్, గడ్డల సత్తయ్య, సర్పంచ్ తులసిరామ్, రైతులు తుకారాం, భూరు, నడేవ్, రాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత .. మనందరి బాధ్యత

### నిర్మల్ ఎస్‌పి జానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్ :** మహిళలు,బాలికల భద్రతకు నిర్మల్ జిల్లా రక్షక భట శాఖ (పోలీస్ శాఖ) పూర్తిగా కట్టుబడి ఉందని, వేధింపులకు గురైతే భయపడకుండా ధైర్యంగా అధికారులను సంప్రదించాలని జిల్లా రక్షక భటాధికారి (ఎస్‌పి) డా. జి. జానకి షర్మిల సూచించారు. మహిళా రక్షణ బృందం (షీ టీమ్) ఆధ్వర్యంలో స్థానిక హరితవనంలో మహిళలు,యువతులకు మహిళల భద్రత, చట్టాలు అంతర్జాల నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అంతర్జాల ఆర్థిక మోసాలకు గురైతే వెంటనే 1930 సహాయక సంఖ్యకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 ద్వారా రక్షక భటుల సహాయం పొందాలని వివరించారు.మహిళలు,బాలికల భద్రతలో ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని,వేధింపులు లేదా బాల్యవివాహాలు వంటి ఘటనలు గమనించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## యువతకు చేగువేరా పోరాట స్ఫూర్తి ఆదర్శం

### ఎఐఎస్‌ఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైలాష్



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : విప్లవ యోధుడు చేగువేరా 59వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత విద్యార్థి సమైక్య (ఎఐఎస్‌ఫ్) నిర్మల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.చేగువేరా జీవితం ప్రపంచవ్యాప్తంగా అనేకమంది యువతకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు.ఆయన ప్రదర్శించిన పోరాట పటిమ, సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి నేటి తరం యువతకు నిత్య ఆదర్శమని తెలిపారు.నిర్మల్ జిల్లా కార్యదర్శి కైలాష్‌తో పాటు విద్యార్థి నాయకులు హరిచంద్,సిద్ధార్థ్,అఖిల్,నిఖిల్,సురేష్,దళిత హక్కుల పోరాట సమితి (డిఏ హెచ్‌పిఎస్) అధ్యక్షులు అనంతరావు కార్యకర్తలు పాల్గొని చేగువేరాకు ఘనంగా అంజలి ఘటించారు.

## నిజాంపేట ఎంఇఒగా బాధ్యతలు చేపట్టిన యాదగిరి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** మండలంలో ఎంఈఓగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ రెడ్డి గుండెపోటుతో మృతి చెందిన విషయం విధితమే.కాగా నిజాంపేట మండల విద్యాధికారిగా సాంగని యాదగిరిని రెండోసారి నియమించారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శుక్రవారం ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్జిటి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్, మండల అధ్యక్షులు పరశురాములు, ప్రధాన కార్యదర్శి దశరథం, ఉపాధ్యక్షుడు రాజు, ఎచ్‌ఎం సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ వైద్యశాలలో విద్యార్థులకు

# మెరుగైన వైద్యం, విద్యావసతులు

### కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, మౌలిక సదుపాయాల కల్పన,ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పన, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య విద్య ను అభ్యసించే విద్యార్థులకు అవసరమైన ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చినప్పుడే వారి సామర్థ్యాలు పెరుగుతాయని,అలాగే వారు మంచి వైద్యులుగా తీర్చిదిద్దబడతారని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు.వైద్య కళాశాలలోని విద్యార్థుల సంఖ్య, వారి విద్యా సంబంధిత విషయాలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు నిర్దేశిత పరీక్షలను నిర్వహిస్తూ, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆయా విభాగాల్లో అవసరమైన వైద్య సేవలను అందించేందుకు కావలసిన పరికరాలన్నీ ప్రాధాన్యత క్రమంలో సమకూర్చుకోవాలని అన్నారు.డిఎంహెచ్‌ఓ రాజేందర్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్,డిసిహెచ్‌ఓ కాశీనాథ్,ఇతర అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

### తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక టిటిడిసి హాల్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల జర్నలిస్టుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వార్తల్లో వేగం కంటే విశ్వసనీయతకే ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషాలను నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని గెడాం లీలావతి ఇప్పపువ్వు లడ్డు కేంద్రాన్ని సందర్శించి, లడ్డుల తయారీ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు సేకరించిన తేనె, నెయ్యి, మిల్లెట్ బిస్కెట్లను పరిశీలించి ప్రశంసించారు. మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, డిపిఆర్‌ఓ విష్ణువర్ధన్, రచన కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు, జర్నలిస్టు ప్రతినిధులు రాజేశ్వర్, దేవేందర్, బేత రమేష్, వినోద్, సురేష్, సాహిద్, వెంకట్, కిరణ్ పాల్గొన్నారు.

## వైద్యులకు స్టైఫండ్ రూ.30 వేలు చెల్లించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** రాష్ట్రంలో న్యాయమైన హక్కుల సాధన కోసం వైద్యులు చేపట్టిన సమ్మెకు ఎఐటియుసి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పున కు అనుగుణంగా జూనియర్ డాక్టర్లకు నెలకు రూ. 30 వేల చొప్పున స్టైఫండ్ ఇవ్వడంతో పాటు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్యుల మధ్య విభజన తీసుకొచ్చి కాలయాపన చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే వైద్య సంఘాల ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తే ఎఐటియుసి ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై ప్రత్యేక ఫోకస్

### కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరించారు.శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాల పురోగతి, రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ఏలినో ప్రభావంతో రానున్న వేసవి కాలంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై మళ్లించడం, సూపర్ ఏలినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంవివిజి రామ్ పథకం ద్వారా కూలీల సంఖ్య పెంచడం సంబంధిత అంశాలపై ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మొదటి విడతలో మంజూరై ఇంకను మొదలు పెట్టని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లబ్ధిదారులపై ప్రత్యేక ఫోకస్ పెట్టి వెంటనే ఇండ్లు నిర్మించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు, ,అదే విధంగా ఆయా మండలాల పరిధిలో బేస్‌మెంట్ లెవల్, రూఫ్ లెవల్, రూఫ్ కాస్టెడ్ వంటి వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రెండో విడతలో అర్హత గల లబ్ధిదారుల జాబితా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.ఈ నెలలో దసరా తర్వాత వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. ఎలనీనో ప్రభావం వల్ల రానున్న యాసంగి సీజన్ కు ప్రమాదం ఉందని, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు.సూపర్ ఎలినో ప్రభావం వల్ల త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు నీటిని వృధా చేయరాదన్నారు.బి వి జి రామ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీల సంఖ్య పెంచాలని, గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు పెంచాలన్నారు.జడ్పీ సిఇఒ ఎల్లయ్య డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 20వ జాతీయ అంతర్‌జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఏర్పాట్లు

### కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం/సంగారెడ్డి:** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో సంగారెడ్డి జిల్లాలోని వోక్సెన్ విశ్వవిద్యాలయంలో వచ్చే నవంబర్ మాసంలో నిర్వహించనున్న 20వ జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్ ఎన్ఐడి జెఏఎం 2026 కు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్ నుంచి స్పోర్ట్స్ అథారిటీ పోలీస్ శాఖ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీఓ పంచాయతీరాజ్ సంబందిత శాఖల అధికారులతో జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు సంబందించిన ఏర్పాట్లపై గూగుల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా 660 కి పైగా జిల్లాల నుంచి 6000 మందికి పైగా అండర్ 14 ,అండర్ 16, కెటగిరిలకు చెందిన జూనియర్ అథెట్లు సుమారు 1,500 మంది కోచ్‌లు సాంకేతిక అధికారులు, ఇతర ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉన్నందున కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.వోక్సెన్ విశ్వావిద్యాలయం ప్రాంగణం క్రీడా మైదానాలు, క్రీడాకారులు, వసతి ప్రాంతాల వద్ద తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. క్రీడాకారులు కోచ్‌లు సాంకేతిక అధికారులు ,ఇతర ప్రతినిధులు, రాకపోకలకు అనుగుణంగా నవంబర్ 12 నుంచి 17వ తేది వరకు సికింద్రాబాద్ ,లింగంపల్లి, రైల్వే స్టేషన్లు ఎంజిబిఎస్ తదితర ప్రధాన రవాణా నుంచి వోక్సెన్ విశ్వవిద్యాలయం వరకు ప్రత్యేక టీజీఎస్‌ఆర్టీసి షటిల్ బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు ,కోచ్‌లు సాంకేతిక అధికారులు సందర్శకులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతిరోజూ తగినంత తాగునీటి సరఫరా ఉండేలా చూడాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది పరికరాలను ముందుగానే అందుబాటు లో ఉంచాలని సంబందిత అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు కోచ్‌లు సాంకేతిక అదికారులు సందర్శకులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతిరోజు తగినంత తాగునీటి సరఫరా ఉండేలా చూడాలని సూచించారు. ఈ గూగుల్ మీట్ ద్వారా సమీక్షలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ పాండు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదికారిణి లలితా దేవి ,సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్ ఆర్టీసీ అదికారులు, సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెదక్ సిబిఎస్‌లో దసరా డబుల్ ధమాకా సేల్ ప్రారంభం

### సినీనటి పాయల్ రాజ్‌పుత్ సందడి..ప్రత్యేక ఆఫర్లు



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్‌లోని చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ (సీబీఎస్)లో దసరా డబుల్ ధమాకా సేల్‌ను శుక్రవారం సినీనటి పాయల్ రాజ్‌పుత్ ప్రారంభించారు. మెదక్‌కు రావడం సంతోషంగా ఉందని, సీబీఎస్‌లో లభించే వస్త్రాల డిజైన్లు, వెరైటీలు ప్రత్యేకంగా ఉంటాయని అన్నారు.సీబీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ జానా సురేష్ మాట్లాడుతూ వినియోగదారులకు అందుబాటు ధరల్లో నాణ్యమైన సంప్రదాయ, ఆధునిక వస్త్రాలను అందించడమే తమ లక్ష్యమన్నారు. దసరా, షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక తగ్గింపులు, ఆకర్షణీయమైన ఆఫర్లు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా షాపింగ్ మాల్‌కు వినియోగదారులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. దసరా ధమాకా సెల్ ప్రారంభంలో టీం సభ్యులు సుధాకర్, రాజమౌళి, మీడియా ఇంచార్జ్ గోపీనాథ్, మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ రాజాగౌడ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా అదనపు కలెక్టర్‌గా రాజాగౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆయన మర్యాదపూర్వకంగా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలికి, పరిచయం చేసుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌గా కొనసాగిన కిరణ్‌కుమార్ పదవి విరమణ చేయగా ఆయన స్థానంలో జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా కొనసాగుతున్న రాజాగౌడ్‌ను జిల్లా అదనపు కలెక్టర్‌గా ప్రభుత్వం ఇటీవలే పోస్టింగ్ కల్పించింది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్‌ఓ గీత, బాలరాజు, సిబ్బంది అదనపు కలెక్టర్‌ను బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలిసి స్వాగతం పలికారు. రాజాగౌడ్ ఇదివరకు ఉమ్మడి జిల్లాలోని బాన్సువాడ, బోధన్, ఆర్మూర్‌లో రెవెన్యూ డివిజనల్ అధికారిగా విధులు నిర్వర్తించారు.

## ఎవరూ దొంగిలించలేని సంపద విద్యే

### అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఎమ్మెల్యే గడ్డం వినోద్



**ప్రజాపక్షం / బెల్లంపల్లి:** ఎవరూ దొంగిలించలేని ఏకైక సంపద విద్య మాత్రమేనని, విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్, ఇన్‌ఛార్జి విద్యాధికారి పి. చంద్రయ్య అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిలతో కలిసి ఆయన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఏకాగ్రతతో విద్యనభ్యసించేందుకే పోషక విలువలతో కూడిన నాణ్యమైన అల్పాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపులో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించి క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలని, చదువుతో పాటు క్రీడలు, సామాజిక అంశాల్లో రాణించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.ఓటరు జాబితా సవరణపై సమీక్ష: తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. ప్రతి ఒక్కరి పేరూ జాబితాలో ఉండేలా చూడాలని, విచారణ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## బాధితులకు సత్వర న్యాయం అందేలా పనిచేయాలి



**ప్రజాపక్షం/నిర్మల్ :** ప్రతి కేసులోనూ నాణ్యమైన దర్యాప్తు చేపట్టి,పటిష్టమైన సాక్ష్యాధారాల సేకరణ ద్వారా నేరస్తులకు శిక్ష పడేలా చేసి, బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపిఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ,కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారం, సిసిటిఎన్‌ఎస్ 2.0 నవీకరణ, ఈసాక్ష్య, ఆన్‌సైట్ నమోదు, జీరో ఎఫ్‌ఐఆర్ విధానాల అమలుతో పాటు రాబోయే దసరా, బతుకమ్మ పండుగల భద్రతా ఏర్పాట్లపై అధికారులతో విస్తృతంగా సమీక్షించారు.దర్యాప్తు ప్రక్రియలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఎస్పి సూచించారు.ఈసాక్ష్య ద్వారా ఆధారాలను సేకరించి భద్రపరచడంలో నిబంధనలు పాటించాలని, ఆన్‌సైట్ విధానంలో వివరాలను క్షేత్రస్థాయిలోనే నమోదు చేయాలని తెలిపారు. జీరో ఎఫ్‌ఐఆర్ అమలు ద్వారా బాధితులకు తక్షణ ఉపశమనం కలిగించాలని ఆదేశించడంతో పాటు, సిసిటిఎన్‌ఎస్ 2.0 లో కేసుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. రాబోయే దసరా,బతుకమ్మ పండుగలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా జరుపుకునేలా ముందస్తు భద్రతా ప్రణాళికలు సిద్ధం చేయాలని,రద్దీ ప్రాంతాల్లో నిఘా పెంచి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు,బాలల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.గంజాయి అక్రమ రవాణా, ఆస్తి నేరాల కట్టడికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, రాత్రి గస్తీ మరియు బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ ఆదేశించారు. సైబర్ మోసాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చి, బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించేలా ప్రచారం నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయాలని తెలిపారు. నేర సమీక్షా సమావేశం అనంతరం ఎస్‌పి ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించి పోలీసు శాఖ వాహనాలను తనిఖీ చేశారు.వాహనాల కండిషన్, నిర్వహణ,అందుబాటులో ఉన్న పరికరాలను పరిశీలించి, వాహనాలు ఎల్లప్పుడూ విధులకు సిద్ధంగా ఉండేలా అవసరమైన మరమ్మతులను సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందికి మార్గదర్శనం చేశారు. భైంసా ఎఎస్‌పి సాయి కిరణ్, ఐపిఎస్, నిర్మల్ డిఎస్‌పి శ్రీనివాస్, సీఐలు కృష్ణ, గోవర్ధన్ రెడ్డి, సమ్మయ్య, సత్యనారాయణ, ప్రవీణ్, సాయి కుమార్, రవీందర్ నాయక్, దీపక్,మల్లేష్‌లతో పాటు అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓ లు,డీసీఆర్‌బీ ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలను నిరసిస్తూ రాస్తారోకో

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/రామాయంపేట:** ఆరుగాలం కష్టంచి పంటలు వేస్తే పంట చేతి కొచ్చే సమయంలో విద్యుత్ కోతలతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. శుక్రవారం మండల పరిదిలోని లక్ష్మాపూర్ స్టేజి వద్ద రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుబాష్‌రెడ్డిలు రాస్తారోకోలో పాల్గొన్నారు. దీంతో సుమారు గంట పాటు మెదక్‌రామాయంపేట రహదారిపై వాహనాలు నిలిచిపోగా ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం 24 గంటల పాటు నిరంతరంగా కరెంటు అందించిందన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. విషయం తెలుసుకున్న పోలీసులు సిఐ సైదా, ఎస్‌ఐ బాల్‌రాజులు ఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించి రాస్తారోకోను విరమింపచేశారు. లక్ష్మాపూర్, కాట్రియాల, దంతెపల్లి, పర్వతాపూర్, కిషన్‌తండా, జ మ్లా తండా, తొనిగండ్ల రైతులతో పాటు బిఆర్ఎస్ నాయకులు సొసైటీ చైర్మెన్ బాదె చంద్రం, మాజీ మున్సిపల్ చైర్మెన్ జితెందర్‌గౌడ్, చౌదరి సుప్రభాత్‌రావు, ఉమామహేశ్వర్, సుబాష్‌రాథోడ్, నర్సింగరావు, నరేందర్‌రెడ్డిలతో పాటు ఉన్నారు.



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

# రీల్



## 'అమ్మో ఇది ఎవర్రా' సాంగ్ రిలీజ్

హీరో సూర్య, మలయాళ బ్లాక్‌బస్టర్ 'ఆవేశం' ఫేమ్ దర్శకుడు జిత్తు మాధవన్‌తో కలిసి యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'సీన్' చేస్తున్నారు. నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆనంద్ రాజ్, లాల్, రాజ్ ప్రియన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జ్యోతిక, సూర్య జాగరం స్టూడియోస్, 2డీ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌లోపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జయశ్రీ దామోదరన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు మ్యూజికల్ జర్నీని ఫస్ట్ సింగిల్ 'అమ్మో ఇది ఎవర్రా' అనే పాటతో తో ప్రారంభించారు. సుశిన్ శ్యామ్ కంపోజ్ చేసిన ఈ పాట ఫుట్ట్యాపింగ్ బీట్స్, వెంటనే ఆకట్టుకునే రిథమ్తో అదిరిపోయే ఎనర్జీని అందిస్తోంది. పాటలోని వైబ్రెంట్ మూడ్‌కు తగ్గట్టుగా ఈ అప్బీట్ కంపోజిషన్ ఆకట్టుకుంది. రాకేందు మౌళి అందించిన లిరిక్స్ నజ్రియా నజీమ్ పాత్రలోని అగ్రెసివ్, ఎనర్జిటిక్ నేచర్ని ప్రజెంట్ చ్చేనాయి. సింగర్ వినాయక్ తన లైవ్లీ, ఎనర్జిటిక్ పాటకు మరింత ఎనర్జీతీసుకొచ్చారు. వీడియో గేమ్ కాన్సెప్ట్ చుట్టూ ఈ పాటను క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. కొరియోగ్రాఫర్ రాజ్ ప్రియన్ ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఈ యూనిక్ ఐడియా పాటకు ప్లేఫుల్ టచ్‌ను తీసుకొచ్చింది. ఫన్, క్విర్కీ ఎలిమెంట్స్‌తో పాటను ఆసక్తికరంగా ప్రెజెంట్ చేశారు. ముఖ్యంగా నజ్రియా నజీమ్ పాటంతాఉత్సాహంతో కనిపించారు. 'అమ్మో ఇది ఎవ్వర్రా' పాట అదిరిపోయేలా ఉండటంతో 'సీన్' మ్యూజికల్ ప్రమోషన్స్‌కు ఇది మంచి ఆరంభంగా నిలిచింది.వినీత్ అగస్టిన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అజ్మల్ సాబు ఎడిటింగ్, అశ్విని కాలే ప్రొడక్షన్ డిజైన్.'సీన్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 6న దీపావళి కానుకగా థియేటర్లలో విడుదల కానుంది.

## 16న 'క్రేజీ కల్యాణం' విడుదల

### ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి



నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 16న 'క్రేజీ కల్యాణం' సినిమా వరల్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కథతో 'క్రేజీ కల్యాణం' సినిమాను నిర్మించాం. మా సినిమాను ఈ నెల 30న రిలీజ్ చేయాలని అనుకున్నాం. అయితే వెంకటేష్ ఆదర్శ కుటుంబం సినిమా రిలీజ్ పోస్ట్ పోన్ కావడంతో మా టీమ్ అందరూ పండుగకు రిలీజ్ చేయండి అని సూచించారు. మా సినిమా కూడా మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ కాబట్టి పండుగకు బాగుంటుంది రిలీజ్ చేస్తే అని భావించి ఈ నెల 16నే రిలీజ్ కు తీసుకొస్తున్నాం. మా మూవీ కంటెంట్ మీద మాకు పూర్తి నమ్మకం ఉంది. ఈ స్క్రిప్ట్ ఎవరు విన్నా ఇష్టపడ్డారు. అనుపమ, నరేష్, తరుణ్ భాస్కర్, అఖిల్ ..ఇలా అందరూ కథ చాలా బాగుందని చెప్పారు. మాకు స్క్రిప్ట్ మీద ఉన్న నమ్మకం, వాళ్లు ఇచ్చిన రెస్పాన్స్‌తో మరింత కాన్ఫిడెన్స్ పెరిగింది. ఈ నెల 16న రిలీజ్ కాబట్టి నరేష్ , తరుణ్ భాస్కర్..తెలుగు ప్రేక్షకులు అందరికీ సులువుగా అర్థమవుతుంది. అందరికీ నచ్చుతుంది. దసరా పండుగ తెలంగాణలో చాలా పెద్ద పండుగ. ఈ పండుగకు ఎన్ని సినిమాలు వచ్చినా ప్రేక్షకులు చూస్తారు. మొదట్లో మాకు తక్కువ థియేటర్స్ లభించినా, మౌత్ టాక్ తో , పాజిటివ్ టాక్‌తో ఎక్కువ స్క్రీన్స్ పెరుగుతాయనే నమ్మకం ఉంది. సినిమా చూశాక థియేటర్ నుంచి ఒక గుడ్ ఫీల్ తో బయటకు వస్తారు. సురేష్ బొబ్బిలి బ్యూటిఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. అలాగే డాక్టర్ గోరటి వెంకన్న మూడు పాటలు, కాసర్ల శ్యామ్ రెండు పాటలు, మిట్టపల్లి సురేందర్ ఒక పాట రాశారు. మొత్తం ఐదు సాంగ్స్, రెండు బిట్ సాంగ్స్ ఉన్నాయి. మా సినిమాను మొత్తం మెదక్ చుట్టుపక్కల గ్రామాల్లో, మెదక్ టౌన్ లో రూపొందించాం. వంద శాతం రియల్ లొకేషన్స్ లో సినిమా షూట్ చేశాం. మా సినిమాను బన్నీ వాస్ , సురేష్ ప్రొడక్షన్స్ వారు చూశారు. వాళ్లకు విపరీతంగా నచ్చింది. వాళ్లకు మా మూవీ బాగా నచ్చింది కాబట్టే బన్నీ వాస్ , సురేష్ ప్రొడక్షన్స్, ఏషియన్ సినిమాస్ కలిసి మా సినిమాను రిలీజ్ చేస్తున్నారు. దాదాపు రెండు వందల థియేటర్స్‌లో మా మూవీ రిలీజ్ అవుతోంది.

## నేను మారను.... వాళ్లు మారాలి

### 'ట్రైలర్ రిలీజ్' ఈవెంట్‌లో హీరో విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విజయదశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హైదరాబాద్‌లో ఘనంగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిపారు. ఈ కార్యక్రమంలో హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ మూవీ రిలీజ్ కోసం ఎగ్జైటింగ్‌గా వేచి చూస్తున్నా. మీరంతా ఈ నెల 16న ఈ సినిమా తప్పకుండా చూడాలి. మీ ఫ్యామిలీకి చూపించాలి. మనం ఎలాంటివి దాటుకుని ఇక్కడి దాకా వచ్చాం. మనలో ఎలాంటి డీఎన్ఏ ఉంది అని తెలుసుకునేందుకు మీరు సినిమా చూడాలి. ఈ చిత్రంలో భాగమవడం గర్వంగా ఉంది. రశ్మిక ఈ ఈవెంట్‌కు రానందుకు నా తరుపున సారీ చెబుతున్నా. నెగిటివ్ స్ప్రెడ్ చేసేవాళ్లు తమ జీవితాలు గొప్పగా తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేయండి. నా కలలు, నా శ్రమ వాళ్లకు అనవసరం అనిపిస్తే నేనాగాలా? నా హానెస్టీ వాళ్లకు అహంకారం అనిపిస్తే, నా ఆత్మవిశ్వాసం వాళ్లకు బలుపు అనిపిస్తే నేను తగ్గాలా, నా జర్నీ వాళ్లకు అర్థం కాకపోతే నేను ఇంట్లో కూర్చోవాలా, నేను మారను. వాళ్లు మారాలి. నేను ఈ సినిమా వరకు రవి గారికి థ్యాంక్స్ చెప్పాలా, రాహుల్ కు థ్యాంక్స్ చెప్పాలా, ఆ విధికి థ్యాంక్స్ చెప్పాలా తెలియడం లేదు. నా కెరీర్‌లో రణబాలి ఒక పెద్ద హైలైట్‌గా నిలిచిపోతుందని నమ్ముతున్నా అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు రవిశంకర్ , నవీన్ యెర్నేని, దర్శకుడు రాహుల్ సంకృత్యన్ పాల్గొన్నారు.










## డాన్సర్స్ అసోసియేషన్ ఎన్నికలకు హైకోర్టు బ్రేక్

### రేపు జరగాల్సిన ఎన్నికలపై స్టే

తెలుగు ఫిలిం అండ్ టివి డాన్సర్స్ అండ్ డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఎన్నికల వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 11న నిర్వహించ తలపెట్టిన ఎన్నికలను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు నిలిపివేసింది. ఎన్నికలకు ముందే వివాదాన్ని విచారించకుండా, ఎన్నికల అనంతరం విచారణకు తేదీ నిర్ణయించడంపై ట్రయల్ కోర్టు తీరును తప్పుబట్టింది. పిటిషనర్కు మధ్యంతర రక్షణ కల్పిస్తూ సెప్టెంబర్ 28న జారీ చేసిన డాకెట్ ఆర్డర్ను సస్పెండ్ చేసింది. పిటిషనర్ సెప్టెంబర్ 28న దావాతో పాటు ఎన్నికలను నిలిపివేయాలని కోరుతూ మధ్యంతర దరఖాస్తు దాఖలు చేశారు. అయితే, ట్రయల్ కోర్టు అత్యవసర నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణను నవంబర్ 3, 2026కి నిర్ణయించింది. ఎన్నికలు 11న జరగాల్సి ఉన్నప్పటికీ, వాటిని నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేదు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ పిటిషనర్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అక్టోబర్ 8న విచారణ చేపట్టిన జస్టిస్ ఎం.బి. లక్ష్మి ధర్మాసనం, ట్రయల్ కోర్టు ఉత్తర్వుల్లో మధ్యంతర ఉపశమనం నిరాకరించడానికి గల కారణాలు స్పష్టంగా లేవని పేర్కొంది. దసరా సెలవుల అనంతరం కోర్టు పునఃప్రారంభమయ్యే అక్టోబర్ 30, 2026న ఈ కేసును విచారణకు జాబితా చేయాలని హైకోర్టు ఆదేశించింది.

## సింథటిక్ మాంజా విక్రయిస్తే లైసెన్సులు రద్దు!

### అరణ్యభవన్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో అటవీ దళాల అధిపతి వినయ్‌కుమార్ సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గాలిపటాల మోజు మూగజీవాల పాలిట మృత్యుపాశంగా మారకూడదని, నిషేధిత సింథటిక్ మాంజా విక్రయాలు, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని అటవీ శాఖ నిర్ణయించింది. చైనా మాంజా విక్రయించే దుకాణాల లైసెన్సులు రద్దు చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఆన్‌లైన్ విక్రయాలు, ఇతర రాష్ట్రాల నుంచి జరిగే అక్రమ సరఫరాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని అటవీ దళాల అధిపతి వినయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పక్షి పాలపిట్టతో పాటు ఇతర పక్షులు, వన్యప్రాణుల రక్షణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అరణ్యభవన్‌లో శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సింథటిక్ మాంజా నియంత్రణ, పాలపిట్టల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన దిశానిర్దేశం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే దుకాణాలపై కఠినంగా వ్యవహరించాలని, నిషేధిత మాంజా విక్రయాలు, వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ఈ సమీక్షలో సీసీఎఫ్‌లు ప్రియాంక వర్గీస్, క్షితిజ, సిఎఫ్ ప్రసాద్‌తో పాటు పోలీసు, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, పాఠశాల విద్య, సినిమాటోగ్రఫీ, సమాచార ప్రసార, విద్యుత్తు, కాలుష్య నియంత్రణ మండలి, పర్యాటక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సిఎం ప్రత్యేక భేటీ

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదు కాగా, దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై ముఖ్యమంత్రి నిర్వహించే సమావేశంలో చర్చించే అవకాశముందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

## నోబెల్ శాంతి

(మొదటి పేజీ తరువాయి)

ఆ తరువాత కూడా ఆమె న్యాయవాదిగా, న్యాయమూర్తిగా విశిష్టమైన సేవలందించారు. వర్ణవివక్షతో కూడిన అన్యాయాన్ని సవాలు చేస్తూ, మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేశారు. ఆమె రువాండా అంతర్జాతీయ క్రిమినల్ ట్రిబ్యునల్‌లో న్యాయమూర్తిగా పనిచేశారు. 1994లో రువాండాలో జరిగిన మారణహోమానికి సంబంధించిన నేరాల విచారణలో ఈ ట్రిబ్యునల్ కీలక పాత్ర పోషించింది. అనంతరం ఆమె అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో న్యాయమూర్తిగా పనిచేశారు. 2008 నుంచి 2014 వరకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అలాగే, ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లో మానవ హక్కుల ఉల్లంఘనలపై విచారణ జరిపిన ఐక్యరాజ్యసమితి కమిషన్‌కు నాయకత్వం వహించారు. నవీ పిళ్లై సేవలు అంతర్జాతీయ న్యాయం, బాధ్యతాయుత పాలన, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు సంబంధించిన రంగాల్లో కీలకంగా నిలిచాయి. నోబెల్ శాంతి బహుమతి ప్రపంచవ్యాప్తంగా నిర్లక్ష్యానికి గురవుతున్న మానవతా సంక్షోభాలపై ప్రజల దృష్టిని ఆకర్షిస్తుంది. శాంతియుతంగా వివాదాలను పరిష్కరించుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది. మానవ హక్కులను, అంతర్జాతీయ చట్టాలను ప్రభుత్వాలు గౌరవించాలనే సందేశాన్ని అందిస్తుంది.

**ట్రంప్‌కు మళ్లీ నిరాశే..**

అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్‌కు మరోసారి నిరాశ తప్పలేదు. గత ఏడాది నోబెల్ శాంతి బహుమతి కోసం విశేషంగా కృషి చేసిన ఆయన, ఈసారి కూడా తన పేరును పరిశీలించాల్సిన అవసరం ఉందని పలు సందర్భాల్లో పేర్కొన్నారు. తాను ఏకంగా 8 యుద్ధాలు జరగకుండా ఆపానని, తనకంటే అర్హుడైన వ్యక్తి ఈ బహుమతికి ఉండరని రెండు రోజుల క్రితం ప్రకటించి, తాను రేసులోనే ఉన్నానని చెప్పకనే చెప్పారు. అయితే, ఈసారి నవీ పిళ్లైని ఎంపిక చేయడం ద్వారా నోబెల్ ఫౌండేషన్ తన విజ్ఞతను చాటుకుంది. ఈ బహుమతిని ట్రంప్‌కు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పుగా కాకుండా, రాజకీయ అధికారం, అంతర్జాతీయ చట్టం, న్యాయం మధ్య ఉన్న సంబంధంపై విస్తృత చర్చకు దారితీసే అంశంగా అర్థం చేసుకోవాలి.




## 98 శాతం పోలింగ్!

(మొదటి పేజీ తరువాయి)

సుమారు 98 శాతం పోలింగ్ నమోదైంది. దాదాపు పదేళ్ల విరామం తర్వాత ఎన్నికలు జరగడంతో కార్మికులు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. తమ సమస్యల పరిష్కారానికి పోరాడే సంఘానికి మద్దతుగా ఓటు వేశారు. వేతన సవరణ, పెండింగ్ బకాయిల చెల్లింపు, ఉద్యోగ భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలు, ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీన ప్రక్రియలో కార్మిక సంఘాల ప్రాతినిధ్యం వంటి అంశాలు ఈ ఎన్నికల్లో కీలకంగా మారాయి. ఎన్నికల ఫలితాలపై కార్మిక సంఘాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ నెల 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ప్రక్రియ నిర్వహించనుండగా, 17న ఫలితాలను అధికారికంగా ప్రకటించనున్నారు.

**గెలుపుపై ఇయు కూటమి ధీమా!**

ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు) కూటమి విజయం సాధిస్తుందని ఆ సంఘం వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడిన తమకు ఓటర్లు మద్దతుగా నిలిచారని పేర్కొంటున్నాయి. మరోవైపు ఇతర సంఘాలు సైతం తమకే కార్మికుల మద్దతు లభించిందని ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అధిక పోలింగ్ నేపథ్యంలో ఫలితాలపై ఉత్కంఠ మరింత పెరిగింది. అయితే, ఏ సంఘానికి ఎంతమేర మద్దతు లభించిందన్నది ఈ నెల 17న వెలువడే ఫలితాలతో స్పష్టంకానుంది. రాష్ట్రంలోని తార్నాక, కోరుట్ల, దుబ్బాక, నార్కట్‌పల్లి, హుజూరాబాద్, నిర్మల్, ఉట్నూర్, భైంసా, హుస్నాబాద్, జగిత్యాల, మంథని, కోదాడ, సత్తుపల్లి, మధిర, ముషీరాబాద్, చెంగిచెర్ల, కరీంనగర్ 1, జనగామ తదితర డిపోలలో ఎంప్లాయీస్ యూనియన్ కూటమి విజయం సాధించినట్లు సమాచారం.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com